ప్రజాశక్తి ఆదివారం అనుబంధం



స్నేహ

జనవరి 3, 2010

Entered
కథా నిలయం
Entered
శ్రీకాకుళం

బొద్దు ముద్దే కానీ ...

హ్యాపీబర్త్‌డే

(2010 జనవరి 3 నుంచి
2010 జనవరి 9 వరకు)

పి.ప్రణీత
1సం॥,జనవరి-3
సరస్వతి-జమలయ్య
జవహర్‌నగర్-హైదరాబాద్

రిషిత
1సం॥,జనవరి-5
సరిత-మల్లేష్
మంచిర్యాల-ఆదిలాబాద్

పి.శ్రీవెన్నెల
2సం॥,జనవరి-4
సుజాత-రాజారావు
విజయనగరం

జి. హర్షిత్
1సం॥,జనవరి-5
అశ్వని-ప్రేమ్‌బాబు
అల్వాల్-సికింద్రాబాద్

ఆర్. నవ్యశ్రీ
5సం॥,జనవరి-7
లక్ష్మి-చంద్రశేఖరరావు
బంజరాహిల్స్-హైదరాబాద్

ఎన్. రక్షిత
3సం॥,జనవరి-4
దుర్గ-శ్రీనివాస్
లక్ష్మీపురం-వరంగల్

సిహెచ్. రాణాప్రతాప్
2సం॥,జనవరి-3
సుజాత-రాజశేఖర్
బాల్టిమోర్-అమెరికా

ఆర్.వెంకటేష్‌గౌడ్
జనవరి
ధనలక్ష్మి-యాదగిరి
ఉప్పల్

ఆర్.సి. బోసు
జనవరి
వరలక్ష్మి-కృష్ణమూర్తి
ఉప్పల్

ఆర్. స్నేహలత
జనవరి
వరలక్ష్మి-కృష్ణమూర్తి
ఉప్పల్

ఆర్. సుభాషిణి
జనవరి-4
శ్రీదేవి-గిప్పన్
ఎమ్మిగనూరు-కర్నూలు

ఎస్. మౌనిక
3సం॥,జనవరి-2007
నాగమణి-సత్యమూర్తి
మాధవధార-విశాఖపట్నం

షఫి-సమీర్
జనవరి-4
ఫాతిమా-పేక్షావలి
ఎమ్మిగనూరు-కర్నూలు

ఎస్. కార్తికేయ్
4సం॥,జనవరి-2006
లక్ష్మీప్రభ-రామాంజనేయులు
కళింగనగరం-విశాఖ

కథా నిలయం
ENTERED
శ్రీకాకుళం

మనలో మాట

అల్లుళ్ల పండుగ

ఎప్పుడూ గానుగెద్దులాగా బతుకు ఒకే పద్ధతిలో నడిస్తే కిక్కేముంటుంది! అందుకేనేమో పండుగలూ పబ్బాలూ వచ్చాయి. ప్రకృతి మార్పులకు, పంటలకు అనుగుణంగా పండుగలు చేసుకుంటుంటాం. ఉన్నంతలో విభిన్నంగా గడుపుతాం. ఎన్ని చెప్పకున్నా ఏ పండుగ ప్రత్యేకత దానిదే. అయినప్పటికీ .... 'పురుషులలో పుణ్యపురుషులు వేరయా' అన్నట్టు పండుగలలో సంక్రాంతి పండుగ శోభే వేరు.

పల్లెల్లో పంటలు ఇంటికి వస్తాయి. గాదెలు నిండుతాయి. సంతోషంగా వుంటారు. ఈ ఆనంద సమయంలో గాలి పటాలు ఎగురవేయడం, కోళ్లపందాలు ఆడడం, గొర్రె-పొట్టేళ్ల పందాలు, ఎడ్ల పందాలు పెట్టుకోవడం పరిపాటి. హరిలో రంగ హరి అంటూ భిక్షాటన చేసే హరిదాసు, సన్నాయి మోగిస్తూ, డోలు వాయిస్తూ గంగిరెద్దులనాడిస్తూ వచ్చే గంగిరెద్దులవాడు, భోగిమంటలు, మట్టికుండలో ఉడికే పాయసం సువాసనలు, గొబ్బిలు, ఆటపాటలు...ఎన్నని చెప్పాలి. ఈ శుభసందర్భంలో ఊళ్ల నుంచి వచ్చిన కూతుళ్లు, అల్లుళ్లు, కోడళ్లు, కొడుకులు, మనవలు, మనవరాళ్ళతో ఇల్లంతా కళకళలాడుతుంటుంది. శక్తికొలదీ వీరికి బట్టలు, బహుమతులు అందించి సంతోషపడుతుంటారు. బాగా గిట్టుబాటవుతుంది కాబట్టేనేమో! అల్లుళ్లకు ఈ పండుగంటే అంత మోజు. క్రేజు. పుట్టకొకరు, చెట్టుకొకరుగా నివసించేవారు కూడా సంక్రాంతి నాటికి స్వగ్రామం చేరుతుంటారు. ఈ దెబ్బకు పట్టణాలు బోసిపోవడం, బస్సులు కిటకిటలాడడం, పల్లెలు పుల్లవడం చూస్తుంటాం.

అల్లుళ్లకు... అందులోనూ కొత్త అల్లుళ్లకు ఇష్టమైన పండుగ సంక్రాంతి. మామూలుగా పెళ్లాన్ని పుట్టింటికి పంపడానికి విసుక్కునే అల్లుళ్లు సైతం సంక్రాంతికి మామగారింటికి వెళ్లడానికి నెల్లాళ్ల ముందే రెడీ అయిపోతుంటారు. ఫ్యామిలీ మొత్తం పెట్టే బేడా సర్దుకుని పార్సిలవుతుంటారు.

ఈసారి సంక్రాంతి పండుగ మాత్రం అత్తమామల గుండెల్లో రైళ్లు పరిగెత్తిస్తోంది. ధరలు చూస్తే ఆకాశంలో డిస్కో డాన్స్ చేస్తున్నాయ్. అందేట్టు లేవు. కొనేట్టు లేవు. పెట్టిపోతల సంగతి పైవాడికెరుక! ఇంటికొచ్చిన అల్లుడికి ఏం వండిపెట్టాలా అని తల బాదుకోవాల్సివస్తోంది. ఒక అల్లుడంటే ఫర్వాలా! ఎలాగోలా ఏర్పాటుచేయొచ్చు!! ఇద్దరు అల్లుళ్లుంటే మరీ ఇరకాటం. కొత్తల్లుడికి మంచి బహుమతిస్తే... పెద్దల్లుడికి కోపం. పోనీ ఇద్దరికీ ఒకేరకంగా ఇద్దామా అంటే అంత సీన్ వుండదు. బాగా ఆలోచించి కొత్త అల్లుడినే గౌరవిద్దామా అంటే పెద్దల్లుడిని నిర్లక్ష్యం చేసినట్టవుతుంది. ఎవరిని ఎలా సంతుష్టి పరచాలో తెలిస్తే ఇంకేం. అందుకేనేమో జామాతా దశమగ్రహం అన్నారు. నానా తంటాలుపడి శనినయినా వదిలించుకోవచ్చుగానీ, జామాతను వదలించుకోవడం కష్టం.

చూడాలి! ఈసారి రాష్ట్రంలో మూడు బందులు, నాలుగు సమ్మెలుగా వుంది. బస్సులు పండుగ నాటికి వుంటాయో వుండవో. బందు లేకపోతే అత్తమామలకు కూసింత ఉపశమనం లభిస్తుంది. కానీ అల్లుళ్లు తక్కువ తిన్నారా! తమకు రావాల్సిన వాటిని తర్వాతైనా పార్సిల్ చేయమనరూ. అదీ కాకపోతే విమానంలో వచ్చయినా సరే చార్జీలతో సహా అత్తమామల దగ్గర వసూలు చేయరూ!

★

ఈ సంచికలో....

టపా	...	2
తెల్సా	...	3
కవిత్వమ్	...	6
విజ్ఞాన వీచిక	...	7
కథ	...	8
సినిమా కబుర్లు	...	11
క్రైమ్ కథ	...	12
రుచి	...	13
రంగును బట్టి మూడ్	...	16
అట్టమీది కథ	...	18
నవ్వుల్ పువ్వుల్	...	21
బాలనేస్తాలు	...	22
'మందు'తోనే		
మానవుల మనుగడ	...	24
చిన్నకథ	...	25
చూద్దామా	...	26
వికాసం	...	28

ఇంకా...

స్ఫూర్తి ... 4

ఆయన పథం
మహోత్తేజం



కొత్త పుస్తకాలు ... 10



జాతులు భాషలపై
సైద్ధాంతిక దృష్టి

ఆరోగ్యం ... 17

పరీక్షలంటే భయమేల?



శ్రమదోపిడీని చెప్పిన కథ

"చాలీచాలని జీతం, నిండీనిండని ఉదరం, కొండెక్కిన నిత్యావసరాల ఫలితం" అంటూ ప్రారంభమైన 'స్వప్నంలో చిరునవ్వు' కవిత సమకాలీన వాస్తవాలకు దర్పణం పట్టింది. నిత్యావసరాల ధరల గుదిబండల కింద సామాన్యులు చితికిపోతుంటే ఉదాసీనంగా చోద్యం చూస్తున్నారు పాలకులు. మైకుల్లో మాత్రం మీకోసమే మేమంటూ ఆవేశంగా ఉపన్యసిస్తూ అత్యద్భుతంగా నటిస్తున్నారు. 'నిత్యావసరాలు ఆత్మహత్యావసరాలను సృష్టిస్తున్నాయా?' అన్న పంక్తి దగ్గర నిజంగానే మనసు ఉలిక్కి పడింది. మనిషి నరనరాల్లోనూ పేరుకుపోయిన శ్రమదోపిడీ సంస్కృతిని తేటతెల్లం చేసింది 'అలగా గుంపు' కథానిక. నిత్య జీవితంలో జరిగే ఓ మామూలు సంఘటనను వస్తువుగా తీసుకుని అతి సాధారణ శైలిలో అసాధారణ జీవన వాస్తవాన్ని అత్యద్భుతంగా అక్షరీకరించాడు రచయిత. "పెట్టేదగ్గర వేలూ, లచ్చులూ బడాయిగా పెడతారు. ఎక్కడెక్కడి వాళ్లు తిన్న ఎంగిలి విస్తళ్లు ఎత్తేసిన మన దగ్గరికి వచ్చేసరికి పేచీలు పెట్టి గీచిగీచి బేరాలు చేత్తాడు పెతీవోడూ" అంటూ మనుషుల దౌర్భల్యంపై వేసిన చురకలు అక్షరసత్యాలు. 'ఏం చదువులో ఏంటో' ఆలోచన రేకెత్తించేదిగా వుంది. నిజమే చదువుల సమరంలోపడి పిల్లలు తమ మూలాలను, ఆత్మీయ మానవ సంబంధాలను కోల్పోతున్నారు. దాని ఫలితమే ఒత్తిళ్ల, ఆత్మహత్యలు. జీవితాన్ని యాంత్రికం చేసే ఇటువంటి చదువులు మనకవసరంలేదు.

ఆర్.విజయ్ కుమార్, ఏలేశ్వరం.

కాలుష్య ముప్పును కళ్లకు కట్టారు

కాలుష్య ఉద్గారాలను విచ్చలవిడిగా వదులుతున్న ధనిక దేశాల వల్ల వస్తున్న ముప్పు గురించి బాగా తెలియజేశారు. అత్యధిక ఉష్ణోగ్రత వల్ల మంచు కరిగి సముద్రాలు పొంగి పల్లపు దేశాలను, ద్వీపాలను ముంచేస్తాయి. దేశాభివృద్ధిలో ప్రధానమైన 25 రంగాలు వాతావరణ మార్పుల వల్ల తీవ్రంగా ప్రభావితం అవుతాయి. గ్లోబల్ వార్మింగ్ నుండి భూమిని కాపాడుకోవాలని అన్ని దేశాలు చూస్తున్నాయి. అందుకే కోపెన్‌హాగెన్‌లో జరిగిన సమావేశంలో కింది విధంగా తీర్మానం చేశారు. వాతావరణ మార్పుల వల్ల భారత్‌కు పెను ప్రమాదం పొంచి వుంది. వాతావరణ మార్పులను నియంత్రించేందుకు శక్తిమేరకు పోరాడవలసి వుంది. ప్రపంచ దేశాలను తక్కువ కర్బన ఉద్గారాలను విడుదల చేసేవైపుకు నడిపించాల్సిన బాధ్యత భారత్‌పై వుంది.

టి.శ్రీరామమూర్తి,
గాజువాక, విశాఖ.

చదువుకోకపోతే నేమి!

భూతాప ఉపద్రవం నుండి తప్పుకోవాలని రెండు వారాల పాటు డెన్మార్క్‌లోని కోపెన్ హాగెన్ నగరంలో జరిగిన వాతావరణ శిఖరాగ్ర సదస్సు వాతావరణ మార్పులపై సమతుల్యమైన ఒప్పందాన్ని సాధించడంలో పూర్తిగా విఫలమైంది. "భూమికి హామీ!" 'కవర్‌స్టోరీ' ద్వారా చాలా విషయాలు తెలిశాయి. గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ వల్ల భూతాపం పెరిగి భూవాతావరణానికి ముప్పు ఏర్పడుతున్నది. కానీ అమెరికా, ఐరోపా కూటమికి చెందిన దేశాలు ఇందుకు విరుద్ధంగా వ్యవరించి సదస్సు లక్ష్యాలను విఫలం చేశాయి. భూతాప ఉపద్రవ నివారణ కోసం ప్రజలు ఉద్యమించాలి. బోల్షివిక్ పార్టీ చరిత్ర గురించి ఆ స్ఫూర్తితో పెద్దగా చవువుకోక పోయినా ఉద్యమ బాట పట్టి తన అనుభవాలను తెలియజేసిన సోదరి టి. లక్ష్మమ్మకు ధన్యవాదాలు.

టి. ఎస్.మూర్తి,విశాఖపట్నం.

కథ బాగా నచ్చింది

అలగా గుంపు కథ మాకు బాగా నచ్చింది. ఈ కథలో ఎంగిలి విస్తళ్లు తీసేయడమన్నది ఏ చిన్న సంబరం కానీ, వేడుక కానీ జరుపుకున్నపుడు అతి సహజంగా జరిగేదే. కానీ ఈ సంబరాల్లో ఎంత ఖర్చుపెట్టినా కూడా విస్తళ్లు తీసేవారి విషయంలో మాత్రం ప్రతి ఒక్కరూ ఇలాగే ఆలోచిస్తుంటారు. కథా రచయిత వారి జీవన స్థితిని చక్కగా వివరించారు. విజ్ఞాన వీచికలో 'జీవ బ్యాటరీలు' అనే అంశం మమ్మల్ని బాగా ఆకట్టుకుంది. వైరస్‌తో బ్యాటరీలను తయారు చేయవచ్చనీ, అందులోనూ ఎక్కువసార్లు రీ చార్జ్ చేసుకునే వీలుంటుందంటే అవి ఎంతగా ఉపయోగపడతాయో తెలుస్తోంది. నేటి పరిస్థితుల్లో చాలా వస్తువులు అంటే ఇంట్లో వాడుకునే ఆట బొమ్మల దగ్గర నుండి టీవీ రిమోట్ వంటి వాటి వరకూ అన్నీ బ్యాటరీలతోనే నడుస్తున్నాయి. అలాంటి బ్యాటరీలు కొంచెం తక్కువ ధరకు, ఎక్కువ కాలం మన్నేలా వుంటే అందరికీ వుపయోగంగా వుంటుంది. అట్టమీది కథలో నేటి వాతావరణ పరిస్థితులు, పర్యావరణాన్ని రక్షించుకోకపోతే



జరిగే పర్యావసానాలేంటి? గ్రీన్‌హౌస్ ఎఫెక్ట్ వల్ల వచ్చే పరిణామాలు, కోపెన్‌హాగెన్ సదస్సులో జరిగిన తీర్మానాలు, నిర్ణయాలు అన్నీ చక్కగా వివరించారు.

ఆర్. ఉమామహేశ్వరరావు,
విశాఖపట్నం.

మానవసంబంధాలు అవసరం

ఎవడి గోల వాడిది శీర్షికలో ఎన్నో కబుర్లు చెప్పారు. అవి చదవటానికి సరదాగా వుండి, కొన్ని విషయాలు తెలుసుకున్నట్లుగా కూడా వుంది. ఇలా ప్రతి వారం ఒక శీర్షిక అందిస్తారని ఆశిస్తున్నాం. 'వికాసం' శీర్షిక చదువుతుంటే నేటి పిల్లలకు మానవ సంబంధాల పట్ల ఎంత అవగాహన వుందో తెలుస్తోంది. వీరికి బంధువులు, వారి ఆత్మీయతలు అసలు తెలీడంలేదు. కనీసం ఇంటికి ఎవరైనా వచ్చినపుడు వారిని పలకరిద్దామన్న ఆలోచన కూడా లేకుండా చదువు, ట్యూషన్లు, టీవీ... ఇవే వారి ప్రపంచమై పోయాయి. స్ఫూర్తిలో టి.సి లక్ష్మమ్మ గారిని బోల్షివిక్ పార్టీ చరిత్ర అనే పుస్తకం ఎంతగా ప్రభావితం చేసిందో, ఆ స్ఫూర్తితో ఆవిడ పార్టీకోసం చేసిన కార్యక్రమాలు గురించి చక్కగా చెప్పారు. 'కవిత' శీర్షికలో వచ్చిన 'స్వప్నంలో చిరునవ్వు' బావుంది.

డి.ఆర్.భారతి, విజయవాడ.

★

మంచుగడ్డలు విసిరే ఆట

విదేశాలలో ఎన్నో చిత్ర విచిత్రమైన ఆటలు ఆడుతుంటారు. పరిహాసానికి, వ్యాయామానికి, మానసిక ఎదుగుదలకు ఇలా రకరకాల ఉపయోగాల కోసం రకరకాల ఆటలు. వాటిలో స్నోబాల్ ఫైట్ ఒకటి. ఈ ఆటలో ఇతరుల మీదకు మంచుగడ్డలను విసిరేస్తారు. ఎక్కువ మంచు పడే ప్రదేశాల్లోనే ఈ ఆటను ఆడతారు. మంచు ఎక్కువగా ఉండే ప్రాంతాలలో మన నాగరికత ప్రారంభంలోనే ఈ ఆటను కనుక్కున్నారు. ఈ ఆట ప్రాముఖ్యతను బట్టి పశ్చిమ దేశాల వారు దీన్ని గుర్తించారు. అయితే ఇక్కడా కొన్ని నియమాలు ఉన్నాయండోయ్.



రెండు కాళ్ల శునకం

ఏదైనా చిన్న అవయవ లోపముంటే మనుషులే ఆత్మస్థైర్యాన్ని కోల్పోయి నిరుత్సాహపడతారు. కానీ ఒక కుక్క తనకు రెండు కాళ్లు లేకపోయినా నడక నేర్చుకుని యుద్ధంలో అవయవాలు కోల్పోయిన వారికి స్ఫూర్తిగా నిలిచింది. అమెరికాలో ఒక కుక్క రెండే కాళ్లతో పుట్టింది. దానికి ఇప్పుడు 7 సంవత్సరాలు. అది అంగవైకల్యంతో పుట్టటంతో తల్లి దానిని నిరాకరించింది. అయితే రూబెన్ స్ట్రింగ్‌ఫెలో దాన్ని దగ్గరకు తీసి ఇంటికి తెచ్చుకున్నాడు. ఆయన, ఆయన తల్లి జూడె (ఇంగ్లీషు ప్రొఫెసర్) కొన్ని నెలలవరకు దాన్ని ఎక్కడికైనా ఎత్తుకునే తీసుకెళ్లేవారు. వారు దానికి ఫెయిత్ అని పేరు పెట్టారు. దానికి ఓపికగా బలమైన ఆహారం పెట్టడం వల్ల అది తన రెండు కాళ్లతో నడవడం నేర్చుకుంది. 2003 మార్చిలో అది నడక నేర్చినప్పటి నుంచి అమెరికాలోని ప్రతి టాక్‌షోలో అతిథిగా ఉంటోంది. గాయపడిన సైనికులకు ఆత్మవిశ్వాసంగా మారింది. జూదె ఒక వెబ్‌సైటును ఈ కుక్కకు అంకితమిచ్చి నడుపుతోంది. దానికి రోజుకు 200కు పైగా ఉత్తరాలు, ఈమెయిళ్లు వస్తుంటాయి. దాని అభిమానులు తమకు స్ఫూర్తినిస్తుందని చెప్తున్నారు. 'మనకున్న శరీరాన్ని బట్టి కాదు, మన ఆత్మను బట్టి మన అందమనేది ఉంటుందని ఫెయిత్ నాకు తెలియజేసింది' అని కెనడాకు చెందిన జిల్ సాలోమోన్ వెబ్‌సైటులో తెలిపారు. అవయవాలు కోల్పోయిన వారికి ధైర్యం చెప్పడానికి జూడె ఆ కుక్కను రోజూ వెటరన్స్ హాస్పటల్‌కు తీసుకెళ్తుంది. తన కొడుకు ఇరాక్‌లోని యుఎస్ సైన్యానికి చేస్తున్న సేవకు ఆ సంస్థ స్ఫూర్తి చెందింది. ఈమధ్య మెక్‌కార్డ్ ఎయిర్ ఫోర్సు బేస్, వాషింగటన్‌లోని ఫోర్టు లూయిస్‌లను సందర్శించినప్పుడు యుద్ధంలో పాల్గొన్న, ఈ మధ్యే తిరిగి వచ్చిన సైనికులలో సంతోషాన్ని తీసుకువచ్చింది. ఫెయిత్ నవ్వుతూ చుట్టూతా నడుస్తూ అక్కడ ఉన్న సైనికులలో ఉత్సాహాన్ని నింపుతుంది.

తెలుసా!

ఇంట్లో తయారైన యుద్ధవిమానం

పి-51డి మస్టంగ్ అనేది రెండో ప్రపంచ యుద్ధ సమయంలో అమెరికా ఉపయోగించిన పొడవైన యుద్ధవిమానం. దీని డూపునే డెంటిస్టు యంగ్ సి పార్క్(77) తయారుచేశాడు. అందుకోసం 6,000 గంటల పాటు కష్టపడ్డాడు. దాదాపు మూడు సంవత్సరాలలో పూర్తిచేశాడు. గజిబిజిగా ఉన్న చిన్న చైన్లతో, వైర్లతో, తలుపులతో కనిపిస్తున్నా...ప్రతి భాగమూ పనిచేస్తుంది. దీన్ని సాధారణ అల్యూమనియంతో చేశారు. పార్క్ తాను అనుకున్న ఫలితం వచ్చేవరకూ దాదాపు 50 అడుగుల అల్యూమినియంను కరగదీసి దీనికి పి-51 ఆకృతిని తీసుకువచ్చాడు. చెక్క మీద అల్యూమినియం పోతను పోశాడు. మందుగుండు సామాన్లను ఎడమ రెక్కలో ఉంచాడు. దంతాల పనిలో బంగారాన్ని ఉపయోగించడానికి, ఇక్కడ అల్యూమినియంతో పనిచేయడానికి పెద్ద తేడా ఏమీ లేదంటాడు పార్క్. రెండింటిలో దేనినైనా వేడిచేసి మనకు కావాల్సిన ఆకారంలోకి మార్చుకోవడం చాలా కష్టమే. విమానం ప్రధాన చట్రానికి, రెక్కల పైభాగానికి రంధ్రాలను పెట్టడానికి తన డెంటల్ పరికరాలను వాడారు. ఆ విమానం 25 అంగుళాల పొడవు, 10 ఇంచుల ఎత్తు, రెక్కల దగ్గర దాని వెదల్పు 27 అంగుళాలు ఉంది. దీనిని ప్రస్తుతానికి కాలిఫోర్నియాలోని విస్తాలో మార్టిన్ ఫౌండేషన్ క్రాఫ్ట్‌మెన్ మ్యూజియంలో ఉంచారు. పి-51డి బాంబులను పసిగట్టడంలోనూ, గూఢచర్య దృష్టిలో భూపరిశీలన చేయడంలోనూ ఉపయోగపడింది. రెండో ప్రపంచ యుద్ధం చివరి వరకు 4,950 శత్రు విమానాలను ధ్వంసం చేసింది. యూరప్‌లో ఏ ఇతర యుద్ధవిమానం కూడా ఇటువంటి సేవలందించలేదట.



స్ఫూర్తి

కందారపు మురళి,
సిపిఎం రాష్ట్ర కార్యవర్గ సభ్యులు.

ఆయన పథం మహోత్తేజం



పదవ తరగతి తర్వాత హేతువాదం పట్ల నాలో ఆసక్తి పెరిగింది. ఓ మిత్రుడిచ్చిన కరపత్రాలు, చిన్నసైజు పుస్తకాలు చదివేవాణ్ణి. తిరుపతిలో హేతువాద సభలంటే మా మిత్రులంతా కలిసి వెళ్లేవారం. ప్రసంగాల గురించి చర్చించుకునేవారం. ఇంటర్మీడియట్ చదువుకునే రోజుల్లో ఓ లెక్చరర్ కారణంగా కమ్యూనిస్టు పార్టీ అంటే ఆసక్తి పెరిగింది. 1987వ సంవత్సరం నాటికి నాకు పద్దెనిమిదేళ్లు. మేము నివాసముంటున్న వార్డులో సిపిఎం- సిపిఐ రెండు పార్టీలు కౌన్సిలర్ పదవికై పోటీ చేశాయి. వార్డులోని మిత్రులంతా ఏ కమ్యూనిస్టు పార్టీకి మద్దతునివ్వాలని సమాలోచన చేశాము. అప్పటికి ఆ రెండు పార్టీలకు తేడా మాకు అర్థం కాలేదు. రెండు పార్టీల అభ్యర్థుల గుణగణాలను లెక్కలోకి తీసుకుని సిపిఎంకు మద్దతు ప్రకటించాము. మద్దతు ప్రకటించడమే కాదు అన్నీ మేమే అయి వార్డులో మంచి కృషి చేశాము. అప్పటికే వార్డులో ఉన్న పేదల పక్షాన సిపిఎం పోరాడి తగిన బలం కలిగి ఉంది. మేము నివాసం ఉన్న ప్రాంతం మధ్యతరగతి ప్రజలు, ఉద్యోగులతో ఉంటుంది. అప్పటికే ఉన్న బలానికి మేమూ తోడుకావటంతో సిపిఎం ఆ ఎన్నికల్లో గెలిచింది.

అప్పటి నుంచి సిపిఎంతో అనుబంధం ప్రారంభమైంది. పుస్తకాలు చదవటమంటే డిటెక్టివ్ నవలలు, వారపత్రికలు, కథల పుస్తకాలు మాత్రమేనని అప్పటికి తెలుసు. ప్రస్తుత జిల్లాకార్యదర్శి కె.కుమార్‌రెడ్డి గారు మా ఆగ్జిలరీ కమిటీకి కార్యదర్శిగా ఉంటూ కొన్ని పుస్తకాలు చదివించేవారు. ఆ సందర్భంలో 'మహావిశ్వం, వానరుడు నరుడిగా మారిన క్రమం, అమీర్‌హైదర్ ఖాన్ ఆత్మకథ, చైనాపై అరుణతార, ఏడుతరాలు' వంటి గ్రంథాలు నామీద ఎంతగానో ప్రభావం చూపాయి. వీటన్నింటిలోకి నామీద గణనీయమైన ప్రభావం చూపిన పుస్తకం, కమ్యూనిస్టు పార్టీ మీద ఎనలేని గౌరవాన్ని, కమ్యూనిస్టులతో కలిసిపోవాలన్న భావాన్ని విపరీతంగా పెంచిన పుస్తకం "విప్లవపథంలో నా పయనం". 22 ఏళ్ల కిందట చదివినపుడు రెండు భాగాలుగా ఉన్న ఈ గ్రంథంలో మొదటి భాగం తేలికగా అర్థమయింది. రెండవభాగంలో సిద్ధాంత విషయాలు ఎక్కువగా ఉండటంతో అర్థం చేసుకోవటం కష్టమైంది.

పుస్తకం చదివినపుడు నామీద గణనీయంగా ప్రభావం చూపిన విషయాలు కొన్ని.......

–పేదలకు దగ్గర కావటం కోసం పుచ్చలపల్లి వెంకట సుందరరామిరెడ్డి తనకున్న 'రెడ్డి' పదాన్ని తొలగించుకుని సుందరయ్యగా మారటం.

–హైస్కూలు చదివే రోజుల్లో జాతీయోద్యమ ప్రభావంతో ఓ విద్యార్థి గాంధీటోపి వేసుకుని స్కూలుకు వస్తే యాజమాన్యం స్కూలు నుంచి తరిమివేస్తుంది. ఈ ఘటనను వ్యతిరేకించిన సుందరయ్య అదే రోజు 500 గాంధీ టోపీలను విద్యార్థులతో కలిసి తయారు చేసి విద్యార్థులందరి చేత పెట్టించి స్కూలుకెళితే దిక్కుతోచని యాజమాన్యం గాంధీ టోపీలు పెట్టుకుని రావచ్చుని నోటీసు బోర్డులు వేయటం.

– తన గ్రామంలో 'గాంధీ' ప్రేరణతో హరిజనోద్ధరణకు శ్రీకారం చుట్టి సహపంక్తి భోజనాలు ఏర్పాటు చేస్తే గ్రామంలోని పెత్తందార్లు కార్యక్రమాన్ని జరగనీయకుండా విఫలం చేసినపుడు మంకుపట్టు పట్టి సుందరయ్య ఉపవాసదీక్షలు చేపట్టడం.

– గ్రామంలోని హరిజనుల బావి, మాదిగల బావి, పద్మసాలీల చెరువు, రెడ్ల బావి, మిగతా కులాలు (దళితులు మినహా) నీళ్లు తెచ్చుకునే బావుల నుంచి నీళ్లు తెప్పించి అన్నింటినీ కలిపి ఆ నీళ్లను తాగించటం, గ్రామంలోని యువకులతో సహపంక్తి భోజనాలు నిర్వహించిన వైనం.

– ప్రతిరోజూ కనీసం 50-60 మైళ్లు నడిచి వెళ్లి పనులు చేసుకురాగలిన ఓర్పు- శ్రమ- ధైర్యం.

– సైకిల్‌పై మద్రాసు- అలగానిపాడుకు 3సందర్భాలలో కమ్యూనిస్టు పార్టీ పనిపై అలవోకగా వెళ్లిరావటం.

– రహస్య జీవితంలో పార్టీ పత్రికలు

అప్పటి నుంచి సిపిఎంతో అనుబంధం ప్రారంభమైంది. పుస్తకాలు చదవటమంటే డిటెక్టివ్ నవలలు, వారపత్రికలు, కథల పుస్తకాలు మాత్రమేనని అప్పటికి తెలుసు. ప్రస్తుత జిల్లాకార్యదర్శి కె.కుమార్‌రెడ్డి గారు మా ఆగ్జిలరీ కమిటీకి కార్యదర్శిగా ఉంటూ కొన్ని పుస్తకాలు చదివించేవారు. ఆ సందర్భంలో 'మహావిశ్వం, వానరుడు నరుడిగా మారిన క్రమం, అమీర్‌హైదర్ ఖాన్ ఆత్మకథ, చైనాపై అరుణతార, ఏడుతరాలు' వంటి గ్రంథాలు నామీద ఎంతగానో ప్రభావం చూపాయి. వీటన్నింటిలోకి నామీద గణనీయమైన ప్రభావం చూపిన పుస్తకం, కమ్యూనిస్టు పార్టీ మీద ఎనలేని గౌరవాన్ని, కమ్యూనిస్టులతో కలిసిపోవాలన్న భావాన్ని విపరీతంగా పెంచిన పుస్తకం "విప్లవపథంలో నా పయనం". 22 ఏళ్ల కిందట చదివినపుడు రెండు భాగాలుగా ఉన్న ఈ గ్రంథంలో మొదటి భాగం తేలికగా అర్థమయింది. రెండవభాగంలో సిద్ధాంత విషయాలు ఎక్కువగా ఉండటంతో అర్థం చేసుకోవటం కష్టమైంది.

పంచడానికి గుడివాడ నుంచి విజయవాడ వరకు ఒక్కరాత్రిలోనే వచ్చి పత్రికలు పంచి వెళ్లటం (అదీ అడ్డదారుల్లో కాల్వగట్లు- కచ్చా రోడ్ల వెంబడి)

– 1943లో ఆస్తులు అమ్మి పార్టీ కోసం నిలబడినతీరు- ప్రారంభంలో తనకు వాటాగా వచ్చిన ఆస్తిని సైతం అన్నను తీసుకోమన్న సుందరయ్య వైఖరి.

– దళాలను నిలబెట్టడం కోసం నెలల తరబడి అడవుల్లో తిరుగుతూ కార్యకర్తల ఆత్మస్థైర్యాన్ని పెంచిన ఆయన ధైర్యసాహసాలు.

– అలగని పాడులో పేదలను దోపిడీ చేస్తున్న వ్యాపారుల నుంచి రక్షించటానికి తానే స్వయంగా సహకార దుకాణం పెట్టడం, చిన్న, చిన్న జబ్బులతో ముదరపెట్టుకుని చావుకు దగ్గరయ్యే జనానికి అండగా ఉండటానికి తాను ఆర్ఎంపి డాక్టర్ అయి మందులివ్వటం, ప్రాథమిక పాఠశాలలో టీచర్ కావటం, గ్రామంలో యువజనులకు లైబ్రరీ ఏర్పాటు చేయటం.

ఇలా చెప్పుకుంటూపోతే అనేక ఘటనలు చెప్పవచ్చు. నా మట్టుకు నన్ను చెప్పమంటే సుందరయ్య గారిని నేను స్వయంగా చూడలేదు, ఆయన ప్రసంగాలు వినలేదు. ఒక్క మాటలో చెప్పాలంటే సిపిఎంకు దగ్గరయ్యే దాకా సుందరయ్య అంటే ఎవరో తెలియదు. సిపిఎంలో పలు సందర్భాలలో సుందరయ్య గురించి ప్రస్తావనలు వచ్చేవి. ఆ నేపథ్యంలోనే సుందరయ్య జీవిత కథ చదవటం జరిగింది.

ఆ తరువాతి క్రమంలో 1989లో ప్రజాశక్తి విలేకరిగా పనిచేస్తున్నపుడు 1994లో పార్టీ జిల్లా కమిటీ సభ్యునిగా ఎన్నికయిన తర్వాత, 1997లో జిల్లా కార్యదర్శివర్గసభ్యునిగా, తరువాత నాలుగునెలల కాలానికే 1998 ఏప్రిల్‌లో జిల్లా కార్యదర్శిగా ఎంపికై సుమారు 10 సంవత్సరాలు పనిచేసిన క్రమంలో పార్టీ వైఖరులను అర్థం చేసుకోవటానికి, అమలు చేయటానికి ఈ పుస్తకం ఎంతాగానో తోడ్పడింది. అతిపిన్నవయస్సులో జిల్లా కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టిన నాకు పలుసార్లు ఉపయోగపడింది. తాజాగా వేర్పాటువాద ఉద్యమాన్ని సరిగ్గా అర్థం చేసుకోవటానికి కూడా మార్గదర్శి అయింది.

పుచ్చలపల్లి సుందరయ్య జీవిత చరిత్ర చదవటమంటే కమ్యూనిస్టు పార్టీ చరిత్ర చదవటమే. ఇప్పుడొస్తున్న వారిలో అత్యధికులకు పార్టీ చరిత్ర తెలియటం లేదు. కొత్తగా వచ్చే ప్రతి సభ్యుడు, కార్యకర్త విధిగా సుందరయ్య రచించిన ఈ పుస్తకం చదవటం ఎంతో ప్రయోజనకారి. ప్రజల్లో పనిచేయటమెలాగో సుందరయ్య పలు సందర్భాలలో విడమరచి చెప్పాడు. తన జీవితానుభవాలనుంచి మహిళల సమస్యలు, వ్యవసాయకూలీల సమస్యలను అధ్యయనం చేశాడు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని తన గ్రామం నుంచే నిర్మించి ప్రారంభించాడు.

సిపిఎం బహిరంగంగా నేడు కార్యకలాపాలు నిర్వహిస్తున్నది. ఆనాడు కమ్యూనిస్టు పార్టీ, దాని నేతలు రహస్య జీవితం సాగించారు. రహస్య జీవితంలో వారి కష్టాలను సుందరయ్య కళ్లకు కట్టినట్టు వివరిస్తారు.

ఓ చిన్న ధర్నా (లేదా) ఓ పత్రికాప్రకటన చేసి "అబ్బ! ఈ రోజుకు విప్లవ కార్యక్రమం పూర్తయింది" అనుకునే నాయకులు, కార్యకర్తలను నేనెరుగుదును. కానీ విప్లవం పట్ల దీక్షతో కష్టాలను, కన్నీళ్లను తృణప్రాయంగా చేసి మొక్కవోని దీక్షతో సుందరయ్య ప్రతి నిమిషం వ్యవహరించిన తీరు మనకందరికీ ఆదర్శం.

కాంగ్రెసు పార్టీలో ఉంటూ కమ్యూనిస్టు పార్టీని బలపరచడానికి చేసిన ప్రయత్నాలు, ఎదుర్కొన్న ఆటంకాలు ఆఖరుకు సుందరయ్య వ్యవహారశైలి గురించి మహాత్మాగాంధీ, సుభాష్‌చంద్రబోస్ లాంటి జాతీయోద్యమ నాయకులు చర్చించటం, పార్లమెంటులో సుందరయ్య ప్రసంగాలను ఆనాటి ప్రధాని నెహ్రూ నుంచి అనేక మంది జాతీయ స్థాయి నాయకులు చెవులు రిక్కించుకుని వినటం, కేంద్రమంత్రులు సైతం "సుందరయ్య ఆషామాషీ లెక్కలు చెప్పరు. క్షేత్రస్థాయికి వెళ్లి పరిశీలించండి" అని అధికారులను పురమాయించటం, శాసనసభా రంగంలోనూ ఆయన నిర్వహించిన పాత్ర, ఆయన పరిశీలనా శక్తి.....పరిష్కారాన్ని సూచించే ప్రత్యామ్నాయాలు శత్రుపార్టీలలోనూ ఆయన పట్ల గౌరవాన్ని కల్గించాయి.

ఇవన్నీ ఓ ఎత్తయితే కమ్యూనిస్టు పార్టీలో వచ్చిన విచ్ఛిన్నాలు రివిజనిజాన్ని, ఉగ్రవాదాన్ని ఏమాత్రం దయాదాక్షిణ్యాలు లేకుండా సుందరయ్య ఎదుర్కొన్న తీరు, పార్టీ ఆంతరంగిక పోరాటాన్ని నడిపి సిపిఎంను నిలబెట్టిన తీరు చదివి తీరాల్సిందే.

సుందరయ్య జీవితంలో అతి ముఖ్యమైన ఘట్టం, 'తెలంగాణ పోరాటం'. ఎక్కడో నెల్లూరు జిల్లా అలగానిపాడులో పుట్టిన సుందరయ్య తెలంగాణా పోరాటానికి నాయకత్వం వహించిన గొప్పతనం ... పోరాటాన్ని తెలంగాణాలోని 3 వేల గ్రామాలకు విస్తరింపజేసిన కమ్యూనిస్టు పార్టీ సామర్థ్యం, రహస్య దళాలను సమన్వయ పరచిన తీరు, సహచరులను, కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తలను, నేతలను ఎన్‌కౌంటర్లు చేస్తూ దారుణంగా చంపేస్తున్న ప్రభుత్వం దొరికితే చనిపోతామన్న స్థితిలోనూ నిబ్బరంగా ఉద్యమాన్ని, ఉద్యమకారులను రహస్య జీవితంలో సుందరయ్య సమన్వయం చేసిన తీరు... తెలంగాణా భూస్వాములు పల్లెలు విడిచి పట్టణాలకు పారిపోయిన వ్యవహారం. బాల్యం నుంచి........ నాయకత్వ స్థాయి దాకా సుందరయ్య జైళ్ళలో వ్యవహరించిన తీరు......ఒక్కటనేమిటి ప్రతిఘటనలోనూ సుందరయ్య జీవితం.....

పుచ్చలపల్లి సుందరయ్య జీవిత చరిత్ర చదవటమంటే కమ్యూనిస్టు పార్టీ చరిత్ర చదవటమే. ఇప్పుడొస్తున్న వారిలో అత్యధికులకు పార్టీ చరిత్ర తెలియటం లేదు. కొత్తగా వచ్చే ప్రతి సభ్యుడు, కార్యకర్త విధిగా సుందరయ్య రచించిన ఈ పుస్తకం చదవటం ఎంతో ప్రయోజనకారి. ప్రజల్లో పనిచేయటమెలాగో సుందరయ్య పలు సందర్భాలలో విడమరచి చెప్పాడు. తన జీవితానుభవాలనుంచి మహిళల సమస్యలు, వ్యవసాయకూలీల సమస్యలను అధ్యయనం చేశాడు. వ్యవసాయ కార్మిక సంఘాన్ని తన గ్రామం నుంచే నిర్మించి ప్రారంభించాడు.



అనుభవాల పుట్ట...... దాన్నుంచి ఎంతైనా సారాన్ని గ్రహించవచ్చు.

భాషా ప్రయుక్తరాష్ట్రాల ఏర్పాటు, పార్టీ తీర్మానం ఆంధ్రరాష్ట్ర అనుభవం నుంచే వచ్చిందనే పద్యాన్ని సుందరయ్య ఈ పుస్తకంలో వివరిస్తారు.

చివరిగా కార్యకర్తలతో నాయకులు ఎలా వ్యవహరించాలనే విషయాలతో పుస్తకం ముగుస్తుంది. కేవలం కార్యకర్తలేకాదు.... నాయకులు సైతం అవసరాల్ని బట్టి చదువుతూ, స్ఫూర్తి పొందుతూ ఉండటానికి ఉపయోగపడే శక్తివంతమైన గ్రంథం ఇది.

మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్, మావో లాంటి వేళ్లపై లెక్క పెట్టదగిన నాయకులలో పుచ్చలపల్లి సుందరయ్య ఒకరనటం అతిశయోక్తి కాదు. సుందరయ్య జీవితం ప్రతి కమ్యూనిస్టుకు ఆదర్శమే.

★

కవిత్వమ్

పుస్తకం

- శాంతిశ్రీ



చరిత్రను నింపుకుంటుంది
జీవితాల్ని చదివిస్తుంది
దుఃఖాన్ని కలిగిస్తుంది
విచారాన్ని వెల్లడిస్తుంది
కోపాన్ని వెళ్లగక్కుతుంది
ప్రేమను పంచుతుంది
ఉద్యమాలకు దిక్సూచవుతుంది
సమానత్వం పాటిస్తుంది
పేద-గొప్ప స్త్రీ-పురుష చిన్నా-పెద్ద
మంచీ-చెడ్డా ప్రేమ-కోపం
తారతమ్యాలు లేవంటుంది
అన్నింటికీ చోటిస్తుంది
ఎద లోతుల్ని తడుముతుంది
అమ్మలా హత్తుకుంటుంది
నాన్నలా దిశను నిర్దేశిస్తుంది
సహచరుడిలా తోడుంటుంది
నేస్తమై వెన్నంటి ఉంటుంది
రెక్కలున్నట్లే ఎగిరిపోతుంది
ప్రపంచాన్ని చూపిస్తుంది
నిజాల్ని వెల్లడిస్తుంది
అసత్యాల్నీ మూటగడుతుంది

కాగితాలను కలిపేసుకుంటుంది
కవిత్వాల్ని కౌగిలించుకుంటుంది
కథల్ని కళ్లకుగడుతుంది
గ్రంథాలను గౌరవిస్తుంది
రచయితలకు వెలుగునిస్తుంది
కొత్తదనాన్ని రుచి చూపిస్తుంది
పాతదనాన్ని సమీక్షిస్తుంటుంది

విజ్ఞానాన్ని పెంపొందిస్తుంది
విచక్షణను మేలుకొల్పుతుంది
విద్వేషాలనూ రగిలిస్తుంది
విప్లవాలను జ్వలింపజేస్తుంది
సాహిత్య సేద్యంలో కీలకమవుతుంది
భాండాగారాల్లో నిక్షిప్తమౌతుంది
పరిజ్ఞానానికి ఆధారమవుతుంది
పరిహాసాలకూ చోటిస్తుంది
దరహాసాలనూ చిందిస్తుంది
నిరసనలకూ వేదికవుతుంది
గర్వంతో మిడిసిపడుతుంది
మస్తిష్కాల్లో దూరిపోతుంది
మనస్సులను ప్రభావితం చేస్తుంది
చైతన్యాన్ని పెంపొందిస్తుంది
నిరుత్సాహాన్ని కలిగిస్తుంది
ఉత్తేజాన్ని రేకెత్తిస్తుంది
ఆవేశాలను రగిలిస్తుంది
ఉత్సాహానికి పురికొల్పుతుంది
భావోద్వేగాలకి ఆలవాలమవుతుంది
బాధ్యతల్ని గుర్తు చేస్తుంది
తన ప్రస్థానం అనంతమంటుంది
తననెవరూ ఆపలేరంటుంది
తనకెవరూ ఎదురులేరంటుంది

నడుస్తున్న చరిత్ర

- బుద్ధి యజ్ఞమూర్తి

అమ్మా!
మన సమాజం ఎట్టాగుందో చూశావా?
గ్లోబల్ బంధాల చావు కౌగిలి కన్పిస్తోంది కదూ...?
అవును...
కల్తీ నవ్వుల్తో... మార్కెట్ లెక్కల్తో కట్టిన
ఈ నీటి బుడగ
ఇవాళో రేపో తుపుక్కుమని చిట్లిపోక తప్పదు...!

ఇటువేపు ఇరాక్
అటువేపు ఆఫ్ఘన్, బంగ్లాదేశ్‌లకు
ఇదిగిదిగో గుజరాత్ పిల్లలకి
పాలిచ్చే అమ్మల్ని లేకుండా చేసిన
బుషుల్నీ, మోడీల్నీ
చిటికెన వేలితో ఆపేదెవరమ్మా...?

కానీ ఇప్పుడందరూ
పాలిచ్చిన అమ్మనే
మర్చిపోతున్నారని ఆ చిటికెన వేలికేం తెలుసు..?
ఆ మరుపులోనే చరిత్ర నడుస్తావుంది... గతం గత్త!
'కొంతమంది కుర్రాళ్లు పుట్టుకతో వృద్ధులు' పాతపాట!
ఎముకలు కుళ్లిన యువత చేతుల్లో రేపటి సమాజం!!

అమ్మా!
ధరలన్నీ పెరిగిపోయి విలవిల్లాడుతున్న
బక్క ప్రాణాల ఘోష విను...

ప్రధానమంత్రులూ, ముఖ్యమంత్రులూ
ఎన్ని చమత్కారాలు చేసినా
ఆకలి కేకల్ని ఆపలేరు
కాసేపే 'అభయ హస్తం' పాట!
చేతల్లేని మాటల్లోనే భరోసా!!

తప్పదు -
నీకంటి చివరల్లో
నీరు తుడవ తప్పక కదలాల్సిందే
గుండె చెదిరిన బతుకుల్ని
భద్రంగా గూట్లోకి చేర్చాల్సిందే
కూలిపోతున్న మంచితనాన్ని
రెక్కలుపట్టి పైకి లేపాల్సిందే
అంతేకదా అమ్మా...!

భోగి మంటలు
సంక్రాంతి ముగ్గులు నామోషీ అయిపోయాయి
'గోళీకాయలు కోతికొమ్మచ్చిలు
బచ్చాలాటలం'టే ఏంటంటున్నారు పిల్లకాయలు
కొత్త తరానికి తెల్సిందల్లా
క్రికెట్టే, పిజ్జా బర్గర్లే
ఇప్పుడన్నా చెప్పమ్మా
చెడిన సమాజాన్ని నిలదీయడం
నా తప్పేనా?

విజ్ఞాన వీచిక

ఆలోచనల వేగం ఎంత?

రైలు గంటకు ఎంత వేగంగా ప్రయాణిస్తుందో చెప్పొచ్చు. అలాగే ట్యాపులో నీళ్లు ఎంత వేగంగా వస్తాయో చెప్పొచ్చు. కానీ మనసు వేగం ఎంతో చెప్పగలరా? కష్టం. ఎందుకంటే మనమిక్కడే వుంటాం. మన ఆలోచనలే రైలుకంటే...విమానంకంటే వేగంగా ఎక్కడికో ఎక్కడెక్కడికో వెళ్లిపోతుంటాయి. అన్నింటికంటే మనస్సు (అలోచన) వేగమే ఎక్కువంటారు. అది కచ్చితంగా ఎంత వేగంతో కదులుతుందో తెలియదు కానీ, వేగం కంటే ఆలోచనల పనితనం మరింత ముఖ్యమని చెబుతోంది విజ్ఞాన శాస్త్రం.



శామ్యూల్ మోర్స్ 1844లో టెలిగ్రాఫ్‌ని స్థిరపరిచిన దరిమిలా క్రమక్రమంగా మన జీవితాలు వేగానికి బానిసలైపోయాయి. ప్రస్తుతపు హై-స్పీడ్ ఇంటర్నెట్ నెట్‌వర్క్‌లో బంధీలైపోయాయి. మోర్స్ టెలిగ్రాఫ్ మన బాహ్య జీవితాలను ప్రభావితం చేయడమే లోపలి వ్యవస్థ కూడా దృష్టి సారించేలా చేసింది. మన నాడీవ్యసవ్థ ఏ విధంగా పనిచేస్తుందో అన్న ఆలోచనకు ఒక రకంగా నాంది టెలిగ్రాఫే! నిజానికి నాడులు, టెలిగ్రాఫ్ తీగలు రెండూ పొడవాటి పోగులే, వాటిలో ప్రవహించేది విద్యుత్తే! అ విద్యుత్ ద్వారానే సమాచారాన్ని ప్రసారం చేస్తారు.

టెలిగ్రాఫ్ వైర్లలో సంకేతాలు ప్రయాణించడానికి కొంత సమయం తీసుకుంటాయి. దాదాపు 200మైళ్ల దూరం ప్రయాణించడానికి టెలిగ్రాఫ్ కోడ్ క్షణంలో నాల్గవవంతు సమయం తీసుకుంటాయని తెలిసింది. అప్పట్లో నాడుల్లో సమాచార ప్రసారం కూడా ఎంతో కొంత సమయం తీసుకుంటుందని భావిస్తారు. ఆ సమయాన్ని లెక్కించవచ్చునీ తలంచారు.

అసలు ఆలోచనల వేగాన్ని లెక్కించగలమన్న ఆలోచనే అద్భుతం. ఆ అద్భుతాన్ని శాస్త్రవేత్తలు నిజం చేశారు. హర్మన్ హెల్మాల్ట్ అనే జర్మన్ పరిశోధకుడు 1850లో కప్ప కాలి కండరాలకి తీగలు అమర్చి ఒక ప్రయోగం చేశాడు. నాడి నుండి కండరం వరకు సంకేతం వెళ్లడానికి సుమారు సెకనులో పదవ వంతు సమయం పట్టిందని లెక్కకట్టాడు. మరో ప్రయోగంలో ఆయన మానవులకు చిన్న విద్యుత్ షాక్ ఇచ్చి, ఆ 'ఫీలింగ్' కలిగిన వెంటనే చెయ్యి లేపమన్నాడు. ఆ ప్రయోగంలోనూ మన నాడీ వ్యవస్థలో సమాచర ప్రసారానికి సమయం పడుతుందని తేల్చాడు.

ఆ క్రమంలో అనేక మంది ఆలోచనల వేగాన్ని కనుగొనే ప్రయత్నాలు కొనసాగించారు. అయితే కచ్చితమైన ఫలితాలు ఇంకా రాలేదు.

విద్యుత్ తీగలకీ మన నాడులకీ చాలా సంబంధాలున్నాయి. లావుపాటి టెలిగ్రాఫ్ వైర్లో సంకేతాలు వేగంగానే కాక మరింత దూరం కూడా ప్రయాణిస్తాయని 1854లో విలియం థామస్ అనే భౌతికశాస్త్రవేత్త నిరూపించాడు. అదే సూత్రం నాడులకీ వర్తిస్తుంది. నాడులలోని ఆక్సాన్‌లు ఎంత లావుగా వుంటే వాటిలో సంకేతాల ప్రసారం అంత వేగంగా వుంటుంది. మెదడులో బెట్జ్ కణాలు అతి సన్న వాటికంటే 200 రెట్లు లావుగా వుంటాయి.

తీగెలలో విద్యుత్ ప్రసారాన్ని వేగవంతం చేయాలంటే వాటిని ఇన్సులేట్ (పై తొడుగు) చేయడం ఒక పద్ధతి. నాడుల విషయంలోనూ ఇది వాస్తవమే. కొన్ని నాడులు మయెలిన్ అనే పదార్థంతో చుట్టి వుంటాయి. ఇటువంటి నాడులు వెన్నెముకలో ఉంటాయి. ఈ నాడులలో సంకేతాలు గంటకి 290 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తాయి! మయెలిన్ పొర లేని సన్నటి రాడ్లలో ఆ వేగం గంటకి కిలోమీటర్ కంటే తక్కువే! నొప్పిని తెలియజేసే నాడులలో వేగం తక్కువగా వుంటుంది.

మన మెదడులోని ఆక్సాన్లు మరింత మందంగా ఉంటే ఆలోచనల వేగం ఎక్కువ కావచ్చు. కానీ ఇప్పటికే మెదడులో దాదాపు నాలుగు లక్షల రెండున్నర వేల కిలోమీటర్ల మేర నాడీ 'వైరింగ్' ఉంది. ఇక లావుపాటి ఆక్సాన్లు ఉంటే మన తల మన గుమ్మాలలో పట్టనంత పెద్దగా వుంటుంది. పైగా బోలెడంత శక్తి అవసరమౌతుంది.

ఈ కారణాల వల్ల పరిణామ క్రమం మన మెదడు అభివృద్ధిలో పనితనానికే పెద్దపీట వేసినట్టు తెలుస్తోంది.

ఏదేమైనా, మన మెదడు అభ్యాసంతో వేగంగా పనిచేయడం అలవర్చుకుంటుంది. ఈ విషయాన్ని ఎన్నో ప్రయోగాలు నిరూపించాయి. దాదాపు నూట అరవై సంవత్సరాల క్రితం మన ఆలోచనలు పక్షి కంటే వేగంగానూ, శబ్దం కంటే నెమ్మదిగానూ ప్రయాణిస్తాయని హర్మన్ హెల్మాల్ట్ ఊహించనప్పుడు ఆయన టెలిగ్రాపుకీ, మన నాడులకీ మధ్య ఒక ముఖ్యమైన విషయాన్ని మరిచిపోయాడు. మనకి వేగం అతి ముఖ్యమైనది కాదు. ఎంత సమయంలో ప్రతిస్పందిచడమన్నదే కీలకం. ★

- యాజీవ్

శశి

- ఆర్.డి.మల్లేశ్వరరావు

సమాజంలో ప్రతి యువతికీ ఎదురయ్యే సర్వసాధారణ సమస్యే ఇది. ప్రతిసారీ కొత్తే! ప్రతి ఒక్కరికీ కొత్తే!! విచిత్రంగా. ఎక్స్‌ప్రెస్ వేగానికి దొరకడం లేదు నా మస్తిష్కం. కిటికీలోంచి దూసుకొచ్చిన వడగాలి నా ముఖాన్ని చాచి కొట్టింది. ఏ అర్ధరాత్రి ఈ బండిని ఆశ్రయించానో, నన్ను తనతో పట్టుకుపోతోంది.

నా మనోవేగానికి పోటీ పడుతూ గాలిని చీల్చుకుంటూ పట్టాల్ని హత్తుకుని దూసుకుపోతోంది ఎక్స్‌ప్రెస్. ఎటుపోతోందో నేను దాన్ని అడగలేదు! ఎక్కడికి వెళ్తున్నానో నే చెప్పలేదు! నాకు తెలిస్తేకదా దానికి చెప్పడానికి?! బహుశ మొగుణ్ణొదిలి పోతున్నానేమో.. ఈ సమాజం భాషలో! తొణికిన స్వప్నాన్నీ, తొలగిన స్వర్గాన్నీ వెతుక్కొనే సాహసం చేయనంటున్న నా ఆత్మ బలిమికి 'బరితెగింపు' అనే పేరు పెట్టొచ్చు ఈ సమాజం. నే ఖాతరు చేయను! ఆడదాని ఆత్మాభిమానాన్ని సర్వకాల, సర్వవిధ, సర్వావస్థల్లో 'అతడి' ఇచ్ఛ, వాంఛలకు ధారపోసి సాగించాలనే ఆ కాపురాన్ని నాలాంటి వారు ఒకరో ఇద్దరో వ్యతిరేకించడాన్ని ఈ సమాజం జీర్ణించుకోలేక పోవచ్చు. మా అమ్మ లాంటి వాళ్లు ఛీ కొట్టనూవచ్చు. నాన్న లాంటి వాళ్లకు మచ్చతేనూవచ్చు. నాకూ మానాన్న లాంటి వాడే మొగుడుగా వచ్చుంటే నేనూ అమ్మలానే.. అంటానేమో! మా నాన్నలానే భావిస్తానేమో!

♦♦♦

'ఇంత వయసొచ్చినా మీ అమ్మ అందాలు చెక్కుచెదరలేదు శశీ..!'

బాబ్జీ బారసాలనాడు వాణ్ణి తన రెండు కాళ్ళపై పడుకోబెట్టుకుని స్నానం చేయించిన మా అమ్మను చూసిన రాకేష్ కళ్ళు మా అమ్మలోని అమ్మతనం కన్నా అందాన్నే ఆస్వాదించాయి!

నాలుగు నెల్ల తర్వాత, నా శరీరాన్ని అనుభవిస్తూ కసిగా అన్న ఆ మాట నా మనోక్షేత్రాన్ని కుదిపేసింది!

అప్పటివరకూ రాకేష్‌పై నాకున్న అభిప్రాయం ఒక్కసారిగా ముక్కలైంది.

ధారాపాతమైన నా వెచ్చని అశ్రువులు తాకి మురిసిపోయాడు.. రోగ్! చెమటలు పట్టించేస్తున్నాననే సంబడంతో!

అప్పుడు నిర్ధారించుకున్నాను వాడు మనిషి కాదు మహిషి! అని.

మాబోటి ఉన్నతస్థాయి కుటుంబాలకు ఉన్నది డబ్బొక్కటే!? అవి లేనివారు మాలాటి వాళ్ళని చూసి ఆకాశ సౌధాల్లో ఉన్నామని లెక్కలుగడతారు. ఎన్నో అనుకుంటారు. ఎన్నెన్నో ఊహించుకుంటారు. ఎన్ని ఉన్నత కుటుంబాల కాపురాలు సమున్నతంగా ఉన్నాయో ఎంతమందికి తెలుసు?! ఎన్ని ఉన్నత కుటుంబాల్లోని ఆడపిల్లలు ఆనందంగా బతుకులు వెళ్ళదీస్తున్నారో ఎంతమంది ఎరుగుదురు?!

ఉంటే.. అమెరికా అమ్మాయిల అర్థాంతర చావులు ఎందుకు పుడుతున్నాయి? ఎందుకు వారు జీవితాన్ని అసంపూర్తిగా ముగిస్తున్నారు? అల్లుళ్ళకి సర్వం ధారపోసి పెళ్ళిళ్ళు చేసిన నాన్నల గుండెలు ఎందుకంతగా అవిశిపోతున్నాయి? పైకి కనిపించే మా కుటుంబాల ఆడంబరం వెనుక దాగున్నదంతా డాంబికమే! బతుకుల్ని ఆవరించిందంతా దు:ఖార్ణవమే!!

బహుమతుల రూపంలో కరెన్సీ కట్టలివ్వడాలు, కార్లు కొనిపెట్టడాలు, ఇళ్ళు కట్టించడాలు, పుత్తడి దిగేయడాలూ మాబోటి ఉన్నతవర్గంవారు కట్నానికి పెట్టుకున్న సోకాల్డ్ పేర్లు.

అవన్నీ చాలని నా మొగుడులాంటి మగాళ్ళకి భర్తపోయి పుట్టెడు దు:ఖంతో పుట్టింటికి చేరిన నా చెల్లెలు పిఎగా కావాల్ట!

'రాధ! ఇప్పుడెలాగూ ఖాళీయే కదా. నేను...'

అతని కళ్ళలోని దాహం నా కళ్ళకు తెలుస్తోంది.

మాట్లాడుతున్న రాకేష్ కంఠం నెమ్మదిగా.. మూగబోతోంది..

'చెప్పు రాకేష్.. మొహమాటమెందుకు.. నీకు నా.. చెల్లెలు.. కావా...'

నామాటకు అడ్డుపడ్డాడు..

'నువ్వు అలా అర్థంచేసుకుంటే.. నేనేం చెప్పలేను..' నమ్మబలుకుతున్నాడు..

ఎలా నమ్ముతాను..?

యాభైఏళ్ళ మా అమ్మలోనే అందాన్ని వెతికిన వాడు పట్టుమని పాతికేళ్ళు కూడా నిండని నా వితంతు చెల్లెల్లో..

♦♦♦

ఛ! తల్చుకోడానికే నా మనసులో వికారం బయల్దేరింది..

'ఎదుటి వాళ్ళ అపార్థమేమిటో అర్థమైనప్పుడు, ఎలా అర్థం చేసుకున్నా.. నష్టం ఒక్కటే!'

నేలచూపులు చూస్తూ అన్నాను.
రాకేష్ ముఖం చూడబుద్ధి కాలేదు!
'పిఎగా ఉంటే.. తనకీ కుమార్ చనిపోయిన బాధ పోతుందిగా..ని! అంతే శశీ.. అంతే'
ఆగాడు..
నా కడుపులో బాధ మాటల రూపంలో జ్వలించింది. నాలోని ఆత్మాభిమానానికి ధైర్యం తోడైంది. అసహనంతో ఊగి పోయాను.
'అవును! దానికన్నా ముందు నీకు మంచి కంపెనీ దొరుకుతుంది!' విసురుగా అన్నాను.
'కాదు శశీ..' అనునయం అభినయిస్తూ అన్నాడు రాకేష్.
'మొగుళ్ళు పోయిన మహిళామణుల మీద నీకంత జాలి, దయ ఉంటే.. నా చెల్లెలికన్నా ముందే తలచెడిన మీ అక్క మీ ఇంట్లోనే ఉందిగా ఆవిణ్ణి..'
ఆవేశం, ఆవేదన కలగలిసిన నా మాట.. పూర్తికాకుండానే.. ఒక్క ఉదుటన మీదకు దూకి నా జడ పట్టుకు లాగి తలుపుకేసి విసురుగా కొట్టాడు.. నిలువునా చిట్లిన నుదుటి నుంచి రక్తం చిమ్మింది.
'యూ.. ప్రాస్టి..' అంటూ నానా బూతులూ తిట్టాడు..
ఎందుకు తిట్టావని అడగలేదు! ఈ దేశంలో ఏమగాడైనా ఆడవారికిచ్చే గొప్ప హోదా అదొక్కటేగా.. ని!
స్త్రీకి ఈ ఒక్క హోదా కట్టబెట్టేందుకు ఏ చట్టమూ చేయనక్కరలేదు.. మన స్వతంత్ర భారతావనిలో!
నరంలేని మగాడి నాలుక్కి అడ్డుపడే సాహసమూ చేయలేదు.. ఏ ఒక్క ప్రతిపక్షమూ ఈ విషయంలో..!!
ఈ విలక్షణం ప్రతి మొగాడిలో ఉండేదే అని సరిపెట్టుకున్నాను.
బహుశ మన దేశంలో మహిళా సాధికారత అంటే ఇదేనేమో. మాలాంటి చదువుకున్న వారి ఇళ్ళల్లో.. మరీ ముఖ్యంగా!
సమాజంలో మృగ్యమవుతున్న మానవతా విలువలకు దర్పణం పట్టిన రాకేష్ ప్రవర్తన అది.. బయటికి చెప్పుకోలేని, ఏ ఒక్కరికీ గోచరం కాని మాబోటి వారిళ్ళల్లో జరిగే మామూలు రభస ఇది! ఏ గృహహింస చట్టాలూ మాబోటి వారికి సాయం చేయలేవు. ఏ కోర్టులూ నా మొగుడులాంటి వాళ్ళని బోనులో నిలబెట్టలేవు. ఎందుకంటే.. ఏ డబ్బయితే మా దగ్గర ఉందో అదే మా స్వతంత్రాలకి, మా ఇష్టాలకి, మా న్యాయాలకి సంకెళ్ళు వేసేస్తుంది గనుక!
ఆ డబ్బే ముందస్తు బెయిళ్ళు పుట్టించేస్తుంది.. ముందస్తుగానే నీతినీ, న్యాయాన్నీ జైళ్ళల్లో పెట్టించేస్తుంది..
నాబోటి వాళ్ళు ఎవ్వరైనా ముందుకొస్తే.. జరిగిన, జరుగుతున్న అన్యాయాన్ని నోరెత్తి మాట్లాడితే.. సోకాల్డ్ స్టేటస్ చెప్పి.. మానాన్న, అమ్మలాంటి వాళ్ళ కోర్టులకెక్కడాన్ని, పోలీస్‌స్టేషన్లకు వెళ్ళడాన్ని పరువు తక్కువగా భావించేలా చేసేది కూడా డబ్బే! అదే రాకేష్‌లాంటి వాళ్ళ ఆదెరువు.. బలం! ఇక ఒక్క క్షణం కూడా అతనితో కాపురం.. చేయకూడదని నిర్ణయించుకున్నాను.
రాకేష్‌ని నేను ప్రేమించాను. వాడు నన్ను మోహించాడు.
తెలుసుకోలేకపోయాను. ఎన్ని అభ్యుదయ భావాలున్నా నేనూ ఆడదాన్నేగా.

♦♦♦

ఇష్టమన్నాడు.. అవసరమన్నాడు.. కావాలన్నాడు.. నువ్వు కాదంటే చచ్చిపోతానన్నాడు! మగాడికున్న పదునైన అస్త్రం అదేగా! దీనికి చలించని పడతి ఈ ప్రపంచంలో ఉంటుందా?! సమాజంలో ప్రతి యువతికీ ఎదురయ్యే సర్వసాధారణ సమస్యే ఇది. ప్రతిసారీ కొత్తే! ప్రతి ఒక్కరికీ కొత్తే!! విచిత్రంగా. ఎక్స్‌ప్రెస్ వేగానికి దొరకడం లేదు నా మస్తిష్కం. కిటికీలోంచి దూసుకొచ్చిన వడగాలి నా ముఖాన్ని చాచి కొట్టింది. ఏ అర్ధరాత్రి ఈ బండిని ఆశ్రయించానో, నన్ను తనతో పట్టుకుపోతోంది.
మహిళా స్వేచ్ఛకు, మగ-ఆడ సమానత్వానికీ ఉత్తచేత్తో మూరలు లెక్కిస్తున్న సమాజంలో ఉన్న రాకేష్, ఎంత చదువుకున్నా తనూ ఆ సమాజంలో భాగమేగా?! తన ప్రవర్తన విచిత్రంగా తోచలేదు నాకు!
'నిర్ణయం అదే అయితే నా కొడుకుని నాకే వదిలేసి వెళ్ళు' కఠినంగా మోగింది రాకేష్ కంఠం.
'ఎవరికి కొడుకు..'
అంతే కఠినంగా అన్నాను తలెత్తుకుని!
'నాకే..!' అన్నాడు రాకేష్
'నా శరీర భాగస్వామ్యం లేకుండానే..?!'
ముప్పిరిగొన్న దు:ఖాన్ని మునిపంటి బిగువున దాచేస్తూ.. ప్రశ్నించాను
'య్యూ.. '
చెయ్యెత్తి మీదికొచ్చాడు..
నాలో నిక్షిప్తమైన ఆత్మాభిమానం, సామాజిక స్పృహలేవో నన్ను బలీయమైన నిర్ణయంవైపు తోసేస్తున్నాయో, తీసుకువెళుతున్నాయో కూడా తెలియనిస్థితి నాలో ఆవరించింది. అయితే ఒక్కటి మాత్రం గాఢంగా అర్థమౌతోంది నేను చేస్తున్నది తప్పుకాదు!
రైలు కుదుపులకి బాబ్జీ నిద్రనుంచి ఉలిక్కిపడి లేచాడు. వాణ్ణి సముదాయించి మళ్ళీ నిద్రపుచ్చాను. మా ఇద్దరిలో వాడికి దక్కింది, నాకు దూరమయింది ఇదొకటి!
'ఆవేశపడుతున్నావు ఓడిపోతావ్!' రాకేష్ పదజాలం పరుషంగా సోకింది నా చెవులకి.
'నా ఆవేశమే నాకు మొదటి విజయాన్నిచ్చింది!'
ధైర్యం నిండిన స్వరమేదో నాకంఠంలోంచి దూసుకొచ్చింది.
'ఇప్పుడు నీ దగ్గర చిల్లిగవ్వ లేదు. నువ్వు చిత్తుకాయితానివి!'
'అవును! నా కన్నపేగును సొంతం చేసుకోడానికి ఏ చట్టాన్నీ ఆశ్రయించలేని, ఏ కోర్టు గడపా తొక్కలేని, ఉన్నతస్థాయి బేలతనం ముందు నేనో చిత్తుకాయితాన్నే! అయినా ఫర్వాలేదు. ఏ కరెన్సీ కట్టలైతే నువ్వు కావాలన్నావో, ఎంత ఎత్తు డబ్బును ఆశించి ఆ బంధాన్ని సుఖంగా లెక్కగట్టావో, అప్పుడే నీముందు నేనెంతో పైకెదిగాను..'
నేనాఖరుగా రాకేష్‌తో అన్న మాట ఇది.
ఇప్పుడు నాలో ఏ ప్రేమాలేదు. నాలో ఏ ఆలోచనాలేదు. నా కళ్ళల్లో కన్నీరు కూడా రావడంలేదు.
ఏదో నిష్కర్ష!
ఏ నిర్బంధం నుంచో విముక్తి లభించిందన్న ఆనందం.

♦♦♦

కానీ, ఇప్పుడు పయనం ఎక్కడికి?
ఎటువైపు?
ఎవరికోసం?
నా మనసు సంధిస్తున్న ప్రశ్నల పరంపరకు సమాధానం తెలీడంలేదు! అంతుచిక్కడం లేదు!
ఆత్మహత్య చేసుకోను, ఇది నిశ్చయం!
నేనంత బేలదాన్నే అయితే నా భవిష్యత్ కోసం నాన్న కూడబెట్టిన డబ్బు మొత్తాన్నీ రాకేష్‌గాడికి ఇచ్చి ఉండేదాన్ని కాదేమో?!
మరి పుట్టింటికి వెళ్ళడమా?
నో! ..నో!!
పుట్టింటికి ఇలా వెళ్ళను.
వెళ్ళి నా ఔన్నత్యాన్ని వారి బేలతనంగా మార్చలేను.
నాన్న కంట్లో కన్నీరు చూడలేను..
అయితే, ఒక్కటిమాత్రం అర్థమౌతోంది. నాలోని ఈ తెగువ, ధైర్యం నాలా మగ్గిపోతున్న వారిని కాపాడగలదని! వారిని ముందుండి నడిపించగల శక్తేదో నాలో ఉందని!
నాకు తెలుస్తోంది, ఏ సాధికారత కోసం ఉద్యమాలు సాగుతున్నాయో దాని దిశగా మమ్మల్ని మేము తీర్చిదిద్దుకోగల మన్న భావన నాలో మెదుల్తోందని.
అనితరసాధ్యమైన ఆ మార్గానికి అచంచలంగా పాటుపడగలనని..
లక్ష్యం కళ్ళముందు మెదిలింది!
రైలాగింది..
ఏదో స్టేషన్! ఏదైతేనేం?!
దిగాను..
బాబ్జీని భుజానేసుకుని..
కొండంత బాధ్యతను నెత్తినెత్తుకుని..!
నా హృదయ రవి కిరణాలు చూపుతున్న సమున్నత దిశల వైపు.. అడుగులు వేయడానికి..!

✶

కొత్త పుస్తకాలు

జాతులు భాషలపై సైద్ధాంతిక దృష్టి

ప్రపంచంలోనే అత్యధిక భాషలు, జాతులు గల దేశం భారత దేశం. అందుకే దీన్ని ఉపఖండం అంటుంటారు. దీనికి తోడు కుల మత సమస్యలు. సుదీర్ఘ కాలం పాటు సాగిన బ్రిటిష్ పాలన, అంతకు ముందు ఆ తర్వాత విస్తార ప్రాంతాల్లో కొనసాగిన రాచరిక భూస్వామ్య ఆధిపత్యం ఈ దేశానికి వారసత్వంగా అనేక సమస్యలను మిగిల్చాయి. అసమానతలు, అపోహలు కూడా అందులో భాగంగా సంక్రమించాయి. ఉత్తరోత్తరా ఇవి భాషలు, రాష్ట్రాలు, ప్రాంతాలు జాతుల మధ్య వివాదాలు, విద్వేషాలుగా ప్రజ్వరిల్లిన ఉదాహరణలు అనేకం. అది నడుస్తున్న చరిత్ర కూడా. అంతర్జాతీయంగానూ సోవియట్ విచ్ఛిన్నం తర్వాత అంతర్యుద్ధాలు, ఘర్షణలు తీవ్రరూపం దాల్చడం యుగోస్లేవియాలో గాని, అస్సాం వంటి చోట్ల గాని కనిపిస్తూనే వుంది. అంతకు ముందు కూడా భారత దేశంలో జాతుల సమస్య గురించిన స్పష్టత లేకపోవడం అనేక సమస్యలు తెచ్చిపెట్టింది. జాతులు యధేచ్ఛగా విడిపోవడానికి అనుమతించడమే విప్లవాత్మకమైనట్టు చాలా కాలం పొరబాటు భావన వుండేది. సిపిఎం నాయకత్వం దీర్ఘ కాలం చర్చించిన తర్వాత 1972లోనే మదురైలో జరిగిన మహాసభలో జాతుల సమస్యపై సమగ్రమైన తీర్మానాన్ని ఆమోదించింది. భారత దేశ ప్రత్యేక పరిస్థితుల దృష్ట్యా పాలక వర్గాలు, ప్రతీక శక్తులు ఈ వాదనను ఎలా దుర్వినియోగ పరిచేది



భారతదేశంలో జాతుల సమస్య
బి.టి.రణదివె
భాషా ప్రయుక్త రాష్ట్రాలు రాజకీయ సమస్యలు
ప్రకాష్ కరత్
పేజీలు :55, వెల :25/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2, చిక్కడపల్లి, హైదరాబాద్-20.

సోదాహరణంగా విశ్లేషించి శాస్త్రీయమైన విధానాన్ని ముందుంచింది. కమ్యూనిస్టు ఉద్యమ అగ్రనాయకుడూ సిద్ధాంతవేత్త కీర్తిశేషులు బి.టి.రణదివే ఆ విధానం విశిష్టతను ఆవశ్యకతను వివరిస్తూ రాసిన చిన్న పుస్తకం 'భారత దేశంలో జాతుల సమస్య'. అలాగే సిపిఎం ప్రధాన కార్యదర్శి ప్రకాశ్ కరత్ గత దశాబ్ద కాలంలో దేశం ముందుకొస్తున్న భాషా రాష్ట్ర విభజన సమస్య పూర్వాపరాలు వివరిస్తూ రాసిన వ్యాసాల సంకలనం "భాషా ప్రయుక్త రాష్ట్రాలు- రాజకీయ సమస్యలు". బిజెపి హయాంలో మూడు రాష్ట్రాల ఏర్పాటు సందర్భంలోనూ, అలాగే ఆంధ్రప్రదేశ్‌లో టిఆర్ఎస్ తొలిదశలోనూ ఆయన వెలిబుచ్చిన అభిప్రాయాలు ఈ పుస్తకంలో వున్నాయి.. స్వాతంత్ర్య పోరాట కాలంలో వచ్చిన భాషా రాష్ట్రాల ఏర్పాటు ఉద్యమానికి ఇప్పుడు వాటిని విచక్షణా రహితంగా విభజించాలని కోరేవైఖరికి మధ్య తేడాను ప్రకాశ్ కరత్ వివరించిన తీరు ఆకట్టుకుంటుంది. ఈ రెంటినీ కలిపి ప్రచురించడం ప్రస్తుత సందర్భంలో అవగాహనకు ఎంతగానో దోహదపడే ప్రయత్నం ఇది.

-పీపీ

విప్లవంపై విలువైన పాఠాలు

తొలి సోషలిస్టు రాజ్య సంస్థాపకుడైన లెనిన్ 'రాజ్యము విప్లవం దాని గుణపాఠాల'పై రాసిన వ్యాసాలు అత్యంత ప్రామాణికమైనవి. ప్రసిద్ధమైనవి కూడా. మార్క్సు, ఎంగెల్సు బోధించిన విప్లవ సిద్ధాంతాన్ని రష్యాలో జయప్రదంగా అన్వయించిన లెనిన్ రాజ్యం వర్గ స్వభావంపైన, దాన్ని కూలదోసేందుకు జరిగే విప్లవ మౌలిక అవగాహనపైన సిద్ధాంతాన్ని నిర్దిష్ట పర్చిన తొలి మహోపాధ్యాయుడు. ఆచరణ అధ్యయనం రెండు కళ్లుగా ఆయన ఈ పని చేశారు. అప్పట్లో హేమాహేమీలైన అనేక మంది విచ్ఛిన్నకులను ఢీకొంటూ విప్లవాన్ని విజయవంతం చేసిన లెనిన్ రాజ్యం ఎప్పుడైనా వర్గస్వభావం కలిగివుంటుందని శక్తివంతంగా నిరూపించారు. అలాగే దాన్ని కూలదోసే శక్తి గలది ఆధునిక కార్మికవర్గమేనని ప్రబోధించారు. ఈ రెండు విషయాల్లోనూ అతివాద మితవాద పెడధోరణులు ఎలా ఉత్పన్నమయ్యేది కళ్లకు కట్టారు. ఇప్పటికీ దేశంలోనూ రాష్ట్రంలోనూ విప్లవం పేరుతో, వర్గ సిద్ధాంతాల పేరుతో అనేక అవాస్తవ, అరాచక, అనర్థక పోకడలు చూస్తున్నాం. వాటికే పెద్ద ప్రచారం లభించడమూ చూస్తున్నాం. అది పాలకవర్గాల పన్నాగంలో భాగమే. ఇలాటి వాటికి ఏకైక సమాధానం శాస్త్రీయ దృష్టితో విప్లవ సిద్ధాంతాన్ని అవగాహన చేయడమే. చాలా కాలం తర్వాత కొత్త ముద్రణతో వెలువడిన ఈ పుస్తకం అందుకు మార్గదర్శకమవుతుంది.

-పీపీ

రాజ్యం, విప్లవం గుణపాఠాలు
లెనిన్
పేజీలు :62, వెల :20/-,
ప్రతులకు : ప్రజాశక్తి బుక్‌హౌస్
1-1-187/1/2.
చిక్కడపల్లి,
హైదరాబాద్-20.



సినిమా కబుర్లు

సాహిత్యం, చిత్ర కళ, సంగీతం వంటివాటిని అర్థం చేసుకోవాలంటే కొంత అవగాహన, అభిరుచి వుండాలి. తర తమ తేడాల్లేకుండా మనుషులందరూ సమానంగా ఆస్వాదించగలిగే కళ నటన ఒక్కటే. పాత్రలు, నటన, ఇష్టం అన్నదానిలో ఎవరి అభిరుచి వారికి వుండొచ్చు గాని సాటి మనిషి అభినయిస్తుంటే చూసి తాదాత్మ్యం చెందడంలో మాత్రం ఎలాటి తేడాలూ వుండవు. అన్ని దేశాల్లోనూ, అన్ని భాషల్లోనూ సమర్థులైన నటీనటులు ప్రసిద్ధులు కావడానికి ప్రజాభిమానం పొందడానికి కారణం అదే. తెలుగులో నాటి ఎన్టీఆర్ ఏఎన్నార్‌లతో మొదలు పెట్టి నేటి మహేష్‌బాబు, రామ్ చరణ్ తేజ వరకూ ఈ మాట వర్తిస్తుంది.

- తెర

మహా నటనలో మామూలు మనుషులు!

నటీనటులను వారి వారి పాత్రలను బట్టి ప్రేక్షకులు అభిమానిస్తారు. మాస్ క్లాస్ అంటుంటారు గాని వాస్తవంలో అలాటి తేడాలు లేకుండా కూడా ఆదరణ పొందడం కనిపిస్తుంటుంది. దేవదాసుగా ఎన్టీఆర్‌ను, కృష్ణుడుగా రామారావును, జేమ్స్‌బాండ్‌గా కృష్ణను, కుటుంబ సంబంధమైన పాత్రలో శోభన్‌బాబును ఇలా జనం రకరకాలుగా అభిమానిస్తారు. హీరోలు కాకపోయినా ఎస్వీరంగారావు వంటివారి నటనకు కదలిపోతారు. మోహన్ బాబు డైలాగులు, చిరంజీవి డాన్సులు, ఫైట్లు, కమల్‌హాసన్ వైవిధ్యం, బాలకృష్ణ హడావుడి, నాగార్జున నవ్యత, వెంకటేష్ సెంటిమెంటు ఇలా ఏవో బలమైన ముద్రలు పడిపోతాయి. నటీమణుల్లోనూ భానుమతి గడుసుతనం, సావిత్రి సాత్వికత, జమున కలికితనం, వాణిశ్రీ వైవిధ్యం, శారద విషాదం, సుహాసిని సున్నితత్వం, సౌందర్య సౌజన్యం ఇలా నేటి ఇలియానా జెనీలియాల వరకూ ఏవో ప్రత్యేకాదరణలు వుంటాయి. ఆ నటీనటుల కోసమే వెళ్లేవారు కోకొల్లలు.

ఇంతటి ఆరాధనకు, ఆదరణకు నోచుకుని అనేకానేక రకాల పాత్రలు అవలీలగా అవధరించే నటీనటులు కూడా మామూలు మనుషులే. అందుకే వారు పాత్రోచితమైన నటన కనపర్చినా లేక పాత్రలో జీవించినా వారి మామూలు తత్వాలు అలవాట్లు ఉచ్చారణ వగైరాలు అన్ని పాత్రల్లోనూ తొంగి చూస్తుంటాయి. వీటినే మ్యానరిజమ్స్ అంటుంటారు. మిమిక్రీ కళాకారులు వీటినే పట్టుకుని అనుకరణ కళతో అలరిస్తుంటారు. అక్కినేని వేలు పైకి పెట్టి నటించడం, ఎన్టీఆర్ ఆవేశం, కృష్ణ వంగి వుండటం వంటివి సాధారణంగా చూపిస్తుంటారు.

అయితే విమర్శనాత్మకంగా పరిశీలిస్తే ఆయా నటీనటులు వేసే ప్రతి పాత్రలోనూ ప్రతి సందర్భంలోనూ అదే విధమైన అభినయం సంభాషణా రీతి వున్నాయని మనం చూడగలుగుతాము. కోపాన్ని లేదా విషాదాన్ని ఒక నటుడు చూపించే తీరు ఒక రకంగా వుంటుంది. ఇది ఎప్పుడూ మార్పు లేకుండా వుంటుంది. సన్నివేశం మారుతున్నప్పుడే వారి శైలి ఎలా వుంటుందో మనం పసిగట్టొచ్చు. అక్కినేని నటించిన దేవదాసు, మూగనోము, ప్రేమనగర్, ప్రేమాభిషేకం' మధ్య దశాబ్దాల వ్యత్యాసం వుంటుంది. మూడింటి నేపథ్యం వేరు. కాని పాత్రలో ఆయన ప్రవేశించే, ప్రతిస్పందించే తీరు అన్నీ తుచ తప్పకుండా ఒకే విధంగా అనిపిస్తాయి. ఎన్టీఆర్ కూడా అంతే. ఆయన ఎలా ప్రవేశిస్తాడో, ఎలా నిష్క్రమిస్తాడో, ఎలా మాట్లాడతాడో, సగటు ప్రేక్షకుడు కూడా ముందే చెప్పేయగలడు. అచ్చంగా అదే తెరపై కనిపించేది. ఈ ఇద్దరు పెద్ద హీరోలు ధనవంతులుగా వేసినా, రిక్షా వారుగా వేసినా అంగికాభినయంలోనూ, సంభాషణల్లోనూ అవే లక్షణాలు తొణికిసలాడుతుంటాయి. పౌరాణిక పాత్రల్లో ఆహార్యం, ప్రభావం పక్కనపెడితే సంభాషణల్లో ఒక ఫక్కీ వుంటుంది. ఎన్టీఆర్ పౌరాణికాల్లో విభిన్న పాత్రలు ధరించాడనుకున్నా అందులోనూ ఒక తరహా తప్పనిసరి. విశేషమేమంటే ఒక సినిమాలో రావణాసురుడికి మరో సినిమాలో దుర్యోధనుడికి ఆయన అదే నటనా శైలి కనపర్చడం. దానవీరశూరకర్ణ చిత్రంలో దుర్యోధనుడి సంభాషణా శైలిని మార్చారు. కాని విరాటపర్వంలో అదే శైలిని కీచక పాత్రకు ఉపయోగించుకున్నారు. ఎన్టీఆర్ కవి పాత్రలు వేయడం చాలా అరుదు. కాని ఆయన వేసిన శ్రీనాథ కవి సార్వభౌముని పాత్రను చాలా ఏళ్ల కిందట అక్కినేని వేసిన కాళిదాసు పాత్రను పోల్చి చూస్తే తేడా తెలిసిపోతుంది.

సావిత్రి మహానటి అయినా ఆమె నటనలో ఒకటి రెండు హావభావాలు ప్రధానంగా ప్రత్యక్షమవుతుంటాయి. వాటినే తర్వాత వాణిశ్రీ స్వంతం చేసుకోగలిగారు. శారద విషయానికి వస్తే విషాదానికి సంబంధించి ఒక శైలి పెంపొందించుకోవడంతో పాటు ఏక కాలంలో విషాదంగా నవ్వడం అనే ఒక శైలిని తీసుకొచ్చారు. తర్వాత కాలంలో గంభీర పాత్రలు ధరించే తారలందరికీ అదే వరవడి అయింది. వాస్తవంగా వారి నటనా శక్తికి అదో కొలబద్దగా మారింది. సుహాసిని సౌందర్యల నటనల్లో ఇది మనం మరింత తేలిగ్గా చూడగలుగుతాము.

క్యారెక్టర్ నటుల్లో ఎస్వీఆర్ ఇందుకు బాగా అన్వయిస్తారు. ఆయన విషాదానికి సంబంధించిన ముఖ ముద్ర ఒకటి, వినోదానికి ఒకటి ప్రతి సినిమాలోనూ తప్పక కనిపిస్తాయి. ఒక్క ముద్రతోనే లక్షలు సంపాదించాడని అంటుంటారు విమర్శకులు. గుమ్మడి చేయి నలుపుకోవడం కూడా అలాటిదే. ఇటీవలి కాలంలో ప్రకాశ్ రాజ్‌ను తీసుకుంటే ముక్కు నలుపుకోవడం, తేలిగ్గా చూడటం, కోపాన్ని అణచుకోవడం వంటి కోణాలు ప్రతి చిత్రంలోనూ తప్పక కనిపిస్తాయి. హాస్య నటులనే తీసుకుంటే రేలంగి రాజబాబుల నుంచి నేటి బ్రహ్మానందం వేణు మాధవ్‌ల వరకూ ఒక ఫక్కీలో తయారవడం మనం చూస్తాం. రాజబాబు కంగారు కంగారుగా నటిస్తే బ్రహ్మానందం అయోమయాన్ని, ఎదుటివారిపై దాడి చేయడాన్ని బాగా అభినయిస్తుంటారు.

ఇప్పుడు వారి వారి వారసులు రంగంలోకి వచ్చారు గనక జాగ్రత్తగా గమనిస్తే వారిలోనూ అవే ప్రక్రియలు తొంగిచూడటం గమనిస్తాము. మ్యానరిజమ్స్‌గా చెప్పుకునే ఈ ప్రత్యేకతలు నిజానికి ఆ నటులలోని అసలైన మనుషులను పట్టిచ్చే సందర్భాలు. మహా నటనలోని మానవ పార్శ్వాన్ని మనం పట్టుకోగలిగితే అప్పుడు నిత్య జీవితంలోనూ అభినయించే వారిని అర్థం చేసుకోవడం తేలికవుతుంది. ఎందుకంటే నటన, జీవితం రెంటికీ ఎప్పుడూ చాలా సంబంధం వుంటుంది. కొంతమంది అన్నట్టు నటులు పాత్రల్లో జీవించరు. జీవితమే పాత్రల్లో కనిపిస్తుంది.

★

క్రైమ్ కథ

దారి మళ్లింపు

- యర్నాగుల సుధాకరరావు

అదిరిపడ్డాడు రాజేంద్ర. వ్యాన్‌ను వెనక్కి తిప్పించి తాను మాట్లాడిన చోటుకు పరుగులు తీయించాడు. రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. వెంటనే తన సెల్‌లో ఉన్న ఫొటోను అన్ని ఠాణాలకు పంపాడు.

"ఏయ్ ఎవర్నువ్వు? అర్ధరాత్రివేళ ఎందుకు తిరుగుతున్నావు? ఈ పట్టణానికి కొత్తలా ఉన్నావు. నీ ముఖం చూస్తే నీవు బాంబులు చుట్టేవాడిలా ఉన్నావు. నీ చూపులు ఏదో తేడాగా ఉన్నాయి" నడిరోడ్డు మీద పెట్రోలింగ్ వ్యాన్ ఆపి ఒక యువకుణ్ణి లాఠీతో గుచ్చి మరీ అడిగాడు ఇన్‌స్పెక్టర్ రాజేంద్ర.

"సాబ్ నా పేరు జోగి. నిరుద్యోగిని. టీవీలు బాగుచేయడం వచ్చు. ఇప్పుడే ట్రెయిన్ దిగాను. నన్ను మీ ఠాణాకు తీసుకుపొండి. అక్కడ నిద్రపోతాను. ఉదయాన్నే ఇక్కడ ఏదైనా టీవీ షోరూములో పని చూసుకుంటాను. లాడ్జికి పోవడానికి నావద్ద డబ్బుల్లేవు" అని సంచిని చేతులు మార్చుకుని చెప్పాడా యువకుడు.

"అరే చల్! నీకు లాఠీలను చూస్తే భయంలేదా? నాతో ఏకంగా ఠాణాకు వస్తానంటున్నావు. అదిగో! అక్కడ ఒక దేవాలయం ఉంది. అక్కడ నీకుమల్లే తెగిపోయిన టిక్కెట్లు వచ్చి చేరుతుంటాయి. అక్కడికి పోయి గురకపెట్టి నిద్రపో!" లాఠీతో నెట్టుకుంటూ వ్యానెక్కి వెళ్లిపోయాడు.

నాలుగు వీధులు తిరిగాడో లేదో సెల్‌ఫోన్‌లో మెసేజ్ వచ్చినట్టు రింగైంది. ఇన్‌స్పెక్టర్ ఆవులిస్తూ మెసేజ్ చూశాడు. అందులో ఒక ఫొటో, దానికింద మేటర్ ఉంది. ఆ ఫొటోని గుచ్చిగుచ్చి చూశాడు. ఇప్పుడు మాట్లాడిన జోగి ఫొటో అది. ఒక్కసారి అదిరిపడ్డట్టయ్యాడు. వ్యాన్ ఆపించి కిందకు దిగి మేటర్ చదివాడు.

"సాబ్ నీవన్నట్టే బాంబులు చుట్టినవాడినే. చేతనైతే పట్టుకో! ఈ రాత్రి ఒకచోట బాంబు పెడదామనుకుంటున్నాను. ఆ పనిలో నేనుంటాను. నీ పనిలో నీవుండు. ఓకేనా!"

అదిరిపడ్డాడు రాజేంద్ర. వ్యాన్‌ను వెనక్కి తిప్పించి తాను మాట్లాడిన చోటుకు పరుగులు తీయించాడు. రోడ్లు నిర్మానుష్యంగా ఉన్నాయి. వెంటనే తన సెల్‌లో ఉన్న ఫొటోను అన్ని ఠాణాలకు పంపాడు. అన్నివైపులా ఎలర్టు చేశాడు. తెల్లవార్లూ వెతికి వెతికి వేసారిపోయాడు. డ్యూటీ దిగిపోతూ మరొకరికి వెదుకులాటపనిని అప్పగించాడు.

అలా మూడురోజుల పాటు జోగి కోసం వెతికారు. చివరికి అతడో ప్రాక్టికల్ జోకర్ అని తేల్చిపారేశారు.

"రాజేంద్ర మాత్రం పీక్కుపోయాడు. ఎందుకంటే సెల్ మెసేజ్ అందుకున్నది, నేరుగా మాట్లాడింది అతడే కనుక ఎక్కువ బాధ్యతతో వెదకాల్సివచ్చింది. జోగి గురించి మీడియాలో ప్రచారం ఎక్కువైంది. రాజేంద్ర చేతికి దొరికినవాణ్ణి వదిలేశాడని కొన్ని పత్రికలు తప్పు పట్టాయి. దాంతో డిపార్టుమెంటు నుంచి మెమోలు అందుకున్నాడు. అందరికీ జవాబుదారీ అయ్యాడు.

ఇది జరిగిన రెండునెలలకు బాంబుల జోగి కథ మరుగున పడింది. అప్పటికిగానీ రాజేంద్రకు పై అధికారుల నుంచి ఒత్తిడి తగ్గలేదు. ఒకరోజు రాత్రి మళ్లీ సెల్‌ఫోన్ మెసేజ్ వచ్చింది. అందులో జోగి ఫొటో ఉంది. ఇంకా దానిలో "నేను బాంబులు చుట్టడమే కాదు ఈసారి ప్రయోగిస్తున్నాను. బస్టాండులో వేకువజామున ఒక బస్సు పేలుస్తున్నాను. నువ్వు ఆపాలనుకుంటే ఆపు. చూద్దాం" అని ఉంది. వెంటనే బస్టాండులో మొత్తం పోలీసులను ఎలర్టు చేశాడు. అలా ఆ రాత్రి, పగలు అక్కడే కాపుండి వేయికళ్లతో వెతికాడు. కానీ, ఏమీ దొరకలేదు. తనను జోగి ఆటపట్టిస్తున్నాడని అనుకున్నాడు. వేసేవి జోకర్ వేషాలు, చేసేవి ప్రాణాలు ఆర్పేసే బాంబుల హెచ్చరికలు. వీడిని ఎలాగైనా పట్టుకుని తీరాలి అని మరింతగా వలలు బిగించాడు.

సెల్‌ఫోనులో ఉన్న జోగిందర్ బొమ్మను పెద్ద ఫ్లెక్సుషీటులోకి తీసుకువచ్చి కూడలిలో ఏర్పాటు చేశారు. పట్టణంలో ఎవరి నోట విన్నా జోగి గురించే కథనాలు. ఆ నెలలో క్రైమ్ మీటింగులో "పట్టణంలో ఇటీవల ఇళ్ల దోపిడీలు ఎక్కువయ్యాయి. ఎవరు పొరుగూరు వెళ్లినా, ఇంటికి తాళం వేసి ఉన్నా దొంగలు చొచ్చుకుపోయి దోచుకుంటున్నారు. మరోవైపు జోగి బాంబుదాడుల బూచిని తలచుకుని ఠారెత్తిపోతున్నారు. ఏది ఏమైనా 'లా అండ్ ఆర్డర్' చాలా ఘోరంగా ఉందని పలువురు ప్రశ్నిస్తున్నారు" అని అధికారులు మండిపడ్డారు. ఆ తరువాత వేరే ఊళ్లనుంచి మరికొంత మంది పోలీసులను పట్టణ పరిధిలో వేశారు. సెల్‌లో నెలకోసారి బాంబుబూచిని చూపుతున్నాడు జోగి. రాత్రుళ్లు ఇళ్ల దోపిడీలు యదేచ్ఛగా జరిగిపోతూనే ఉన్నాయి. రాజేంద్రకు పట్టుదల ఎక్కువైంది. తనకే మెసేజ్‌లు ఇస్తూ తనతో ఆడుకుంటున్న జోగి కోసం పట్టణమంతా అణువణువు గాలించడంలో రాత్రీపగలు శ్రమించాడు. ఈ వెదుకులాటలో ఒకరాత్రి ఒకదొంగ దొరికాడు. వాడిని తెచ్చి ఠాణాలో పడేసి చావగొట్టాడు.

"ఒక్కడివే యదేచ్ఛగా దొంగతనాలు చేస్తున్నావు. అంటే ఆరి తేరిన దొంగవై ఉండాలి. ఏ ఇంట్లో కూడా చిల్లర వస్తువుల జోలికి పోకుండా ఖరీదైనవే ఎత్తుకుపోతున్నావు. ఇన్నాళ్లూ పట్టణంలో జరిగిన దొంగతనాలకు నీవేనా కారకుడవు" అని లాఠీని పొట్టలో గుచ్చి అడిగాడు.

తొలుత కాదన్నా ఒప్పుకోక తప్పలేదు. అతడి పేరు శామ్యూల్. పలుమార్లు దొంగతనాల కేసుల్లో పోలీసులకు దొరికిపోయాడు. చిన్న శిక్షలు కూడా అనుభవించాడు. తెలివైన దొంగగా ఆచి తూచి అడుగేస్తుంటాడు. పెద్ద పథకంతో ఒకసారి బ్యాంకు దోపిడీ చేయడానికి ప్రయత్నించాడు. సెక్యూరిటీని అతడి తుపాకీతోనే మాడుపగిలేలా కొట్టి ఆ తుపాకీతో అందరినీ బెదిరించాడు. కానీ, ఒక్క లాకరూ తెరవలేక పారిపోయాడు. పోలీసులు గాలించారు. వారికి చిక్కకుండా పట్టణం వదిలి పారిపోయాడు. మళ్లీ ఇప్పుడు ఒక ఇంటిదొంగతనంలో పోలీసులకు చిక్కాడు. శామ్యూల్‌ను రాజేంద్ర లోగడ చూడలేదు. రాజేంద్ర ఠాణాకు వచ్చి ఆరు నెలలైంది. ఫొటో చూడడమే. ఉదయాన్నే డ్యూటీలో చేరిన పోలీసులు సెల్‌లో పడున్న శామ్యూల్‌ను చూసి అవాక్కయ్యారు. "సార్ వీడు బ్యాంకు దోపిడీకి విఫలయత్నం చేసినవాడు. పైగా వీడు బ్యాంకు సెక్యూరిటీగార్డును రక్తసిక్తం చేసి పారిపోయాడు. వీడు ప్రమాదకారి సార్. ఒకరకంగా కరడుగట్టిన నేరగాడు" అని చెప్పారు. అతడి వద్ద రికవరీకి పోలీసులు సిద్ధపడ్డారు. పద్నాలుగు ఇల్లు దోచుకున్నట్లు ఒప్పుకున్నాడు. దోచుకున్న ఖరీదైన వస్తువులు ఒక ఇంట్లో దాచినట్టు చెప్పి అక్కడికి తీసుకుపోయాడు. చాలా వస్తువులు దొరికాయి. ఒక గదిలోంచి మూలుగులు వినిపిస్తుంటే తలుపులు తెరిచారు. అక్కడ నేల మీద పడున్న జోగిని చూసి రాజేంద్ర ఆశ్చర్యపోయాడు.

"సార్ ఆ రోజు రాత్రి మీ ఠాణాలో పడుకుంటానంటే వద్దన్నారు. వీడు నన్ను ఎత్తుకుపోయి ఇలా నిర్బంధించి హింసిస్తున్నాడు సార్. రెండురోజులుగా నిద్రాహారాలు లేవు. వీడు ఏదో పూటవచ్చి ఇంత తిండి పెడుతున్నాడు"అని ఏడ్చాడు.

ఇన్‌స్పెక్టర్ రాజేంద్రకు విషయం పూర్తిగా అర్థమైంది. జోగి బాంబులబూచిని శామ్యూలే క్రియేట్‌చేసి పోలీసులను తప్పుదోవ పట్టించి తాను యదేచ్ఛగా దొంగతనాలు చేశాడు. చాలా తెలివిగా ప్రవర్తించాడు. కానీ నేరం దాగదు. ఏ రోజైనా పట్టిస్తుంది. అలానే పట్టుపడ్డాడు.

★

తీయతీయగా...

చక్రపొంగలి

కావలసిన పదార్థాలు

బియ్యం : ఒక కప్పు
పెసరపప్పు : పావుకప్పు (ముందుగా కడిగి, కొద్దిగా నీళ్ల పోసి ఉంచాలి)
నెయ్యి : పావు కప్పు, పంచదార : పావుకప్పు
బెల్లం : పావుకప్పు, ఎండుకొబ్బరి : పావు చిప్ప
జీడిపప్పు, కిస్‌మిస్, బాదంపప్పు: పది
యాలకులు : రెండు లేక మూడు,
పచ్చకర్పూరం : రవ్వంత

తయారుచేసే విధానం

పొయ్యిమీద మందపాటి గిన్నె పెట్టుకుని ఎసర పెట్టుకోవాలి. అవి మరుగుతుండగా ముందుగా కడిగిపెట్టుకున్న బియ్యాన్ని వేయాలి. కొద్దిగా ఉడికాక నానబెట్టుకున్న పెసరపప్పును వేయాలి. ఇప్పుడు సన్న సెగన ఉడకనివ్వాలి. వేరే పొయ్యిమీద ఒక గిన్నెలో పంచదార, బెల్లం వేసుకొని, కొద్దిగా నీళ్ల పోసి కరిగించుకోవాలి. చిన్న గిన్నెలో కొద్దిగా నెయ్యి వేసి ఎండుకొబ్బరి, జీడిపప్పు, బాదంపప్పు (చిన్నచిన్న ముక్కలుగా చేసుకోవాలి), కిస్‌మిస్ వేయించి ఉంచుకోవాలి. యాలకులను మెత్తగా దంచుకోవాలి. అన్నం దగ్గర పడుతుండగా కరిగించిన పంచదార, బెల్లం మిశ్రమాన్ని వేసి కొద్దిసేపు ఉంచాలి. తర్వాత నెయ్యి మొత్తం వేసి కలుపుకోవాలి. చివరిలో వేయించి పెట్టుకున్న జీడిపప్పు, బాదంపప్పు, కిస్‌మిస్, ఎండుకొబ్బరి మిశ్రమాన్ని, యాలకుల పొడిని వేసి బాగా కలుపుకోవాలి. ఆఖరులో పచ్చకర్పూరం కూడా వేసి దించేసుకోవాలి. అంతే నోరూరించే చక్రపొంగలి రెడీ!

పరమాన్నం

కావలసిన పదార్థాలు

బియ్యం : పావుకిలో, సగ్గుబియ్యం: పావుకప్పు
బెల్లం : సరిపడినంత, పాలు : అరలీటరు
నీరు : తగినంత, ఉప్పు : చిటికెడు,
జీడిపప్పు, కిస్‌మిస్ – 10, యాలకులు : 2 లేక 4
నెయ్యి : పావు కప్పు

తయారుచేసే విధానం

పొయ్యిమీద మందపాటి గిన్నె పెట్టుకుని పాలు, నీరు కలిపి ఎసరు పెట్టుకోవాలి. అవి మరుగుతుండగా ముందుగా కడిగిపెట్టుకున్న సగ్గుబియ్యం వేయాలి. అవి ఉడికాయని నిర్ధారించుకున్నాక, కడిగి ఉంచుకున్న బియ్యాన్ని వేయాలి. సన్న సెగన ఉడకనివ్వాలి. వేరే పొయ్యిమీద ఒక గిన్నెలో బెల్లం తురిమి వేసుకొని, కొద్దిగా నీళ్ల పోసి కరిగించుకోవాలి. చిన్న గిన్నెలో కొద్దిగా నెయ్యి వేసి జీడిపప్పు, కిస్‌మిస్ వేయించి ఉంచుకోవాలి. యాలకులను మెత్తగా దంచుకోవాలి. పాయసం దగ్గర పడుతుండగా కరిగించిన బెల్లాన్ని వేసుకొని కొద్దిసేపు ఉంచాలి. తర్వాత జీడిపప్పు, యాలకుల పొడిని, చిటికెడు ఉప్పును వేసి బాగా కలుపుకోవాలి. చివరగా మిగిలిన నెయ్యిని వేసి ఒక్కసారి తిప్పి దించుకోవాలి. ప్రీతికరమైన పాయసం తయార్!

చక్రపొంగలి

పరమాన్నం

పెసరపప్పు పాయసం

పాలతాలికలు

కావలసిన పదార్థాలు

పచ్చిబియ్యంపిండి : నాలుగు కప్పులు
నీళ్లు : 2 లీటర్లు,
చిక్కగా మరిగించిన పాలు : 1 లీటరు,
బెల్లం : కిలో (సన్నగా తురుముకోవాలి),
సగ్గుబియ్యం : 100 గ్రాములు
నెయ్యి : 100 గ్రాములు
కొబ్బరి తురుము : పావుకప్పు
జీడిపప్పు, కిస్‌మిస్ : 20 (నేతిలో వేయించుకోవాలి)
యాలకులు 5 బాగా పొడి చేసుకోవాలి.
పచ్చకర్పూరం : రవ్వంత

తయారుచేసే విధానం

గుప్పెడు బెల్లం తురుము విడిగా ఉంచి మిగిలిన బెల్లంలో మూడువంతుల యాలకుల పొడి, పచ్చకర్పూరం, కొద్దిగా నీళ్ల పోసి తీగ పాకం పట్టాలి. బియ్యంపిండిలో మిగిలిన యాలకులపొడి, తీసి ఉంచుకున్న గుప్పెడు బెల్లం, సగం నెయ్యి, పాలు, నీళ్ల కొద్దిగా వేడి చేసి పోసి కలుపుకోవాలి (బెల్లం, యాలకులపొడి వేయకుండా కూడా కలుపుకోవచ్చు). ఒక మందపాటి గిన్నెను పొయ్యిమీద ఉంచి ఎసర పెట్టుకోవాలి. బాగా మరుగుతుండగా సగ్గుబియ్యం వేసి ఉడకనివ్వాలి. అవి ఉడికాక, బియ్యంపిండి మిశ్రమాన్ని మూడువంతులపైనే పాలతాలికల మూకుడులో వేసి తాలికలు వేగంగా వేయాలి. తాలికల మూకుడు లేనివారు. చపాతీ పీట మీద రెండు చేతులతో పాముల మాదిరి చేసుకొని చిన్న చిన్న ముక్కలుగా కట్ చేసుకొని వేసుకోవచ్చు. తాలికలు ఉడికాక, మిగిలిన బియ్యం పిండి మిశ్రమాన్ని జారుగా కలిపి పోయాలి. కొద్దిగా ఉడికాక పాలు పోసి బాగా కలపాలి. తర్వాత కొబ్బరి తురుము, ముందుగా తయారుచేసి పెట్టుకున్న పాకం వేసి కొద్దిసేపు ఉడికించుకోవాలి. చివరిలో వేయించిన జీడిపప్పు పలుకులు, యాలకుల పొడి, నెయ్యి వేసి బాగా కలుపుకొని దింపుకోవాలి. కమ్మని పాలతాలికలు రెడీ!

పెసరపప్పు పాయసం

కావలసిన పదార్థాలు

పెసరపప్పు : 1 కప్పు, నీరు : ఒకటిన్నర కప్పులు
బెల్లం : 1 కప్పు (తురిమినది), నెయ్యి : అరకప్పు
ఎండుకొబ్బరి : పావుకప్పు
జీడిపప్పు, కిస్‌మిస్ (నేతిలో వేయించు పెట్టుకోవాలి)
యాలకులు : 2 (మెత్తగా పొడి చేసుకోవాలి)

తయారుచేసే విధానం

పొయ్యిమీద మూకుడు పెట్టి రెండు చుక్కల నెయ్యి వేసి పెసరపప్పును దోరగా వేయించుకోవాలి. అది దించి పక్కనపెట్టి మందపాటి గిన్నె పెట్టుకొని అందులో నీరు పోసి బాగా మరిగాక అందులో పెసరపప్పు వేసి ఉడికించుకోవాలి. ఉడికాక బెల్లం, ఎండుకొబ్బరి వేసుకొని బాగా దగ్గరకు రానివ్వాలి. దగ్గరపడుతుండగా వేయించు ఉంచుకున్న జీడిపప్పు, కిస్‌మిస్, నెయ్యి, యాలకులపొడి వేసి బాగా కలుపుకోవాలి. ఎంతో రుచికరమైన పెసరపప్పు పాయసం తయార్!

- శాంతిశ్రీ

షెడ్యూల్డు కులాల రక్షణ కొరకు పటిష్ఠ చర్యలు

– జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులు

షెడ్యూల్డు కులాల అభివృద్ధికి, అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక విధానాలను అమలులోకి తెచ్చింది. వారి రక్షణ కోసం ప్రత్యేకంగా ఏర్పరిచిన జస్టిస్ పున్నయ్య కమిషన్ అందించిన సలహాలను సూచనలను ఆచరణలోకి తెస్తూ వివిధ ప్రభుత్వ శాఖలకు విశేష అధికారాలు కల్పించింది. తద్వారా తరతరాలు వెనుకబాటు తనంలో ఉన్న షెడ్యూల్డు కులాలవారు ఆర్థిక, సామాజిక రంగాలలో పాటు సర్వతోముఖాభివృద్ధిని సాధించే వీలుకలుగుతుంది. అంతే కాకుండా సమాజంలో అన్ని వర్గాలతో సమానంగా అవకాశాలు పొందగలుగుతారు. జస్టిస్ పున్నయ్య కమిషన్ సిఫార్సులకు అధారంగా **"రాష్ట్ర ప్రభుత్వం వివిధ శాఖలకు అందించిన విశేష అధికారాలు"** ఇలా ఉన్నాయి

హోం శాఖ: ప్రజా రక్షణ, వారి భద్రత కోసం అంచెలంచెలుగా కృషిచేస్తున్న హోంశాఖ పర్యవేక్షణలో షెడ్యూల్డు కులాల వారికి సంపూర్ణ రక్షణ కల్పించడానికి అనేక చర్యలు రూపొందించింది.

1) అవసరానుగుణంగా తమిళనాడు స్క్వాడ్ విధానాన్ని అనుసరిస్తూ, ప్రతి జిల్లాలోనూ స్పెషల్ మొబైల్ పోలీసు స్క్వాడ్ ఏర్పాటు
2) రోజుకో గ్రామం చొప్పున పోలీసు అధికారుల సందర్శన, పైగా సామూహిక కార్యకర్తల రూపంలో బాధ్యతల నిర్వహణకి రంగం సిద్ధం
3) ప్రతి సబ్ ఇన్‌స్పెక్టరు వారంలో ప్రతి శుక్రవారం రెండు గ్రామాలలో పర్యటించి, షెడ్యూల్డ్ కులాలవారిని ఆలయాలకి తీసుకువెళ్ళడం, హోటళ్ళలో విడి గ్లాసుల పద్ధతికి స్వస్తి చెప్పడం, సార్వజనీక బోరుబావులు, బావుల వద్ద అందరితో కలసి నీళ్ళు తెచ్చుకోవడం వంటి సంస్కరణలు చేయంచడానికి శక్తి వంచన లేకుండా కృషి చేస్తారు. అంటే నాలుగు నెలల వ్యవధిలో అన్ని గ్రామాలలో ఈ మంచి పనులు పూర్తవుతాయి.
4) పిసిఆర్ మరియు పిఒఏ చట్టాల పరిధిలోకి వచ్చే కేసులని పరిష్కరించడానికి అర్హులైన ప్రత్యేక పోలీసు అధికారులని ప్రోత్సహించడానికి ప్రత్యేక పురస్కారాలని అందించడం.
5) గుర్తించబడిన ప్రదేశాలలో షెడ్యూల్డ్ కులాలు తప్ప ఇతరుల ఆయుధాల లైసెన్సులని నిలిపివేయడం లేదా రద్దు చేయడం జరుగుతుంది.
6) రాష్ట్ర ఇంటెలిజెన్స్ స్పెషల్ శాఖ ద్వారా ఇబ్బందులుండే గ్రామాలు మరియు ప్రాంతాలలో తిరుగులేని నిఘా ఏర్పాటు.
7) చట్టాన్ని ఉల్లంఘించేవారిని , వారిని ప్రోత్సహించే వారినీ అరెస్టు చేయడానికి తగిన చర్యలు జరుగుతున్నాయి.
8) షెడ్యూల్డు కులాలవారి పట్ల నేరాలు జరిగిన ప్రాంతాలలో స్పెషల్ పోలీసు పికెట్‌లని ఏర్పాటు చేయడం.

9) షెడ్యూల్డు కులాలవారి భూముల్లో అక్రమంగా జొరబడే వారిని అరెస్టు చేసి, వారికి విరుద్ధంగా చార్జిషీట్లు దాఖలు చేయడానికి తగు చర్యలు చేపట్టడం.

10) ఇంకా నేరాలు చేసేవారిని గురించిన ఫిర్యాదుల నిమిత్తం ఎస్.సి. ఎస్.టి. సెల్ ఏర్పాటు, ఆయా కేసులని త్వరితంగా విచారింపచేయడం, బాధితులకి తగిన ఆర్థిక సాయం అందించడం, రాష్ట్ర రాజధానిలో డిజిపి ఆధ్వర్యంలో ఎస్.సి. ఎస్.టి. రక్షణ సెల్ ఏర్పాటు వంటి చర్యలు చేపట్టడం.

స్పెషల్ ఆఫీసర్ల నియామకం, సహాయక చర్యల నిమిత్తం మోడల్ ప్రణాళికలు సిద్ధం చేయడం.

రూ॥ 30,000/- ఆర్థిక సాయంతో పాటు పక్కా గృహాలు నిర్మించి అందించడం, షెడ్యూల్డు కులాలకి చెందిన ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబానికి నష్ట పరిహారం, అర్హత కలిగిన ఒక సభ్యుడికి ఉద్యోగం కల్పించడం, కుటుంబ సభ్యులకి మెయింటెనెన్స్ చెల్లింపు, చట్టపరమైన సర్దుబాట్ల ప్రకటనలు, షెడ్యూల్డు కులాల ఫైనాన్స్ కార్పొరేషన్ భాగస్వామ్యం వంటివి కొన్ని ప్రముఖమైనవి.

షెడ్యూల్డు కులాల ఫైనాన్స్ కార్పొరేషన్ భాగస్వామ్యం వంటివి కొన్ని ప్రముఖమైనవి.

సాంఘిక సంక్షేమ శాఖ: రాష్ట్రంలో షెడ్యూల్డు కులాల వారి బాగు కోసం, వారి అభ్యున్నతి కోసం రకరకాల చర్యలు చేపడుతోంది.

గ్రామాలలో ఆర్.డి.ఓ., ఎం.ఆర్.ఓ. వంటి వివిధ స్థాయి అధికారుల ప్రోద్బలంతో అసమానతలని తొలగించడం, ఉల్లంఘనల విషయంలో విచారణలు చేపట్టడానికి డి.ఎస్.పి. స్థానంలో సబ్ ఇన్‌స్పెక్టర్, ఇన్‌స్పెక్టర్‌ల నియామకానికి భారత ప్రభుత్వానికి సిఫార్సు చేయడం, అల్లర్లు జరిగే ప్రాంతాల గుర్తింపు, అన్ని వర్గాల, జాతుల వారితో శాంతి సంఘాలను స్థాపించడం, షెడ్యూల్డు కులాలపై అత్యాచారాలకి గురైన వారికి ఆర్థిక సాయం, జిల్లా మెజిస్ట్రేటు ద్వారా త్వరితంగా చర్యలు చేపట్టడం.

అనుభవజ్ఞులైన సీనియర్ అడ్వకేట్లతో జిల్లా స్థాయి పబ్లిక్ ప్రాసిక్యూటర్ల ప్యానెల్ ఏర్పాటు, 10 సంవత్సరాల కంటే తక్కువ కాని ప్రాక్టీసు ఉన్న అడ్వకేట్లతో శాంతిభద్రతల సమీక్షలు జరిపించడం, ప్రభుత్వ సెక్రటరీల స్థాయిలో నోడల్ అధికారుల నామినేషన్, అల్లర్ల ప్రాంతాలలో జిల్లా కలెక్టరు, మేజిస్ట్రేట్‌లు, ఎస్.పి వంటి ఉన్నత అధికారుల పర్యటనలు జరిపించడం, బాధితులకి అప్పటికప్పుడు నగదు రూపంలో పరిహారం చెల్లింపుకి ఏర్పాట్లు, అవసరమైన మేరకు సహాయ, పునరావాస చర్యలు చేపట్టడం, అటువంటి అంశాల నివేదిక స్పెషల్ కోర్టుకి అందించడం, అత్యధికంగా అల్లర్లు జరిగిన ప్రాంతాలలో

సాధారణ పరిపాలనా శాఖ: చట్టాలని రూపొందించడం ముఖ్యమే, అయితే వాటిని అమలు జరిపించడం అంతకంటే ముఖ్యం అప్పుడే వాటి తాలూకు ఫలాలు, ఫలితాలు అవసరమైన వారికి దక్కడం సాధ్యపడుతుంది. షెడ్యూల్డు కులాల వారి అభ్యున్నతి కోసం ఈ శాఖ చేపడుతున్న పనుల సారాంశం గమనిద్దాం: ఒక్కో గ్రామానికి మూడు అసమానతల తొలగింపు చొప్పున షెడ్యూల్డు కులాల వారికోసం ప్రతి నెల 30వ తేదిన " పౌర హక్కుల దినోత్సవం " పాటింపు వంటివి ఉన్నాయి.

రెవెన్యూ శాఖ: షెడ్యూల్డు కులాల వారి విషయంలో అసమానతల తొలగింపు కోసం జిల్లా ప్రకారం అన్ని అవసరమైన చర్యలూ చేపట్టాలి. భూ గరిష్ఠ పరిమితి చట్టం కింద లభ్యమయిన మిగులు భూముల పంపిణీ జరపడం ఒక ముఖ్యమైన అంశం అయితే, వివిధ ప్రభుత్వ మెమోల ఆచరణతో వివాదాల పరిష్కారం దిశగా పనులు జరగనున్నాయి. ఇంకా, ప్రభుత్వ బంజరు భూములని భూస్వాముల చేత ఖాళీ చేయించడం, అక్రమ ఆక్రమణల నుండి రక్షణ కల్పించడం, అగ్ర హిందువులు ఆక్రమించుకున్న శ్మశానాలు, ఫుట్‌పాత్‌లని తిరిగి ఇవ్వడం వంటి పనులు కూడా ఊపందుకోనున్నాయి.

రంగును బట్టి మూడ్...

మన జీవితంలో రంగుల ప్రభావం ఎక్కువే అని చెప్పాలి. ఒక్కో రంగు మనసుకు ఒక్కో భావాన్ని కలిగిస్తుంది. మన గది గోడల రంగును బట్టి కూడా మన మూడ్ ఉంటుంది. ఒక గోడకున్న రంగులే కాదు, ఆ గదిలో ఉన్న వస్తువుల రంగును బట్టి కూడా ఉంటుంది. కార్పెట్లు, ఫర్నీచర్, డోర్ కర్టెన్లు, అల్లికలు, షోకేసుల్లోని బొమ్మల రంగులను బట్టి ఆ గదికొక అందం వస్తుంది. ఒకదానికొకటి విరుద్ధంగా ఉండే రంగులు గజిబిజిగా ఉంటాయి. ముఖ్యంగా ఫర్నీచర్ రుంగు గోడల రంగుకు దగ్గరగా ఉండేట్టు చూసుకోవడం చాలా అవసరం. ఇంట్లోని పెద్ద పెద్ద వస్తువుల రంగు ఎబ్బెట్టుగా వుండకూడదు. లేత రంగులను ఎంపిక చేసుకుంటే కంటికి ఇంపుగా ఉంటుంది. గది చాలా ఆకర్షణీయంగా, ఆహ్వానిస్తున్నట్టుగా ఉంటుంది. కానీ చాలా మంది లేత రంగులను నిర్లక్ష్యం చేస్తారు.

దృశ్య గ్రహణశక్తిలో రంగులు ముఖ్యమైన పాత్రను పోషిస్తాయి. అప్పటికి మన మనస్తత్వాన్ని కూడా మార్చేస్తాయి. ఏదైనా ఖాళీ ప్రదేశంలోకి వెళ్తే నిశ్శబ్దంగా, ఉత్సాహంగా, సామరస్యంగా, నీరసంగా... ఇలా రకరకాలుగా అనిపిస్తుంది. ఒక్కో రంగును బట్టి మనసు ఒక్కో విధంగా మారుతుంది. అందుకే చక్కటి రంగులతో అంతకంటే చక్కటి వాతావరణాన్ని మనమే సృష్టించుకోవాలి. ప్రకృతిలో ఎన్నో రంగులున్నప్పటికీ ఇవాళ కొన్ని రంగుల గురించి చెప్పుకుందాం. రెండు మూడు రంగుల కలియకతో మరికొన్ని రంగులను సృష్టించవచ్చు.

సహజమైన రంగులు

చాక్లెట్ రంగు, బంకమట్టి రంగు, ఇసుక, ఇటుకల రంగులు సహజమైన రంగుల కిందకు వస్తాయి. ఈ రంగులు చాలా ప్రశాంతమైన, సహజమైన వాతావరణాన్ని తలపిస్తాయి. ఈ రంగులు ఏ ఇతర రంగుల్లోనైనా నప్పుతాయి. బ్యాక్‌గ్రౌండులో ఉపయోగిస్తే బాగుంటుంది. వీటిని చెక్కవస్తువుల్లోనూ, సహజమైన రాళ్లలోనూ చూడవచ్చు. గచ్చు, ఇంట్లో అలంకరణకు ఉపయోగించే కొయ్య రంగులు పడక గదిలో హాయిగా, వెచ్చగా, అలసట తీరినట్టుగా ఉంటుంది.

ఎరుపు

ఈరంగు ఆవేశానికి, సజీవతకు చిహ్నం. ఉత్సాహవంతమైన, సజీవమైన రంగు. ఇది పండుగ వాతావరణాన్ని సృష్టిస్తుంది. అధిక ఉద్రేకానికి గురిచేస్తుంది. అందుకే దీనిని ప్రశాంతంగా ఉండాల్సిన పడకగదిలో ఉపయోగించకపోవడం మంచిది. ఎరుపును ప్రత్యేకమైన ప్రదేశాలలో, అలంకరణలో ఉపయోగిస్తే అందంగా ఉంటుంది. సోఫాలలో ఎర్రని మెత్తలు చూడడానికి బాగుంటాయి. గదికి అందాన్ని తెస్తాయి. భోజనాల గదిలోగానీ, ముందు ద్వారంలోగానీ విడిగా ఉన్న గోడలకు ఈ రంగు వేయడం వల్ల అతిథులకు ఆకర్షణగా ఉంటుంది. ఈ రంగును సరైన చోట వాడితేనే బాగుంటుంది. వంటగదిలో సిల్వర్ రంగు మీద సన్నని ఎర్ర గీతలు వేయడం వల్ల ప్రకాశవంతంగా జీవకళ ఉట్టిపడుతుంది.

నీలం

లేత రంగు నుంచి ముదురు రంగు వరకు అన్ని రకాల ఛాయల్లోనూ నీలి రంగు ప్రశాంత వాతావరణం కలిపిస్తుంది. లేత నీలి రంగు, బూడిద రంగుల సమ్మేళనం సహజంగా ప్రకాశవంతంగా ఉంటుంది. దీనిని పడకగదిలో వాడితే మంచి ప్రశాంతతను చేకూరుస్తుంది. ముదురు నీలి రంగు, ముదురుకలప రంగు సమ్మేళనం ఒకే వయసు వారు నివసించే ప్రదేశాలలో ఉపయోగిస్తే మంచి వాతావరణాన్ని సృష్టిస్తుంది. వేడి ప్రదేశాలలో ఉన్న వారు ముఖ్యంగా తమ ఇళ్లలో చల్లగా ఉంచుకునేందుకు నీలి రంగును ఉపయోగిస్తారు.

గులాబి రంగు

గులాబి రంగు గుణం వెచ్చదనం. ఇది ఎరుపు సమ్మేళనం అయినప్పటికీ ఉత్తేజాన్ని కలిగించే గుణం తక్కువే.

పసుపు రంగు

ఇది సచేతన రంగు. మనం వత్తిడికి గురైన సమయంలో ఇది సానుకూల దృక్పథాన్ని కలిగిస్తుంది. పసుపు రంగును తెలుపుతో కలిపి గోడలకు వేసుకుంటే ఉషోదయ వాతావరణాన్ని తలపిస్తుంది. రోజంతా అదే అనుభూతి ఉంటుంది. కలప రంగుతో కలిపి హాల్లోకానీ, అతిథుల పడకగదిలోకానీ ఉయోగించుకోవచ్చు.

నలుపు, తెలుపు

ఇవి రెండూ విరుద్ధమైనా వీటి సమ్మేళనం బాగా పనిచేస్తుంది. తెలుపు స్వచ్ఛతకు, పరిశుభ్రతకు సూచన. అందుకే వంటగదిలో, స్నానాల గదిలో నలుపుతోగానీ, ఇతర రంగులతో కలిపి వేసుకుంటే చాలా బాగుంటుంది. పూర్తిగా తెలుపును మాత్రం పడకగదిలో వాడకపోవడమే మంచిది. ఎందుకంటే వాతావరణం చల్లగా, కటువుగా అనిపిస్తుంది. తెలుపు రంగును గోడలకు వేసుకోవడం వల్ల గది విశాలంగా ఉండడమే కాకుండా ప్రకాశవంతంగా ఉంటుంది. నలుపు, తెలుపు రంగుల సమ్మేళనం బాత్‌రూములోగానీ, మనముండే గదులలో గానీ చాలా అందంగా ఉంటుంది.

నారింజ రంగు

ఇది ఎరుపు, పసుపు రంగుల కలయిక వల్ల ఏర్పడుతుంది. ఈ రంగు ఉపయోగించడం వల్ల జీవశక్తి వచ్చి ఉత్సాహంగా ఉంటుంది. పిల్లల పడకగదిలో ఈరంగు వేసుకుంటే బాగుంటుంది.

బూడిద రంగు

బూడిద రంగుకు సరైన సమ్మేళనం లేకపోతే నిరుత్సాహకరమైన వాతావరణం ఏర్పడుతుంది. ఎక్కువగా బూడిద రంగును ఇంట్లో ఉపయోగించకపోవడమే మంచిది.

వంగపువ్వు రంగు

ఈ రంగును స్ఫూర్తికి చిహ్నంగా చెప్పుకోవచ్చు. దీనిని జాగ్రత్తగా ఉపయోగించడం మంచిది. ఈ రంగు ఎక్కువగా వాడితే డంబంగా అనిపిస్తుంది.

ఈ రంగులే కాకుండా ఇంకా ఎన్నో రంగులను మనకు నచ్చిన విధంగా తీర్చిదిద్దుకోవచ్చు. మన ఇంట్లోకి కావలసిన వస్తువులను తీసుకునేప్పుడు వాటిని గది గోడల, పైకప్పు, గచ్చు, ఫర్నీచర్, ఇంకా ఇతర సామాన్ల రంగును బట్టి ఎంచుకోవాలి. అప్పుడే మన ఇంటిని సౌందర్యాత్మకంగా, ఆకర్షణీయంగా చేసుకోవచ్చు.

మన ఇల్లు చిన్నగా ఉంటే ఎక్కువ రంగులు ఉపయోగిస్తే గజిబిజిగా ఉంటుంది. అందుకే ఒకటే రంగును అది కూడా లేత రంగును ఉపయోగిస్తే మంచిది. చిన్న చిన్న అలంకరణలతో గది కూడా విశాలంగా అనిపిస్తుంది. రంగును ఎంచుకోవడమే కాకుండా ఎక్కడ ఎంత మోతాదులో ఉపయోగిస్తే మంచిదో జాగ్రత్తగా నిర్ణయించుకోవాలి.

ఆరోగ్యం

పరీక్షలంటే భయమేల!



పరీక్షలంటే భయం లేనిది ఎవరికి చెప్పండి! పరీక్షలు రాయవలసిన రోజులు దగ్గరికొచ్చేకొద్దీ 'ఫెయిల్ అవుతానేమో, మార్కులు తక్కువగా వస్తాయేమో' అని విద్యార్థులు మనసులో భయాన్ని సృష్టించుకుంటారు. పరీక్షలంటే కలిగే భయాన్ని విద్యార్థుల నుండి తొలగిస్తే పరీక్షలన్నీ ఆత్మవిశ్వాసంతో రాస్తారు. ఫస్టుక్లాసులో పాసవుతారు. భవిష్యత్తులో అనుకున్నది సాధిస్తారు. కాబట్టి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థుల మేలు కోరేవారెవ్వరైనా సరే విద్యార్థుల్లో నెగటివ్ ఫీలింగ్స్ ఫీడ్ చేయకుండా ఆత్మవిశ్వాసం కలిగే నాలుగు మాటలు మాట్లాడితే చాలా మంచిది. మరి ఆ వివరాలేంటో చూద్దామా!

ఎండ్లూరి ప్రభాకర్,
నరములు, మానసిక వ్యాధి
నిపుణులు, అనంతపూర్.

విద్యార్థులు మొదట ప్రతివిషయాన్ని పాజిటివ్‌గా ఆలోచించాలి. విద్యార్థి తనకు తానే సలహాలు ఇచ్చుకోవాలి. పరీక్షలన్నీ పూర్తిగా అయ్యేదాక సినిమాలు, టీవీలకు దూరంగా ఉంటే మంచిది. పాజిటివ్‌గా ఆలోచిస్తూ జీవితంలో ఎదగడానికి కలలు కనాలి. ఇతరుల కంటే నేను తక్కువ అనే ఆలోచన మనసులోనికి రానివ్వకూడదు. ఎంత కష్టమైనా ఇష్టంగా భరించడం నేర్చుకోవాలి. సంకల్పబలం మనలో తగినంతగా ఉన్నప్పుడే విజయం సాధించగల్గుతాం. అందుకోసం విద్యార్థులు పుస్తకాలు చదివేటప్పుడు ఏకాగ్రత కలిగే చోటు ఎంచుకోవాలి. సమయం, వాతావరణం కూడా విద్యార్థులకు సహకరించేవిగా ఉండాలి. మనసు పెట్టి చదవడానికి బయటి నుండి ఎలాంటి ఆటంకాలు రాకుండా చూసుకోవాలి.

ఎవరికైనా 60 నిమిషాల వరకే చేసే పనిపై ఏకాగ్రత ఉంటుంది. అవధానం కుదురుతుంది. ఆత్మస్థైర్యంతో చదివితే కచ్చితంగా అనుకున్న దానికన్నా ఎక్కువ మార్కులు వస్తాయి.

పిల్లల మనస్తత్వాన్ని బట్టి మనస్తాపానికి గురయ్యే సందర్భాలను, పరిస్థితులను, చర్చలను కల్పించకూడదు. ఇతర పిల్లలతో పదేపదే పోల్చకూడదు. దానివల్ల పిల్లల్లో ఆత్మన్యూనతా భావం ఏర్పడుతుంది. ఇలా కాకుండా వాళ్లను సానుకూలంగా ప్రోత్సహించాలి.

పేపరు ఎలా ఉంటుందో అని భయపడకుండా ఏవరేజ్ స్టూడెంటును దృష్టిలో ఉంచుకుని ప్రశ్నాపత్రాన్ని తయారు చేస్తారని గుర్తుంచుకోవాలి. పరీక్షల సమయంలో వీలయినంత వరకు మాంసాహారాన్ని, నూనె వంటకాలను భుజించకపోవడం మంచిది.

ఎక్కువసేపు నిద్ర మేలుకోకూడదు. దీనివల్ల చదువుకున్నది గుర్తుకురావడానికి అవరోధం ఏర్పడవచ్చు. పరీక్షకు కనీసం 2 గంటల ముందే చదవడం ఆపేసి ప్రశాంతంగా ఉండడం మంచిది. అలా చేయని పక్షంలో ఏకాగ్రత తక్కువయ్యే అవకాశాలు ఉంటాయి. పరీక్షాకేంద్రంలో కనీసం అరగంట ముందు కూర్చుని శ్వాసను బాగా పీల్చి వదులుతూ ప్రశాంతంగా ఉండాలి.

ప్రశ్నాపత్రం ఇచ్చిన వెంటనే గాబరా పడకుండా స్పష్టంగా 2,3 సార్లు పేపరు చదవాలి. తెలిసిన వాటికి ఎక్కువ సమయం వృథా చెయ్యకుండా అన్ని ప్రశ్నలకూ ఉన్న సమయాన్ని కేటాయించాలి.

ప్రతి సబ్జెక్టును ఎప్పటికప్పుడు మళ్లీ మళ్లీ చదువుతుండాలి. టైమ్ మేనేజ్‌మెంటును అలవర్చుకోవాలి. పరీక్షలకు కావలసిన వస్తువులను ముందు రోజే సమకూర్చుకోవాలి. పరీక్ష హాలుకు అరగంట ముందే చేరాలి.

పరీక్షల సమయంలో పాటించవలసిన జాగ్రత్తలు

ముఖ్యంగా తల్లిదండ్రులు గుర్తుంచుకోవాల్సిన విషయాలు ఏమిటంటే మాటిమాటికీ ఎక్కువమార్కులు రావాలని టార్గెట్ పెట్టి గుర్తుచేయకూడదు. మేం మా ఆర్థిక స్తోమతకు మించి మీ కోసం ఖర్చుపెట్టామని, కాబట్టి మంచి మార్కులు వచ్చి తీరాలని, నలుగురిలో మాపరువు నిలపాలనీ లాంటి మాటలు పిల్లలతో చెప్పరాదు. దానివల్ల పిల్లల్లో చదివేటప్పుడు ధ్యాస లోపించడానికి అవే కారణమవుతాయి. అలాంటప్పుడు ఎలా చదవాలి అనే ప్లాన్, ఏకాగ్రత కంటే తల్లిదండ్రుల మాటలే గుర్తుకొచ్చి టెన్షన్‌కు గురయ్యే అవకాశం ఉంది.

పిల్లలు చదివేటప్పుడు వాళ్లకు కష్టతరమైన సబ్జెక్టులను గమనించి వాటికి కాస్త ఎక్కువ సమయం కేటాయించి, వాటిని తోటి విద్యార్థులతో చర్చిస్తే బాగా గుర్తుండే అవకాశం ఉంటుంది. ముఖ్యంగా పరీక్షల సమయంలో తోటి విద్యార్థులతో పోల్చుకోకూడదు, వారి కంటే ఎక్కువ మార్కులు తెచ్చుకుంటానో లేదో అనే టెన్షన్‌తో ఇంకా వెనుకబడే అవకాశం ఉంటుంది. పక్క వారితో పోల్చుకుంటే నేను బాగా చదవగలను అనే నమ్మకముంటుంది కొందరిలో.

ప్రతి అరగంటకోసారి కళ్లు మూసుకుని అయిదు నిమిషాలు రెస్టు తీసుకోవాలి. చదివే సబ్జెక్టు ఓ పద్ధతిగా చదవాలి. అలా చేయలేకపోతే ఏకాగ్రత అంత తొందరగా కుదరదు. అందుకే ఎంత చదివినా విద్యార్థులు పరీక్షల్లో తప్పుతుంటారు. చాలా మంది విద్యార్థులు పరీక్షల కోసమే చదువుతూ కంఠస్థం చేసి, ఆ పరీక్ష కాస్తా పూర్తయ్యాక వాటిని మరచిపోతుంటారు. అధ్యయనాన్ని కేవలం పరీక్షలకే పరిమితం చేయకూడదు. ఇవాళ చదువుకున్న విషయాన్ని మెదడులో భద్రపరచుకుంటే అది తర్వాత బాగా ఉపయోగపడవచ్చు.

తక్కువ సమయంలోనే మీరనుకున్న విషయం చదవగల్గుతారు. ఇక్కడ ఎంతసేపు చదవాం అన్నది ముఖ్యం కాదు, ఎంత అర్థం చేసుకున్నామన్నది ముఖ్యం. కొంతమంది విద్యార్థులు రాత్రులు మెలకువగా ఉండి టీలు తాగుతూ చదువుతుంటారు. ఆషామాషీగా చదివే విద్యార్థుల కంటే ప్రణాళిక ప్రకారం తక్కువ సమయం చదివేవారే ఎక్కువ మార్కులు తెచ్చుకుంటారు. చదువు మీద అంకిత భావం, నిజాయితీ, ఆత్మవిశ్వాసం, ఏకాగ్రత, క్రమశిక్షణ చాలా అవసరం. అనవసర విషయాలమీద ఆలోచనమీద చర్చ పెట్టి మానసిక శక్తిని వృథా చేసుకోకూడదు. తల్లిదండ్రుల వత్తిడిని సానుకూలంగా తీసుకోవాలి. ప్రతి పాఠం చదివిన తర్వాత దాన్ని సంక్షిప్తంగా ఒక చోట రాసుకోవాలి. దీనివల్ల ముఖ్యమైన విషయాలు బాగా గుర్తుంటాయి. ఎంత అవసరమో అంతే చదవండి. ఆసక్తి ఉన్న సబ్జెక్టుపై కాకుండా ఆసక్తి లేని సబ్జెక్టుపై ముందే దృష్టి కేంద్రీకరించండి.

★

బొద్దు ముద్దే గానీ...

పిల్లలు బొద్దుగా వుంటే ముద్దు చేయని వారుండరు. చటుక్కున బుగ్గలు పట్టుకుంటాం. చిన్నప్పుడు బొద్దుగా ముద్దుగానే వుంటారు. కానీ ఆ తర్వాతి సంగతో! ఎన్ని సమస్యలు వచ్చిపడతాయో లెక్కించడమే కష్టం. మరి అలాంటి ఊబకాయం అభివృద్ధి చెందిన, చెందుతున్న దేశాల్లో ఎలా వుందో, దానికి కారణాలేంటో.... అట్టమీది కథలో చూద్దామా..

- కాకర్లమూడి విజయ్

లండన్‌లో నివసిస్తున్న ఎనిమిదేళ్ల హన్నా ఇంటి చుట్టుపక్కల ఆడుకునే స్థలం లేదు. ఆమె స్కూల్లో కూడా వారానికి ఒక రోజే పిటి క్లాసు ఉంటుంది. తీరికలేని ఆమె తల్లిదండ్రులు తన ఆహార విషయంలో కాస్త జాగ్రత్త తీసుకుని చిప్సు, చాక్లెట్లు తగ్గించారు. అయినా హన్నా రోజురోజుకు లావైపోతోంది. "ఆరేళ్ల వయసులో ఆమెకు 14 ఏళ్ల పిల్లల బట్టలు కొనవలసి వచ్చేది" అని ఆమె తల్లి గుర్తు చేసుకుంది. "తరువాత ఆ బట్టల పొడవు ఒకటిన్నర అడుగులు కత్తిరించవలసి వచ్చేది".

అయితే ఈ పరిస్థితులు మారడం ప్రారంభించాయి. లండన్‌లోని గ్రేట్ ఆర్మండ్ స్ట్రీట్ పిల్లల ఆసుపత్రిలోని పాల్ శాకర్ అనే డైటీషియన్ ప్రారంభించిన ఒక ప్రోగ్రాంలో హన్నా చేరింది. పది వారాల తరువాత ఆమె 5 పౌండ్ల బరువు తగ్గింది. ఒకప్పుడు పొట్టిగా, లావుగా, సిగ్గరిగా ఉన్న హన్నా ఇప్పుడు బాగా పొడవు పెరిగింది. "వారానికి మూడు రోజులు ఈతకు వెళ్లగలగడం ఆశ్చర్యమనిపిస్తుంది" అంటోంది హన్నా సంతోషంగా.

కానీ అభివృద్ధి చెందిన దేశాలలో బాల్య ఊబకాయులు విపరీతంగా పెరిగిపోతున్న నేపథ్యంలో హన్నా వంటి పిల్లలు చాలా అరుదు. చాలా దేశాలు పెచ్చుమీరిన అధికబరువు సమస్యతో సతమతమౌతున్నాయి. ఈ క్రమంలో అమెరికాదే పెద్ద పీట. దాదాపు 37 శాతం పిల్లలు, యుక్తవయసువారు అధికబరువు గలవారు. మిగతా దేశాలూ త్వరత్వరగా అమెరికాను అనుసరిస్తున్నాయి. యూరోపియన్ కాంగ్రెస్ ఆన్ ఒబెసిటీ గణాంకాల ప్రకారం యూరప్‌లోని 20 శాతం మంది 5-17 ఏళ్ల మధ్య పిల్లల్లో అధికబరువు/ఊబకాయం ఉంది.

ఇటువంటి 'బొద్దు' పిల్లలు ఊబకాయ పెద్దలుగానే పెరుగుతారని ప్రపంచ ఆరోగ్య సంస్థ చెబుతోంది. ఊబకాయంతో పాటు హృద్రోగాలూ, రక్తపోటూ, డయాబెటిస్, క్యాన్సర్ వంటి మహమ్మారులూ వెంబడిస్తాయన్నది ఆందోళన కలిగించే విషయం.

అమెరికాలో సుమారు మూడింట రెండువంతుల మంది పెద్దలు 'అధికంగా' అధికబరువున్న వారిలో సగం మంది పూర్తి స్థాయి ఊబకాయానికి పరిణతి చెందినవారు. చివరికి అమెరికన్ల పెంపుడు పిల్లులు, కుక్కలు కూడా ఉండవలసిన దానికంటే 25 శాతం వరకు ఎక్కువ బరువు పెరిగాయని తెలిసింది.

రెండు దశాబ్దాల క్రితం పెద్దలలో అధికబరువు ఇప్పటికి సగం మాత్రమే ఉండగా, పిల్లల్లో 1/3 వంతు మాత్రమే ఉండింది. విచిత్రమేమిటంటే

ఊబకాయులలో 27 శాతం మంది మాత్రం బరువు తగ్గే ప్రయత్నాలు చేస్తున్నారని చెప్పడం. శారీరకంగా ఆకర్షణీయంగా కనిపించే సమస్య మాత్రమే అయితే ఇబ్బంది లేదు కానీ, అధిక కొవ్వు అనేక సమస్యలను తెచ్చిపెడుతుంది. వాటిలో చాలావరకు ప్రాణాపాయం కలిగించేవే!

'భారీ' సమస్య

ఇంతకీ ఈ 'భారీ' సమస్యకు కారణం ఏమిటి? చాలా చిన్నది. అధిక కాలరీల ఆహారం అధికంగా తినడం, తగినంత వ్యాయామం చేయకపోవడం. అభివృద్ధి చెందిన దేశాలలోనే ఇటువంటి పరిస్థితి ఎక్కువగా ఉండడం యాదృచ్ఛికం. ఫాస్ట్‌ఫుడ్ కల్చర్, ఇళ్లలో పోషకాహారాలతో వంట చేసుకోలేకపోవడం, మార్కెట్లో విపరీతమైన జంక్‌ఫుడ్ లభించడం, మనలోనే నిగ్రహశక్తి లేకపోవడం వంటి కారణాలను అలవోకగా చెప్పవచ్చు. కానీ ఊబకాయానికి అత్యంత ముఖ్యమైన మూలం జన్యువులలో ఉండవచ్చని చాలామంది నిపుణుల అభిప్రాయం. కొన్ని మిలియన్ల సంవత్సరాల పాటు ఆహారం దొరకని పరిస్థితులలో పెరుగుతూ వచ్చిన మానవులు కంటికి ఇంపుగా, నోటికి రుచిగా అనిపించిన వాటిని భక్షించడం పరిణామక్రమంలో భాగమే. గత 5000 సంవత్సరాలలో మన జీవచర్యల్లో పెద్ద మార్పులు లేకపోయినప్పటికీ మన వాతావరణాన్ని మాత్రం సమూలంగా మార్చేశాం. గత దశాబ్ద కాలంగా పెరిగిన టెక్నాలజీ, అమెరికన్ల రోజువారీ జీవితాల్లో నుండి శారీరక వ్యాయామాన్ని పూర్తిగా తొలగించి వేసింది.

సూపర్ మార్కెట్ల జోరు

అదే సమయంలో విశాలమైన సూపర్ మార్కెట్లు చవకైన, అధిక క్యాలరీల చిరుతిళ్లతో నిండి పోయాయి. దీనికితోడు టెలివిజన్లలో తిండి పదార్థాల ప్రచారాలు జోరందుకున్నాయి. ఇటువంటి కృత్రిమ వాతావరణం అభివృద్ధి చెందిన దేశాల్లో అధికం. ఇదే క్రమేపీ ఇతర దేశాల్లోకి కూడా విస్తరిస్తోంది. అయితే ఇంకా మన పూర్వీకులైన రాతియుగం మానవుల్లా జీవిస్తున్న బ్రెజిల్‌లోని యానోమామిల్లో మచ్చుకి కూడా ఊబకాయం కనిపించదు.

ఆహార మార్పు

మానవుల పూర్వీకులు తమ పూర్వీకులైన మహావానరాల్లాగే ఎక్కువగా ఆకులూ, అలములూ తింటూ ఉండేవారు. ఆహారం వెదుక్కోవడానికే ఎక్కువ సమయం పట్టేది కాబట్టి ఎక్కువ తినవలసి వచ్చేది. అయినా ఆకుల్లో క్యాలరీలు తక్కువ కాబట్టి లావయ్యే ప్రసక్తే ఉత్పన్నం కాలేదు. సుమారు 2.5 మిలియన్ సంవత్సరాల క్రితం నుండి మాంసాహారపు అలవాటు మానవుల్లో ప్రవేశించిందని అంటారు. మాంసంలో ప్రోటీన్లు ఇతర రకాలు ఎక్కువగా ఉండడంతో మానవులు పొడవు పెరిగారు. అదే కారణం వల్ల నిత్యం ఆహారం తినే పద్ధతి కూడా తగ్గిపోయింది.

అయితే మాంసాహారం పెరిగినంత మాత్రాన 'తీపి' పట్ల అభిమానం, శరీరానికి దాని అవసరం మాత్రం తగ్గలేదు. ప్రోటీన్లు, మాంసం మెదడును పెంచినా, అది పని చేయడానికి మాత్రం చక్కెర కావలసిందే. దాంతో పళ్లు, ఫలాలు, దుంపల ద్వారా మెదడుకు కావలసిన గ్లూకోజ్ అందేది. కానీ మాంసం, చక్కెర వల్ల ఊబకాయం రాలేదు.

అందుకు కారణాలు చాలానే ఉన్నాయి. అందులో ఒకటి అప్పటి వారి భోజనం. అప్పటి వారు వేటాడే జంతువుల మాంసంలో కేవలం 4 శాతం మాత్రమే కొవ్వు ఉండేది. ఇప్పటి పౌల్ట్రీఫామ్‌లలోని కోళ్లలో దానికి 5-8 రెట్లు ఎక్కువ కొవ్వుంటుంది. అప్పట్లో రోజూ మాంసం దొరికేదన్న భరోసా ఉండేది కాదు. అసలేమాత్రం ఆహారం దొరకని రోజులూ ఉండేవి. పైగా వేట, ఆహారం కోసం అన్వేషణ... బోలెడంత వ్యాయామం.

అంతటి శ్రమ మధ్య లావవ్వడం అసాధ్యం. కానీ ఎప్పుడైతే [illegible] వ్యవసాయం కనిపెట్టాడో అప్పటి నుండి స్థూలకాయ [illegible] చెప్పుకోవాలి. దానికితోడు సాంకేతిక విప్లవం ద్వారా [illegible] మానవుడి జీవితాన్ని సుఖవంతం చేశాయి. రిఫైన్డ్ ఆహారం [illegible] పనికిరాని క్యాలరీలు పెంచుకోవడం ప్రారంభమైంది.

ఫాస్ట్‌ఫుడ్ సాంప్రదాయం గత 30 ఏళ్ల నుండి ప్రపంచవ్యాప్తంగా విజృంభిస్తోంది. చవకైన, రుచికరమైన, త్వరగా లభించే ఆహారంగా పేరొందిన అనేక పదార్థాలలో పోషకాలు తక్కువే. అందుకు తోడు కొవ్వు పదార్థాలు, సోడియం, చక్కెర కలగలిసిన రిఫైన్డ్ కార్బోహైడ్రేట్లు మెండుగా ఉంటాయి. ఇక ఆకర్షణీయమైన ప్యాకింగులూ, ప్రచారాలూ... చిన్నల నుండి పెద్దల వరకూ లాగేస్తుంటే లావు కాకుండా ఉండడం ఎవరి తరం? అది అమెరికాలో అయినా, అనకాపల్లిలో అయినా సరే.

ఒకపక్క ధనిక దేశాలైన అమెరికాలో, బ్రిటన్‌లో ఊబకాయులు పెరిగిపోతుంటే, అంతగా అభివృద్ధి చెందని చైనా వంటి ఆసియా దేశాలు ఈ విషయంలో వెనుకబడలేదు. ఈ మధ్యే ఏర్పడిన ఆర్థికాభివృద్ధి ఆ దేశంలో ఊబకాయులను 30 శాతానికి పెంచేసింది. ఇక్కడి ఒబెసిటీకి కారణాలు అంతుపట్టనివేమీ కావు. బీజింగుకు దక్షిణాన ఉన్న టియాంజిన్ నగరం పాశ్చాత్య నగరాలను పోలి ఉం

అన్నం తగ్గించాలి

మన ప్రాంతపు ఆహారం రుచికి అత్యంత ప్రాధాన్యతనిస్తుంది. పైగా ఎన్నో రకాల వంటకాలూ ఉంటాయి. అధిక బరువుకి ముఖ్య కారణం మనం తినే అన్నమే! రెండు గోధుమ/ జొన్న రొట్టెలతో ఒక చిన్న గిన్నె/కప్పు వరి అన్నం మన శరీర అవసరాలను తీర్చుతుంది.

కానీ మనం పచ్చడితో ప్రారంభించి, కూర, పప్పు, సాంబారు, రసం దాటి పెరుగుతో ముగిస్తాం. ఒక్కో విడతా ఐదేసి ముద్దలు తిన్నా కనీసం 30 ముద్దల అన్నం లాగిస్తాం. దానికి తోడు నెయ్యి, వేపుళ్లు, మాంసం, స్వీట్లు! వంటలు రుచిగా ఉంటే మరి చెప్పేదేముంది? సగటున రోజుకు కావలసిన కాలరీలు (పురుషులు 2-3 వేలు, స్త్రీలు 3-4 వేలు) ఒక పూటకే వచ్చేస్తాయి. అంతలా అన్నం తిని రాత్రికి అదే స్థాయి భోజనం, ఉదయపు 'టిఫిన్లు' అడపాదడపా చిరుతిళ్లూ, కాఫీ, టీ, కూల్‌డ్రింకులూ... మన శరీరాన్ని మనం మామూలుగా పోషించడం లేదు!

నలభై ఏళ్లు దాటిన వాళ్లు రాత్రిపూట 'రైస్' తినడం మానేయాలి. వీలైతే మధ్యాహ్నమూ తక్కువ తినాలి. ఉదయం మాత్రం మామూలుగా తినొచ్చు.

సెంటర్లు అధికంగానే కనిపిస్తాయ్.

ఇటువంటి కారణాలే ఇతర దేశాల్లోనూ ఉన్నాయి. శారీరక వ్యాయామానికి వీలు కల్పించని స్కూళ్లు, కాలేజీలు చిన్న పిల్లల్ని లావయ్యే దిశగా లాక్కెళ్తే, ఇంటికి వచ్చాక కూడా వీలు కాని/లేని వ్యాయామం వారిని టీవీ ముందుకి తీసుకెళ్తుంది. ఒక గంట పాటు టీవీ చూస్తూ (కదలకుండా) అభివృద్ధి చెందుతున్న దేశాలలోనూ ఊబకాయం ప్రస్తుతం ఆకలి కన్నా పెద్ద సమస్యగా మారింది.

పలుదేశాల్లో...

ప్రపంచవ్యాప్తంగా 1.5 బిలియన్ ప్రజలు అధిక బరువుతో ఉన్నారు. కాగా, 800 మిలియన్ జనాలు మాత్రమే తక్కువ బరువుగల వాళ్లు. పేదరికంలో మగ్గుతున్న నైజీరియా, ఉగాండా వంటి దేశాల్లోనూ ఒబెసిటీ సమస్య తలెత్తింది.

మెక్సికోలో 1989లో 10 శాతం కంటే తక్కువ మందికి అధికబరువు ఉండేది. ఒక దశాబ్దంలో వారి సంఖ్య 19 శాతానికి పెరిగింది.

ప్రతి 7 మెక్సికన్లలో ఒకరికి టైప్-2 డయాబెటిస్ వ్యాధి ఉంది.

బ్రెజిల్లో 1975లో 20 శాతం ఉన్న అధికబరువు ప్రజానీకం 1997 కల్లా 37 శాతానికి, ప్రస్తుతం 50 శాతానికి చేరింది.

ఈజిప్టులో పదేళ్ల క్రితమే 60 శాతం ఊబకాయంతో బాధపడేవారు.

ఒక చిప్స్ ప్యాకెట్ లాగించేస్తే బోలెడన్ని క్యాలరీలు శరీరంలో చేరి కొవ్వుగా మారిపోతుంటాయి.

కంప్యూటర్ల ముందు కదలకుండా కూర్చుని చేసే ఉద్యోగాలు ఎక్కువైన నేపథ్యంలో పెద్దలకీ అదే సమస్య.

రెండు దశాబ్దాల క్రితం బరువు తగ్గడానికి యోగాసనాలు వెయ్యమంటే భారతదేశంలోనూ వింతగా చూచేవారేమో. ఇప్పటికీ అర్ధాకలితో అర్చుకుపోయే జనాభా అధికంగా ఉన్న మనదేశంలోనూ అధికబరువు సమస్య పెరుగుతోంది. పట్టణాలలో 45 శాతం స్త్రీలు, 30 శాతం పురుషులు అధిక బరువుతో సతమతమయ్యే వారే!

కారణాలెన్నో

విపరీతంగా లావుకావడానికి ముఖ్య కారణాలు ఆహారపు అలవాట్లలో మార్పు, శరీరవ్యాయామం లేకపోవడం, ఆరోగ్యం. నగరాలలో, పట్టణాలలో విస్తృతమైన శ్రేణిలో ఆహారపదార్థాలు లభిస్తుండడంతో బాటు, చవకగా దొరకడం కూడా ఒక కారణం. పల్లెలతో పోల్చితే పట్టణాలలో ఉపాధి పనులు తక్కువ శారీరకశ్రమతో కూడినవై ఉంటాయి. పైగా స్త్రీలూ ఇంటికి దూరంగా ఉద్యోగాలు చేయవలసి రావడంతో ఇంట్లో చక్కగా, పోషకాహారాలతో వంట చేసుకోవాలన్న కోరికా, చేసుకునే తీరికా, ఓపికా లేకపోవడం

కద్దు. ఆ కారణంగా వస్తూ వస్తూ ఏ ఫాస్ట్‌ఫుడ్డో తినేయడం జరుగుతోంది.

అలాగని పల్లెటూళ్లలో ఈ సమస్యలు లేవని కాదు. యంత్రాల రాకతో శారీరక శ్రమ చాలా వరకు తగ్గిపోయింది. ప్యాకేజీలోని చిరుతిళ్లు పల్లెలకూ విస్తరించాయి. టీవీలూ పాతుకుపోయాయి.

కాబట్టి ఊబకాయం, అధికబరువు, తద్వారా ఉత్పన్నమయ్యే అనేక ఆరోగ్యసమస్యలూ అచ్చంగా కొనితెచ్చుకున్నవేనని చెప్పుకోవాలి. వీటికితోడు మనలోని జన్యువులు కూడా మన వ్యవహారశైలిని బట్టి సమస్యను జటిలం చేస్తున్నాయి. కొన్ని జాతులలో ఆహారం పుష్కలంగా లభించినప్పుడు కొవ్వు రూపంలో దాచుకుని, లభించని కాలంలో వాడుకునే విధంగా జన్యువులు పనిచేస్తాయి. అటువంటి జాతులలో వంశపారంపర్యంగా ఊబకాయం సంక్రమిస్తుంది.

అధికబరువు, ఊబకాయం వల్ల హృద్రోగాలూ, టైప్-2 డయాబెటిస్, ఎముకల సమస్యలూ, కొన్ని రకాల క్యాన్సర్లూ వస్తాయి. ఈ సమస్యలే కాకుండా సామాజికంగా కూడా అధికబరువున్న వాళ్లు అనేకానేక ఇబ్బందులు ఎదుర్కొంటారు. ఫలితంగా వచ్చే మానసిక ఆందోళన వల్ల మరింత బరువు పెరుగుతారు.

పరిష్కారం కోసం వెతుకులాట

ఒకపక్క బరువు సమస్యలు పెరుగుతూనే ఉన్నా ఇప్పుడిప్పుడే ప్రజలు ఆ దిశగా పరిష్కారాలు వెతికి ఆచరించే పనిలో పడ్డారు. ఉదయం సమయాలలో నగరంలోని పార్కులన్నిటిలో 'వాకింగ్' చేసేవారి సంఖ్య పెరుగుతోంది. 'జిమ్'లు కూడా యువతను ఆకర్షిస్తున్నాయి. సినిమా నాయికా నాయకులు జీరో సైజులు, సిక్స్ ప్యాక్‌లతో ఒక విధంగా శరీర ఆకృతిపై ఆసక్తి కలిగిస్తున్నారు. అయినా ఇవన్నీ కలిసి కూడా పెను సమస్యను తగ్గించలేవు.

ముందునుండే మనం మన ఆహారం, వ్యాయామం పట్ల ధ్యాస చూపించాలి. నిత్యం రెండు గంటలైనా చెమట పట్టేలా వ్యాయామం చేయాలి. మితంగా పౌష్టికాహారం తీసుకోవాలి. శరీరానికి వ్యాయామం కలిగేలా చిన్న పిల్లలతో కలిసి ఆరుబయట ఆటలు ఆడాలి. ఐదారు గంటలు క్రికెటర్లు చెమటోడ్చి ఆడుతోంటే, పాతిక శాతం దేశజనాభా అన్ని గంటలూ కదలకుండా చెత్తా చెదారం తినేస్తూ, శుష్క క్యాలరీల 'కోలా'లు తాగేస్తూ ఆ మ్యాచ్‌లు చూస్తుంటుంది.

ఇటువంటి అలవాట్లు మానుకోవాలి. రుచికరంగా వంటలున్నప్పుడు ఎక్కువ తిన్నా, ఆ పూట మరింత ఎక్కువ వ్యాయామం చేయాలి. ఇంటికి దగ్గరలోని పనులకు నడిచి వెళ్తుండడం అలవాటు చేసుకోవాలి. లిఫ్టుల బదులు మెట్లమీదే నడవాలి. ఇటువంటి చిన్నచిన్న పనుల వల్ల అధిక బరువు రాకుండా చూసుకోవడమే కాకుండా ఊబకాయాన్ని కూడా తగ్గించుకోవచ్చు.

అభివృద్ధి చెందిన దేశాలు మిగతా వారికి 'అంటించిన' ఎన్నో దురవాట్లతో పాటే ఊబకాయ సమస్యా పాకిపోయింది. దాన్ని ఎదుర్కోవడం మన మంచికే!

★

కొవ్వు కరగాలి

ప్రోటీన్లు, కార్బోహైడ్రేట్లు, కొవ్వు పదార్థాలు మన ఆహారంలో ముఖ్యమైన పోషకాలు. అయితే వాటిలో సమతుల్యత అవసరం. సాధారణంగా మనం కార్బోహైడ్రేట్లు ఎక్కువగా తినేస్తాం. శరీరానికి అవసరమైన కాలరీల కంటే ఎక్కువ తీసుకుంటే అవన్నీ కొవ్వుగా మారి నిలువ ఉంటాయి(ఎప్పుడైనా కాలరీలు తగ్గితే కరిగి ఉపయోగపడడానికి). కానీ మనం అవకాశం ఇవ్వకుండా మరింత కొవ్వు పెంచుకుంటూ పోతాం. కొవ్వు కరిగేంత శ్రమ చేస్తుంటే ఎంత తిన్నా ఇబ్బంది లేదు.

కూల్‌డ్రింకులలో కేవలం చక్కెర పదార్థాలు మాత్రమే ఉంటాయి. అవి శుష్క క్యాలరీలు (ఎందుకూ పనికిరానివి).

నిజమైన పండ్ల రసాలు శ్రేష్ఠం. బర్గర్లు, చిప్స్ వంటి పదార్థాలలో కూడా విపరీతమైన కార్బోహైడ్రేట్లు, లవణాలు ఉన్నాయి. వాటి బదులు ఉడికించిన వేరుశనగలు మంచివి.

చాక్లెట్లు, ఐస్‌క్రీములు మితంగా తీసుకుంటే మంచిది.

నవ్వుల్ - పువ్వుల్

మార్పిడి

రవి : మీ కుటుంబం మొత్తానికి డాక్టరు అవసరమే లేకపోవడం చాలా అదృష్టమే. అందరిదీ మంచి ఆరోగ్యమన్నమాట.

రాజు : ఆరోగ్యమా నా బొందా, ఒక్కొక్కరికి ఒక్కో రోగం వుంది. అవసరాన్ని బట్టి మందులు మార్చుకుంటాం అంతే.

ధన్యవాదాలు



మధు : ధన్యవాదాలు పొందనివే మంచి రచనలు.

కిరణ్ : అందుకేనేమో ధన్యవాదాలు తెలుపుతూ నా రచనలన్నీ తిప్పి పంపిస్తుంటారు.

మోసం



వినియోగదారుడు : ఈ రేడియో నాకు అమ్మి నన్ను దారుణంగా మోసగించావ్. అవునా?

షాపు యజమాని : ఎంతమాత్రం కాదు.

వినియోగదారుడు : మరి దీనిమీద "సోనీ - మేడ్ ఇన్ జపాన్" అని వుంది. ఇందులోనేమో "ఆల్ ఇండియా రేడియో" అని ఎందుకు వస్తుంది.

కదలిక

రవిశంకర్ : నేను వేదికపైకి వచ్చి పాట ప్రారంభించగానే ప్రేక్షకుల్లో ఒక రకమైన కదలిక వచ్చింది.

రాజు : అవును నేనూ అక్కడ వున్నాను. అందరూ బయటికి వెళ్లడానికి కదిలారు.

ఎలా సాధ్యం?

జడ్జ్ : పది దొంగతనాలు ఒక్క వారంలో చేయడం ఎలా సాధ్యపడింది నీకు?

దొంగ : రాత్రనకా పగలనకా అవిశ్రాంతంగా కష్టపడ్డాను. నాకు లాగా ప్రతి ఒక్కరూ పనిచేస్తే దేశం సస్యశ్యామలంగా వర్ధిల్లుతుంది సార్.

అనారోగ్యం

అధికారి : నీ చివరి వుద్యోగం అక్కడ ఎందుకు మానేశావ్?

ఉద్యోగి : అనారోగ్యం వల్ల సార్.

అధికారి : అంటే కాస్త వివరంగా చెప్పు.

ఉద్యోగి : నావల్ల ఆయన దీర్ఘకాలం అనారోగ్యానికి గురయ్యాడు సార్.

బంధుత్వం

(రాజు, అతని భార్య పోట్లాడుకుంటూ వీధిలోనివారికి దారి ఇస్తున్నారు. హఠాత్తుగా రాజు ముందు ఒక గాడిద దారిన పోతూ వీరి మధ్య ప్రత్యక్షమైంది.)



రాజు : మీ చుట్టాలా

భార్య : అవును, నా వివాహంతో బంధుత్వం కలిసింది.

కంట్లో పడింది

రామయ్య : పోయిన వారం మా ఆవిడ కంట్లో నలక పడితే డాక్టర్ దగ్గరకు తీసుకెళ్లా. పదిరూపాయలతో సరిపోయింది.



భీమయ్య : నువ్వు చాలా అదృష్టవంతుడివి. మా ఆవిడ కంట్లో బెనారస్ చీర పడింది. నాకు 2500 రూపాయల బిల్లు అయింది.

- లక్ష్మీ నారాయణ

ఎక్కడున్నాయ్!

హాయ్ నేస్తాలూ!కింద ఏడు పక్షులున్నాయి. వాటిలో రెండింటి నీడలు కిందున్నాయి. మీరేం చేయాలంటే ఆనీడ ఉన్న రెండు పక్షులు ఏ నెంబరున్నవో కనిపెట్టి చెప్పాలి.



F	I	R	E	F	L	Y	J	C	B	I	K	E	E
L	S	H	T	B	S	U	I	S	A	R	G	B	I
O	D	O	S	U	N	G	L	A	S	S	E	S	C
W	L	E	D	T	E	S	H	M	E	P	O	W	E
E	R	H	A	T	S	R	E	T	B	I	S	I	C
R	F	Y	T	E	O	H	B	E	A	C	H	M	R
J	U	M	P	R	O	P	E	S	L	N	O	T	E
L	I	E	R	F	A	N	E	P	L	I	R	S	A
E	N	T	A	L	I	C	S	O	J	C	T	O	M
P	T	H	N	Y	S	I	R	B	I	O	S	P	E
L	E	L	E	M	O	N	A	D	E	D	O	G	B

పదాలు కనిపెట్టేద్దాం

ఫ్రెండ్స్.... మీకు కొన్ని ఇంగ్లీషు పదాలు ఇస్తాం. వీటిని పైనున్న అక్షర సమూహంలో ఎక్కడున్నాయో కనిపెట్టి సున్నా చుట్టండి. అవి నిలువుగా, అడ్డంగా, క్రాస్‌గా ఎలాగైనా వుండొచ్చు. మరి ఆ పదాలేంటో చూద్దామా...

baseball,beach, bees, bike, butterfly, fan, firefly, flower, ice cream,jump rope, lemonade, picnic,shorts,sunglasses, swim

ఎన్ని చెట్లో?

హాయ్... కింద బోలెడన్ని చెట్లు వున్నాయి చూశారా? అయితే అన్నీ గజిబిజిగా లెక్కపెట్టడానికి వీలుగా లేవుకదూ. అందుకే మావల్ల కాదు అని అనకుండా త్వరగా అవి మొత్తం ఎన్నున్నాయో చెప్పేయండి.





మూడు ఎలా...

ఫ్రెండ్స్... పైనున్న అగ్గిపుల్లల అమరికలో ఒక చతురస్రం మాత్రమే కనిపిస్తుంది కదూ. ఇప్పుడు మీరేం చేయాలంటే అక్కడున్న వాటిలోనుండి మూడు అగ్గిపుల్లలను మాత్రమే మార్చి మూడు చతురస్రాలు చేయాలి. చేస్తారు కదూ. తెలీకపోతే మా జవాబు చూడండి.

బాలనేస్తాలు

నేర్చుకుందాం



రంగులేసేద్దాం!

ఎలాగబ్బా...

హాయ్ నేస్తాలూ... కింద అడ్డదిడ్డంగా కత్తిరించిన ఆరు ముక్కలు వున్నాయి చూశారుగా. వీటితో మీరు రెండు చతురస్రాలు చేయాలి. ఎలా చేయాలో తెలీకపోతే జవాబు చూడండే.





కవల చేపలు

నేస్తాలూ...పైనున్న ఆరు చేపల్లో రెండు అచ్చంగా ఒకేలా వుంటాయి. అవి ఏవో గుర్తుపట్టండి మరి.

జవాబులు

ఎన్ని చెట్లో: 12.

కవల చేపలు: 1.3.

మూడు ఎలా...



ఎలాగబ్బా...



'మందు'తోనే మానవుల మనుగడ!!

చెట్టుమీది నుంచి రాలిన పండు ఎందుకు రాలిందని ఆలోచించటంతో మానవుడిలో హేతువాదం మొలకెత్తిందని ఇప్పటివరకు చెప్పుకున్నాం. ఇక ముందు దానికి బదులు పురాతన మానవుడు చెట్టునుంచి రాలిపడిన పండును తిని చూసి అలాంటివే ఇంకా కావాలనుకున్నాడని, ఆ పండులో మత్తుకలిగించే పదార్ధం రక్తంలో చేరటంతో ఉత్తేజం పొంది ఇంకా మత్తెక్కించే అలాంటి పండ్లకోసం ప్రయత్నించి వాటికోసం అందరినీ ప్రోత్సహించాడని మనం చెప్పుకోవాలన్నమాట. మెక్‌గవర్న్ మహాశయుడికి తన జీవితకాలమంతా మానవాళి మనుగడలో 'మందు' జాడలను కనుగొనటానికే వినియోగించాడని ప్రపంచంలో పేరుంది. అదెంత నిజమో గాని మన రాష్ట్రంలో ఇపుడు జరుగుతున్నదానికి చక్కగా సరిపోయే విధంగా ఉంది.

ఒకసారి ఒక మతప్రచారకుడు ఒక మందుబాబును మంచివాడిగా మార్చుదామని ప్రయత్నించాడు. "ఎందుకయ్యా బాబూ నువ్వు ఎన్ని చెప్పినా నేను మారను" అని మందుబాబు చెప్పాడు. అలాకాదు మతం కంటే బీరు ఎలా మెరుగైనదో చెప్పి నన్ను సంతృప్తి పరిస్తే నేను నీజోలికి రాను అని మత ప్రచారకుడు చెప్పాడు. దానికా మందుబాబు ఇలా చెప్పాడట.'బీరుకే నీ జీవితాన్ని అంకితం చేస్తే దాన్ని ఆపేందుకు సహాయం చేసే వారు ఉంటారు, బీరు తాగకపోతే నిన్నెవరూ చంపరు, బీరు ఎప్పుడూ పెద్ద యుద్ధాలకు కారకురాలు కాలేదు, తమ గురించి ఆలోచించుకోలేని పిల్లల గురించి ఆలోచించాలని బీరు బలవంతం చేయదు, ఫలానా బ్రాండ్ బీరు తాగుతున్నావని నిన్నెవరూ దహనం, ఉరి, లేదా చిత్రహింసలు పెట్టరు. రెండో బీరు కోసం యుగాంతంవరకు ఆగనవసరం లేదు... దేవుడు మనలను ప్రేమిస్తాడని, మనం సంతోషంగా ఉండాలని కోరుకుంటాడని చెప్పేందుకు బీరు ఒక నిదర్శనం అని బెంజమిన్ ఫ్రాంక్లిన్ కూడా చెప్పాడు, బీరును కనుగొన్నవాడెవడోగాని ఎంతో తెలివైన వాడని ప్లాటో చెప్పాడు తెలుసా, అంటూ చెప్పటం ప్రారంభించటంతో ఇంకేం వినాల్సి వస్తుందో అని ఆ మతపెద్ద ఒక నమస్కారం పెట్టాడట. మత్తులో మునిగిన వాడు అది మతమైనా, అధికారమత్తైనా, మందైనా, మరొకటైనా దేనిలో మునిగితే దాని చుట్టూనే తిప్పుతాడు. తనను తాను సమర్ధించుకొనేందుకు పడరాని పాట్లు పడతాడు.

ఇంతకూ ఇదెందుకు చెప్పాల్సి వచ్చిందంటే ఈ మధ్య కొందరు కొన్ని పదాలకు, చర్యలకు మందుబాబులాగా తమదైన తత్వంతో కొత్త అర్ధాలను, టీకా తాత్పర్యాలను చెబుతున్నారు, పరమార్ధాలను సృష్టిస్తున్నారు. డొంకతిరుగుడెందుకు అదేంటో కొంచెం వివరించవచ్చుకదా అంటున్నారా! మహాత్మాగాంధీ, పొట్టిశ్రీరాములు చేసిన నిరాహారదీక్షల గురించి పరిమితంగా అయినా చదువుకున్న మా వాడు తాను అడిగింది ఇవ్వనపుడు నిరాహారదీక్షలు ప్రారంభించాడీ మధ్య. స్కూలు బంద్‌కావటంతో టీవీలు చూసి "ఇదేంటి నాన్నా నిరాహారదీక్షలంటే ఇలా చేస్తున్నారేమిటి?" అని అడిగాడు. నిరవధిక నిరాహారదీక్ష అంటే సెలైన్ బాటిల్స్‌తో ఆసుపత్రి పడకపై చేసేదని, నాలుగురోజులు దీక్ష చేసిన తరువాత పోలీసుల కళ్లుగప్పి పందెపు పరుగులతో ఆసుపత్రి పడకలపై దూకి దుప్పటి కప్పుకోవటం అని, దోపిడీదార్లంటే చంబల్ బందిపోట్ల మాదిరి ఆంధ్రదోపిడీ దారులని మన వీర విప్లవకారులు సిద్ధాంతీకరించటం ఇలా చాలా చాలా మీరు కళ్లారా చూస్తూ, చెవులారా వింటున్నారు కదా. ఆ దారిలోనే పాట్రిక్ మెక్‌గవర్న్ అనే అమెరికా ఆర్కియాలజిస్టు తాజాగా ఒక'మందు' సిద్ధాంతాన్ని ముందుకు తెచ్చాడు. ఆ పెద్దమనిషి చెబుతున్నదాని ప్రకారం మన పూర్వీకులు తినటానికి గాకుండా తాగి మత్తెక్కి తిరగటంకోసం వ్యవసాయాన్ని ప్రోత్సహించారట.

చెట్టుమీది నుంచి రాలిన పండు ఎందుకు రాలిందని ఆలోచించటంతో మానవుడిలో హేతువాదం మొలకెత్తిందని ఇప్పటివరకు చెప్పుకున్నాం. ఇక ముందు దానికి బదులు పురాతన మానవుడు చెట్టునుంచి రాలిపడిన పండును తిని చూసి అలాంటివే ఇంకా కావాలనుకున్నాడని, ఆ పండులో మత్తుకలిగించే పదార్ధం రక్తంలో చేరటంతో ఉత్తేజం పొంది ఇంకా మత్తెక్కించే అలాంటి పండ్లకోసం ప్రయత్నించి వాటికోసం అందరినీ ప్రోత్సహించాడని మనం చెప్పుకోవాలన్నమాట. మెక్‌గవర్న్ మహాశయుడికి తన జీవితకాలమంతా మానవాళి మనుగడలో 'మందు' జాడలను కనుగొనటానికే వినియోగించాడని ప్రపంచంలో పేరుంది. అదెంత నిజమో గాని మన రాష్ట్రంలో ఇపుడు జరుగుతున్నదానికి చక్కగా సరిపోయే విధంగా ఉంది.

భాషాప్రయుక్త రాష్ట్రాల ఏర్పాటును మన పెద్దలు ఎందుకు కోరారు? అందుకోసం ఉద్యమాలు నడిపి ఎలా సాధించారని ఆలోచించటాన్ని పక్కనపెట్టాలి. మెక్‌గవర్న్ 'మందు' సిద్ధాంతం ప్రకారం అధికారమనే పండును తొలిసారి రుచి చూసిన తరువాత దాని మత్తు తలకెక్కిన తరువాత అధికార పండు చేజారగానే ఏదో ఒకసాకుతో తిరిగి పండ్ల కోసం నానాయాగీ చేస్తారని, అందుకోసం ఎలాంటి అడ్డదారులనైనా తొక్కేందుకు అక్రమాలకు పూనుకుంటారని, అమాయకులను బలిపెడతారని చెప్పుకోవాలి. చరిత్రలో ఎవరు ఎప్పుడు వేర్పాటువాదాన్ని ముందుకు తెచ్చారో తవ్వితీసినట్లుగా మెక్‌గవర్న్ కూడా తాను తవ్వితీసిన మట్టిలో వైన్‌లో ఉండే ఆమ్లాలు పదిశాతం కనిపించాయని చెబుతున్నాడు. కొత్త రాతియుగం పదకొండువేల సంవత్సరాల క్రితం ప్రారంభమైందనుకుంటే తరువాతి చరిత్ర అంతా మందుమయమేనట. ఆసియా, మెక్సికో, ఆఫ్రికాలోని మన పూర్వీకులు గోధుమ, వరి, మొక్కజొన్న, బార్లీ, ఇతర తృణధాన్యాలను ప్రాథమికంగా మద్యం తయారీకే పండించారని దొరికిన ఆధారాలు చెబుతున్నాయని అంటున్నాడు. సహజవనరులు తక్కువగా ఉన్న స్థితిలో పురాతన మానవుడు అధికశక్తినిచ్చే పంచదార, మద్యం తాగిన కారణంగానే తొలి నాగరిక సమాజాలలో బతికి బట్టకట్టినట్లుగా భావించాలట.

- సత్య

చిన్న కథ

ఆ రచయితను నేనే...

- పొత్తూరి సుబ్బారావు



ఘాట్ రోడ్ పైకెళ్తూ జీపును డ్రైవర్ ఒక పక్కకు ఆపాడు. ఓ కొబ్బరికాయ తీసుకెళ్లి కొండల మధ్యలో వున్న ఒక దేవత శిలావిగ్రహం ముందు కొట్టాడు. ఆ తర్వాత వచ్చి కారు స్టార్ట్ చేశాడు. జీపులో ఉన్న రచయిత మధుకర్ ప్రశ్నించాడు డ్రైవర్‌ని

"ఏమిటి అక్కడ వున్నది? అందరూ కార్లను ఆపి మరీ కొబ్బరికాయ కొట్టి ముందుకు సాగుతారు" అని.

"అవును సార్. అక్కడవున్న విగ్రహం ముందు కొబ్బరికాయ కొట్టి ముందుకు సాగితే ఈ ఘాట్‌రోడ్‌లో మనకే ప్రమాదం జరగదు" అన్న డ్రైవర్ జవాబుకు ఆశ్చర్యంగా మళ్లీ అడిగాడు మధుకర్.

"అవును ఇక్కడ ఇప్పటిదాకా జరిగిన ప్రమాదాలన్నీ కొబ్బరికాయ కొట్టకపోతేనే జరిగివుంటాయంటావా?"

"ఏమో సార్ నాకు తెలియదు. మాకందరికీ అదో నమ్మకం" అన్న డ్రైవర్ సమాధానానికి మళ్లీ మాట్లాడలేదు మధుకర్.

మధుకర్ తాను చేరాల్సిన ఏజన్సీకి చేరగానే అక్కడ పని చేస్తున్న ప్రాజెక్టు ఆఫీసర్ తన చిరకాల మిత్రుడు రవిశంకర్‌తో అనేక విషయాలు చర్చిస్తూ ఆ దేవతా విగ్రహం ప్రసక్తిని తీసుకొచ్చాడు.

"అవున్రా! ఇక్కడ వున్న గిరిజనులు అక్కడ అమ్మవారు వెలిసిందంటూ ఎప్పుడూ మొక్కుబడులు చెల్లించుకుంటారు. ఆ దృశ్యాలను సిటీ నుండి ఘాట్‌రోడ్‌లో ప్రయాణించే డ్రైవర్లు చూసి అక్కడ కొబ్బరికాయలు కొట్టడం మొదలు పెట్టారు. ఆ తర్వాత అదే ఒక ఆచారం అయిపోయింది. ఒక వేళ డ్రైవర్లు మరిచిపోయినా కార్లలో కూర్చున్న ప్రయాణికులు ఎంత చదువుకున్న వారైనా దేవతా విగ్రహం జ్ఞాపకం చేయటం కూడా ఆనవాయితీ అయిందన్న రవిశంకర్ మాటలకు మధుకర్ నివ్వెరపోయాడు.

"అయినా గిరిజనులకే అనుకుంటే అంతకన్నా మూఢనమ్మకాలు ఎక్కువయ్యాయి ఈ చదువుకున్నవాళ్లకి" అని మనసులోనే అనుకుంటూ నిద్రలోకి జారిపోయాడు మధుకర్.

తెల్లవారగానే ప్రాజెక్టు ఆఫీసర్ రవిశంకర్ ఏర్పాటు చేసిన మీటింగులో ఎందరో జర్నలిస్టులు, రాజకీయ నాయకులు పాల్గొన్నారు. ఆ మీటింగులో గిరిజనుల సమస్యలతో పాటు ఘాట్‌రోడ్ దారిలో జరిగే అమ్మవారి పూజలు కూడా చర్చకు వచ్చాయి. చర్చలో భాగం పంచుకుంటూ ఆ ప్రాంతానికి చెందిన ఎం.ఎల్.ఎ కేశవనాయక్ మాట్లాడుతూ "ఎట్లాగైనా అక్కడున్న అమ్మవారికి గుడి కట్టించాలి. గుడి కట్టించాలంటే నిధులు కావాలి. నిధులు సమకూర్చుకోవాలంటే అక్కడి స్థల మహత్యాన్ని ప్రజలకు తెలియజేయాలి. అందుకు ఈ విషయం మీద పరిశోధన చేసి 'స్థల పురాణం' రాయగలిగే సమర్థవంతమైన రచయిత అవసరం" అనగానే ప్రాజెక్టు ఆఫీసర్ రవిశంకర్ సమాధానం చెపుతూ "దేవాదాయశాఖనుండి కొన్ని నిధులు సమకూర్చగలిగితే మంచి రచయితను చూసి స్థల పురాణం నేను రాయించగలను" అన్నాడు.

అందుకు ఎం.ఎల్.ఎ 'నిధుల విషయం హైదరాబాదుకు వెళ్లి నేను మంజూరు చేయించగలుగుతాను. మీరు స్థల పురాణం రాయించడం మొదలు పెట్టండని 'ప్రాజెక్టు ఆఫీసరుకు ఆదేశాలిస్తూ సభాస్థలి నుండి వెళ్లిపోయాడు.

మరుసటిరోజు ఈ విషయం రచయిత మధుకర్‌తో చర్చించాడు రవిశంకర్.

"నేను అభ్యుదయ భావాలు గల వాడనని నీకు తెలుసు. నన్నే స్థల పురాణం రాయమని అనడంలో అర్థం లేదు" అన్న మధుకర్ మాటలకు నవ్వుతూ రవిశంకర్ "నీ నమ్మకాలతో ఇక్కడ పనిలేదు. మహాకవి శ్రీశ్రీ వంటివారే సాయిబాబా మీద భక్తి గీతాలు రాశారు. అయినా ప్రభుత్వం తరుపు నుండి పదివేల దాకా నీకు పారితోషకం మంజూరు చేయిస్తాను. నీకు దైవభక్తి లేకపోయినా కొత్త విషయాన్ని క్రియేట్ చేయగల సృజనాత్మక శక్తి నీలో వుంది. కాదనకు. చక్కని సౌందర్యాన్ని సంతరించుకున్న ఈ అటవీ ప్రాంతంలో ఒక దేవాలయం కడితే అది కేవలం దైవభక్తులకే కాదు, ఒక గొప్ప టూరిజం ప్రాంతంగా అభివృద్ధి చెందుతుంది. అక్కడి నుండి వచ్చే ఆదాయాన్ని గిరిజనుల సంక్షేమానికి వినియోగించుకోవచ్చు. నీ పేరేమీ ఆ పుస్తకం మీద వేయం. నీకేమీ అపకీర్తి రాదు. దేవాదాయశాఖ పేరుతోనే బుక్‌లెట్‌లు ప్రచురిస్తాము" అనగానే మధుకర్ కొంత చల్లబడి రచనకు ఉపక్రమించాడు.

00000

ప్రతి ఏటా నెల రోజులపాటు ఆ ఏజెన్సీ ప్రాంతంలోని అమ్మవారి గుడికి దేశమంతటి నుండి విశేషంగా జనం రావడం మొదలయింది. దానితో ఘాట్‌రోడ్‌లో వాహన రద్దీ పెరిగిపోయింది. వాహనాల రాక పోకల కోసం రోడ్లను బాగా వెడల్పు చేశారు. సర్వవిధాలా ఆ ఏజెన్సీ ప్రాంతం అభివృద్ధి పథంలో ముందుకు సాగిపోతున్నది. 'స్థల పురాణం'లో చెప్పిన విధంగా నెల రోజులు భక్తులంతా దీక్షను స్వీకరించి ఆ తరువాత అక్కడ దీక్షను విరమించడం మొదలు పెట్టారు. దీక్ష వల్ల తమకు కలిగే ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకుని విపరీతంగా కానుకలు సమర్పించడంతో ఆ దేవాలయానికి ఆదాయం లెక్కకు మించి పెరిగిపోయింది.

ఒకప్పుడు గిరిజనులంతా అక్కడ తాము పూజించే విగ్రహం మటుమాయమైపోయింది. ఆ స్థానంలో బంగారు విగ్రహం వెలిసింది. వి.ఐ.పిల రద్దీ ఎక్కువ కావడంతో స్థానిక గిరిజనులను ఆ ఆలయానికి క్రమేణా దూరంగా వుంచడం మొదలుపెట్టారు. వాళ్లు కేవలం అక్కడ అటవీ ఉత్పత్తులను అమ్ముకుని డబ్బు తీసుకోవడానికి పరిమితమైనారు.

మధుకర్ ఆలోచనలో పడ్డాడు. తాను చేసిన పని ఈ విధంగా దారి తీస్తుందని కలలోకూడా అనుకోలేదు. గిరిజనులు, దారినపోయే వాహనదారులు, అమాయకంగా కొలిచే ఆ దేవతావిగ్రహం రూపు రేఖలు మారిపోవడానికి తన రచనే కారణం కదా! అని పశ్చాత్తాప పడసాగాడు మధుకర్. 'రవిశంకర్ చెప్పిన మాటలతో డబ్బుకు ఆశపడి ఎంత పనిచేశాను. అయినా ఈ విషయం ప్రజలకు చెప్పాలి' అనుకుంటూ దేవాలయ ప్రాంగణానికి వచ్చిన మధుకర్ గట్టిగా అరవసాగాడు "ఆ స్థల పురాణం అంతా అబద్ధం, మోసం, దాన్ని నేనే రాశాను. ఆ రచయితను నేనే అనగానే భక్తులంతా చుట్టూ మూగారు. "నీవు స్థలపురాణం రాయడమేమిటి? ఈ స్థల పురాణం ఎప్పుడో మన పురాణాల్లో రాసి వుంది. పోవయ్యా పో! ఇక్కడున్నావంటే జనం నిన్ను చితకబాదుతారు అని దేవాలయ కార్యనిర్వహణాధికారి అనగానే మధుకర్ పిచ్చిపట్టిన వాడిలాగా ఆ రచయితను నేనే...నేనే..." అంటూ పరిగెత్త సాగాడు.

★

చూద్దామా

పారిస్ పోదామా...

ఈఫిల్ టవర్, నోటర్ డామ్ చర్చి, అడుగడుగునా ఉద్యానవనాలు, మోనాలిసా చిత్రం, వీనస్ దేవతా విగ్రహాలున్న లోవ్ మ్యూజియమ్, నెపోలియన్ చక్రవర్తి ఉపయోగించిన దస్తులు, ఆయుధాలు, అతిపెద్ద వాణిజ్య కూడళ్లూ... ఇవన్నీ పారిస్ పర్యాటకులను ఎంతగానో అలరిస్తాయి. మరి ఈ వారం వీటి విశేషాలు తెలుసుకుందాం.

ఫ్రాన్స్ రాజధాని నగరమైన పారిస్‌ను 'ద సిటీ ఆఫ్ లైట్' అనీ, 'విహారయాత్రలకు స్వర్గధామం' అనీ పిలుస్తారు. ఇది ఫ్రాన్స్‌కు ఉత్తరాన ఉన్న సీన్ నది ఒడ్డున ఉంది. ఈ నగరానికి ఒక వైపున చారిత్రక నిర్మాణాలు, అద్భుత కట్టడాలు నగర చారిత్రాత్మకతను తెలిపితే మరో పక్కనున్న పెద్ద పెద్ద హోటళ్ల, ఉద్యానవనాలు ఆధునికతను తెలుపుతాయి. ఏటా ఈ నగరాన్ని 3 కోట్ల మందికి పైగా సందర్శిస్తున్నారంటే పర్యాటకులను ఎంతగా ఆకర్షిస్తుందో అర్థమౌతుంది. వ్యాపార వాణిజ్యాల ఆధునికతలో పారిస్ ముందంజలో ఉంటుంది. ప్రపంచంలో ప్రఖ్యాతి గాంచిన మ్యూజియమ్‌లు, పార్కులు పారిస్‌ను సుందర నగరంగా తీర్చిదిద్దాయి. ఫ్యాషన్‌షోలు, నైట్‌లైఫ్... ఒకటేమిటి ప్రతి ఒక్కటీ పర్యాటకులను కట్టిపడేసేవే.

19వ శతాబ్దంలో ఫ్రాన్స్‌ను పరిపాలించిన నెపోలియన్-3 ఈ నగర రూపురేఖలనే మార్చేశాడు. రోడ్లను విస్తరించాడు. నగరాన్ని విశాలం చేశాడు. అప్పట్లో ఇక్కడ ఓ విచిత్రమైన చట్టముండేది. వీధి పొడవును బట్టి ఆ వీధిలోని భవనాల ఎత్తు ఉండాలనేది ఆ చట్టం. అందుకే ఒక వీధిలో దాదాపుగా ఒకే ఎత్తున్న భవనాలు కనిపిస్తుంటాయి. పెద్దపెద్ద, ఎత్తైన భవనాలు, ప్రధానమైన కార్యాలయాలు, మార్కెట్లు, ప్రపంచ పరిశోధనా కేంద్రాలు, మైదానాలు బయటే వెలిశాయి. చరిత్రకు సంబంధించిన విషయాలను భద్రపరిచేందుకుగాను నగరంలో అనేక మ్యూజియమ్‌లు మాత్రం కనబడతాయి. వాటి సంఖ్య మరీ ఎక్కువ కావడంతో చట్టాన్నే మార్చేశారు.

పారిస్‌ను 20 జిల్లాలుగా చేశారు. పోస్టల్ కోడులోని చివరి రెండంకెలను బట్టి అది ఏ జిల్లానో ఇట్టే తెలిసిపోతుంది. మ్యూజియమ్‌లు, ఉద్యానవనాలు, చర్చిలు-వాణిజ్య కేంద్రాలు, చారిత్రక పర్యాటక ప్రదేశాలు అని పారిస్‌లో పర్యాటక ప్రదేశాలను నాలుగు రకాలుగా విభజించవచ్చు.

ఈఫిల్ టవర్

ఫ్రాన్స్ అన్నా, పారిస్ అన్నా ప్రతి ఒక్కరికీ గుర్తుకు వచ్చేది ఈఫిల్ టవరే అని చెప్పడం అతిశయోక్తి కాదు. దీనిని 1889లో ఫ్రెంచి విప్లవం జరిగి వంద సంవత్సరాలు నిండిన సందర్భంగా నిర్మించారు. నిర్మాణ రంగంలోనే ఒక 'అద్భుతం'గా ఈ కట్టడం పేరు పొందింది. దాని ఇంజనీరు గుస్తావ్ ఈఫిల్ పేరు మీదే ఈ కట్టడానికి ఈఫిల్ టవర్ అని పేరు పెట్టారు. దీని ఎత్తు 1000 అడుగులు. 1930 వరకూ ఇది ప్రపంచంలోనే అత్యంత ఎత్తైన కట్టడంగా ఉంది. దీనికి ప్రస్తుతం 1665 మెట్లున్నాయి. కానీ వీటి గుండా పైకి ఎక్కడానికి లేదు. లిఫ్టులు, ఎలివేటర్ల ద్వారా మాత్రమే పైకెళ్లడానికి అనుమతినిస్తున్నారు. దీని బరువు 10,100 టన్నులు. దీనికి వేసిన మూడు లేత రంగులు కిందికి వచ్చే సరికి ముదురుగా కనిపిస్తాయి. ఈ టవర్ సీన్ నది ఒడ్డున పచ్చని ఉద్యానవనాల మధ్య లేత రంగులలో మెరుస్తూ ఉంటుంది. సూర్యాస్తమయం సమయంలోగానీ, రాత్రి సమయాల్లోగానీ ఈ టవర్‌ను చూస్తుంటే సందర్శకులకు కనుల పండుగగా ఉంటుంది.

లోవ్ మ్యూజియం

పారిస్ నగరం మధ్యలోనున్న లోవ్ మ్యూజియం రాజభవనాన్ని తలపిస్తుంది. ఈ మ్యూజియమ్‌ను 1793లో ఏర్పాటు చేశారు. దీనిలో మత సంబంధమైన పెయింటింగులు ఎక్కువగా కనిపించినా కళాత్మకతలో మాత్రం అత్యద్భుతంగా ఉంటాయి. 1989లో ఈ మ్యూజియమ్‌లోనికి వెళ్లేందుకు గ్లాస్ పిరమిడ్‌ను ఏర్పాటు చేశారు. రంగురంగుల విద్యుద్దీపాలు, వీటి కాంతులలో ప్రకాశించే వాటర్ ఫౌంటెయిన్‌లు, బంగారు వర్ణంలో మెరిసిపోయే మ్యూజియమ్ భవనం... వంటివి పర్యాటకులను మైమరిపింపజేస్తాయి. ప్రపంచ ప్రసిద్ధ చరిత్రకారులుగా పేరు గాంచిన పికాసో, రోడిన్‌ల చిత్రాలను దర్శించే భాగ్యం మనకిక్కడ కలుగుతుంది. నెపోలియన్ బోనపార్టె తాను జయించిన ఆయా దేశాలనుండి అద్భుతమైన, గొప్పగొప్ప కళాఖండాలను పారిస్ నగరానికి తరలించాడు. వాటిలో ఎక్కువగా ఈ మ్యూజియమ్‌లోనే ఉన్నాయి. ఇక్కడ సుమారు 40 వేల విగ్రహాలు ఉన్నాయి. మోనాలిసా చిత్రం, వీనస్ దేవత విగ్రహం ఇక్కడి ప్రత్యేకతలు. ఈ మ్యూజియమ్‌ను ప్రతి సంవత్సరం సుమారు 60 లక్షల మంది సందర్శిస్తుంటారు. ఈ మ్యూజియంలో ఒక రెస్టారెంటు, ఒక షాపింగు మాలు కూడా ఉన్నాయి.

జాతీయ సైనిక ప్రదర్శనశాల

ఇది మిలిటరీ మ్యూజియం. దీన్నే లెస్ ఇన్‌వేలిడెస్ అని కూడా పిలుస్తారు. ఈ మ్యూజియంలోకి అడుగుపెట్టగానే యుద్ధ వాతావరణం కనిపిస్తుంది. యుద్ధ సమయాల్లో ధరించే దుస్తులు, ఉపయోగించే ఆయుధాలు కనిపిస్తాయి. అక్కడ నెపోలియన్ చక్రవర్తి ఉపయోగించిన దస్తులు, టోపీ శిరస్త్రాణం వంటివి ఆకర్షణీయంగా ఉంటాయి. ఆయన సమాధిని కూడా ఇందులో మనం చూడొచ్చు. మొదటి, రెండో యుద్ధసమయాల్లో ఫ్రాన్స్, జర్మనీ సైనికులు



ఈఫిల్ టవర్

లోవ్ మ్యూజియం



ఆర్క్ డి ట్రయంఫ్



నోటర్ డామ్ చర్చి



చాంప్స్ ఎలిసీస్

ఉపయోగించిన దుస్తులు, శిరస్త్రాణాలు, తుపాకులు, మెషీన్‌గన్‌లను కూడా ఈ మ్యూజియమ్ మొదటి అంతస్తులో ఉంచారు. ఇలా ఈ మ్యూజియంలో సుమారు 5 లక్షల వస్తువులున్నాయి.

ఎటు చూసినా ఉద్యానవనాలే

అధిక సంఖ్యలో ఉద్యానవనాలు ఉండడంతో నగరమంతా పచ్చగా ఉంటుంది. అక్కడి వాతావరణం ఎంతో ఆహ్లాదకరంగా ఉంటుంది. ఉద్యానవనాలు ఎక్కువగా ఉన్న నగరాలలో పారిస్ ఒకటి.

లగ్జెంబర్గ్ గార్డెన్

13వ లూయీ చక్రవర్తి దగ్గర వైద్యుడిగా పనిచేసిన బ్రాస్ దీన్ని ఏర్పాటు చేశాడు. పారిస్‌లో మొట్టమొదటి పబ్లిక్ గార్డెన్ ఇది. అయితే దీనికి ఒక ప్రత్యేకత ఉంది. అదేమిటంటే ఈ ఉద్యానవనంలోని మొక్కలు, చెట్లు అన్నీ వైద్యసంబంధమైనవే.

ప్రొమనేడ్ ప్లాంటీ

సుమారు 5 కిలోమీటర్ల పొడవుండే ఈ పార్కుకు ఒక ప్రత్యేకత ఉంది. దీని ప్రారంభంలో సమతలంగానే ఉంటుంది. కానీ లోపలికి వెళ్లేకొద్దీ ఎత్తు పెరుగుతుంది. పైకెళ్లిన తరువాత అక్కడి వాతావరణం చాలా బాగుంటుంది. రంగురంగుల పూలమొక్కలూ, తీగలతో ఉండే ఆర్చీలు స్వాగతం పలుకుతుంటాయి.

చాంప్స్ ఎలిసీస్

ఈ ఉద్యానవనంలో దారికిరువైపులా ఉన్న చెట్లు(అవెన్యూ) ఎంతో అందంగా ఉంటాయి. దీన్ని 17వ శతాబ్దంలో విహారార్థం ఏర్పాటు చేశారు. దీనికి ప్రపంచంలో అతి సుందరమైన అవెన్యూగా పేరుంది.

ఆర్క్ డి ట్రయంఫ్

ఎనిమిదో జిల్లాలో చాంప్స్ ఎలిసీస్‌కు దగ్గరలోనే ఈ 'విజయ చిహ్నం' ఉంది. ఆస్ట్రేలియాపై సాధించిన విజయానికి గుర్తుగా 1806లో నెపోలియన్ బోనపార్టె దీని నిర్మాణాన్ని మొదలు పెట్టారు. 51 మీటర్ల ఎత్తు, 45 మీటర్ల వెడల్పు ఉన్న ఈ ఆర్చి ప్రపంచంలో ఎత్తైన రెండో విజయ చిహ్నం. అత్యంత ఎత్తైన విజయం చిహ్నం ఉత్తర కొరియాలో ఉంది.

నోటర్ డామ్ చర్చి

ఈ చర్చి ఫ్రాన్స్‌లో అతిపెద్దది. ప్రపంచ ప్రసిద్ధిగాంచింది. దీన్ని మేరీ మాత చర్చి అంటారు. ఫ్రెంచి భాషలో 'నోటర్ డామ్ డి పారిస్' అంటారు. అంటే 'పారిస్ నగర యువతి' అని అర్థం. ఈ చర్చిలో ఉండే మేరీ మాత నల్లరాతి విగ్రహం చాలా బాగుంటుంది. దీన్ని 1163లో కట్టడం ప్రారంభించారు. పూర్తికావడానికి దాదాపు 170 సంవత్సరాలు పట్టింది. ఈ చర్చి బయటి నుంచి చూస్తేనే చాలా బాగుంటుంది. ఇంక లోపలికి వెళ్తే చెప్పక్కర్లేదేమో! అంత బాగుంటుంది. ఇంక బయటికే రావాలనిపించదు. రంగురంగుల స్టెయిన్డ్ గ్లాస్ కిటికీలు వీరి భవన నిర్మాణ శైలిని కనబరుస్తాయి. అందమైన రకరకాల పెయింటింగులు, వాటిమీద ఉండే సూక్తులు ఎంతో స్ఫూర్తినిచ్చేవిగా ఉంటాయి. పాలరాతితో రూపొందించిన వివిధ రకాల జంతువులు జంతుశాలలను తలపిస్తాయి. ఇంకా వాటి నోటిలోనుంచి నీరు పడుతున్న ఏర్పాట్లు చాలా బాగుంటాయి. ఈ చర్చిలోపలికి వెళ్లడానికి మూడు గుమ్మాలున్నాయి. ఈ చర్చిలోని అత్యంత ఎత్తైన భవనంలో ఒక గంట ఉంది. దాని బరువు 16 టన్నులు ఉంటుంది. దీన్ని బంగారం, కంచు, ఇత్తడి వంటి లోహాలతో చేశారు. ఈ గంటలోపల ఉండే కాడ బరువే 500 కిలోలు! ఇక్కడకు చేరుకోవాలంటే 400 మెట్లు ఎక్కాల్సిందే. పశ్చిమ భాగంలోని ఈ భవన శిఖరాలు 226 అడుగుల ఎత్తుంటాయి. ఆదివారం, సెలవురోజులు తప్ప అన్ని వేళల్లో ఈ చర్చిని సందర్శించొచ్చు. ఈ చర్చిని చూడ్డానికి సంవత్సరానికి కోటికి పైగా జనం వస్తుంటారు. ఈ చర్చిని పూర్తిగా చూడ్డానికి ఒక రోజు కేటాయించాల్సిందే.

లా డిఫెన్స్... అతిపెద్ద వాణిజ్య కూడలి

లా డిఫెన్స్ జిల్లాలోని వాణిజ్యకూడలి యూరప్‌లోనే అతిపెద్ద కూడలి. అంతేకాదు ఇది ప్రపంచ ప్రఖ్యాత పర్యాటక కేంద్రం కూడాను. ఇది పారిస్‌కు పశ్చిమ భాగంలో ఉంది. ఇక్కడ అన్ని అత్యాధునిక పరికరాలు దొరుకుతాయి. ప్రపంచంలోని అనేక రకాల బ్రాండుల ఆభరణాలు, వస్త్రాలు, ఎలక్ట్రానిక్ పరికరాలు... ఇలా అన్నీ ఇక్కడ ఉంటాయి. ఆధునిక పరికరాలే కాదు పురాతన వస్తువులు, కళాఖండాలు కూడా ఇక్కడ దొరుకుతాయి. 18వ జిల్లాలోని క్లింగన్‌కోర్ట్ మార్కెట్‌లో వీటిని కొనుక్కోవచ్చు. ఖరీదైనవేం కొంటాం అనుకునే వాళ్లకు సెకండ్‌హేండ్ వస్తువులను కొనుక్కునే అవకాశం కూడా ఉంది. ఈ మార్కెట్ సెకండ్‌హేండ్ వస్తువులకు ప్రసిద్ధి.

రకరకాల వంటలు...

పారిస్ నగరం ప్రపంచ ప్రసిద్ధిగాంచిన పర్యాటక కేంద్రం అవడం వల్ల ఇక్కడ ఉండే హోటళ్లలో వివిధ దేశాలకు చెందిన వంటలు దొరుకుతాయి. ఇటలీ, ఇండియన్, థాయ్, అమెరికన్ రెస్టారెంట్లు ఉన్నాయి. అయితే మొరాకో, అల్జీరియా దేశాలకు చెందిన వంటకాలు ఎక్కువగా ఉంటాయి.

దొంగలూ ఎక్కువే

మరి ఇంత అందమైన నగరంలో దొంగలూ ఎక్కువే. కాబట్టి పర్యాటకులు తమ లగేజీని జాగ్రత్తగా కాపాడుకోవాలి. పిల్లలు, యువకులు గుంపులుగుంపులుగా వచ్చినప్పుడు అప్రమత్తంగా ఉండకపోతే ఇక తమ వస్తువులను మరిచిపోవలసిందే. వాతావరణం ఎప్పుడు ఏవిధంగా ఉంటుందో చెప్పలేం. ఎప్పుడైనా వర్షం రావచ్చు.

ఇక్కడ ఇంగ్లీషు రాని వాళ్లు చాలా మందే ఉంటారు. వీళ్లకు మాతృభాషంటే మక్కువనే చెప్పాలి.

పారిస్ కరెన్సీ యూరోలు. ఒక యూరో సుమారు 67 రూపాయలు. అక్కడ పోస్టాఫీసులు, బ్యాంకులు, పెద్ద పెద్ద డిపార్టుమెంటు స్టోర్లలోనూ మన కరెన్సీ మార్చుకుని యూరోలను తీసుకునే అవకాశముంటుంది. కాకపోతే మనకు కావలసిన సమయం కన్నా ఒకరోజు ముందుగా ఇవ్వాలి.

పారిస్‌లో ప్రయాణ సౌకర్యాలకు ఎటువంటి ఇబ్బందీ ఉండదు. ఉదయం 5 గంటల నుంచి రాత్రి ఒంటి గంట వరకు రైళ్లున్నాయి. అత్యాధునిక సౌకర్యాలతో కూడి మెట్రో వ్యవస్థ ఉంది. అన్ని ప్రధాన పర్యాటక కేంద్రాలను కలుపుతూ రైళ్లు ఉంటాయి.

✶

వికాసం

సృజనాత్మకత

పిల్లల సృజనాత్మకతను పెంచడంలో తల్లిదండ్రుల పాత్ర గొప్పది. పిల్లలు ఎప్పుడూ ఏదో ఒక కొత్త విషయం తెలుసుకోవాలని, కొత్తదాన్ని కనిపెట్టాలని ప్రయత్నిస్తుంటారు. ఏవేవో ప్రయోగాలు చేస్తూ ఉంటారు. ఇది వారికి పుట్టుకతోనే వస్తుంది. దీన్ని అలాగే కొనసాగిస్తే జీవితంలో మంచి స్థాయికి ఎదగడానికి అవకాశముంటుంది. కానీ పిల్లలు శ్రమపడకుండా వారి కోసం తల్లిదండ్రులు అన్నీ సమకూర్చడం వల్ల కూడా వారు బద్ధకస్తులుగా తయారవుతారు. వారి మెదళ్లు మొద్దుబారతాయి. మన లాగే లలిత కూడా అనుకుంది. కానీ అలా చేయడం వల్ల పిల్లల అభివృద్ధికి మనమే ఎలా అవరోధంలా తయారవుతామో త్వరగానే తెలుసుకుంది.

లలిత వాళ్ల ఇల్లు చూస్తే ఒక చిన్న బొమ్మల షాపులా అనిపిస్తుంది. ఆమెకు ఒక బాబు ఉన్నాడు. ఆమె ఏదైనా పనిమీద షాపుకు వెళ్లిందంటే వాడికోసం ఏదో ఒక బొమ్మను తేకుండా ఊరుకోదు. అలా తీసుకురాకపోతే ఆమె మనసు వెలితిగా ఉంటుంది. అందుకే ఎప్పుడు షాపుకు వెళ్లినా ఒక కొత్తరకం బొమ్మను తీసుకువస్తుంది. ఆమె భర్త అప్పుడప్పుడూ 'ఎందుకు డబ్బు దుబారా చేస్తావు?' అని అన్నా బొమ్మలు తేవడం మానేది కాదు. ఆయనకు ఏదో ఒకటి సర్దిచెప్పేది. అయితే ఒక సారి తన కొడుకుకు డ్రమ్ తీసుకురావాలని అనుకుంది. అయితే అది చూడడానికి పిల్లలు ఆడుకునేదానిలా ఉండాలి, కానీ వాయిస్తే నిజమైన డ్రమ్‌కి వచ్చే సంగీతం రావాలని అనుకుంది. కానీ అది ఎక్కడా దొరకలేదు. అయితే ఒక రోజు తన కొడుకు ఒక పజిల్ డబ్బాను కొట్టుకుంటూ వచ్చి 'డ్రమ్' అన్నాడు. అప్పుడు వెంటనే ఆమెకు ఇంట్లో ఉన్న వస్తువులన్నీ డ్రమ్‌లాగా కనిపించాయి. వాటి నుంచి వచ్చే శబ్దం కూడా చాలా గొప్పగా ఉంది.

అది చాలా మంచి అవకాశంగా అనిపించిందామెకు. ఆ బాబు అలా డబ్బాను వాయించడంతో ఆమె మనసులోకి కొన్ని ఆలోచనలు వచ్చాయి. ఇక అటువంటి డ్రమ్‌ను కొనాలనే ఆలోచనను మానుకుంది. వాడికి అవకాశమిస్తే వాడే దాన్ని తయారుచెయ్యగలడని, వాడు దేన్నుంచైనా సంగీతాన్ని సృష్టించగలడనీ అనుకుంది.

పిల్లలకు బొమ్మలు కావాలనే ఆలోచన వాళ్లలో నేర్చుకునే శక్తిని, అభివృద్ధిని కలిగిస్తుంది. వారి జ్ఞానాన్ని పెంచుతుంది. ఇంట్లో ఉన్న పనికిరాని వస్తువులతో తమకు కావలసిన వస్తువులను తయారుచేయాలనే ఊహలకు రెక్కలు వస్తాయి. మనం రోజూ పనికిరావనిఇంట్లోని ఎన్నో వస్తువులను పారేస్తూ ఉంటాం. ప్లాస్టిక్ సీసాలు, డబ్బాలు, మూతలు, మెటల్ గాజులు, మందుల డబ్బాలు, చెప్పుల డబ్బాలు వంటి వాటితో బోలెడన్ని ఆటవస్తువులు తయారుచేసుకోవచ్చు. రైలు, విమానం, డ్రమ్.... ఇలా ఏదైనా చేసుకోవచ్చు. అలా చేయడం వల్ల పిల్లల మేధా శక్తి కూడా పెరుగుతుంది. హెచ్చుతగ్గులు, ప్రయోజనాలు, పనికిరాని చిన్నచిన్న వస్తువులు పిల్లల సృజనాత్మకతను, కొత్త ఆలోచనల పరిధిని పెంచుతాయి.

సమయం కోసం వేచిచూడడం వ్యర్థమని లలిత తెలుసుకుంది. కొన్ని విషయాలను త్వరగా ప్రారంభించడం మంచిది. కాకపోతే దాన్ని మంచి పద్ధతిలో మొదలుపెట్టాలి. అలా సమయం కోసం వేచి చూస్తూ ఉంటే ఆ దశలోనే ఉంటాం. సాహసం, మంచి ఉపాయాలు కలిగి ఉండాలి. తనకు నైపుణ్యం లేదని, జ్ఞానం లేదని లలిత చాలా పనులకు సాహసం చేయలేకపోయింది. అలా ఆమె చేతికి వచ్చిన అవకాశాలను చాలా వదులుకుంది.

నిజానికి అన్వేషణ అనేది కొత్తకొత్త వాటిని కనుగొనడానికి దారితీస్తుంది. ఎటువంటి సౌకర్యాలూ లేని వాడే దొంగతనాలకు పాల్పడతాడు. వారు ఎటువంటి అనుభవమూ లేకుండా తప్పుడు పనులను ధైర్యంగా మొదలుపెడతారు. అనుకోని పరిశోధనలు, ఊహించని ఫలితాల వల్లే ప్రపంచపు కొత్త విజ్ఞానపు క్షేత్రాలు పుట్టుకొచ్చాయి. కొలంబస్ అమెరికాను అనుకోకుండానే కదా కనిపెట్టింది. కొలంబస్ ధైర్యం చేయడం వల్లే తను స్వంతంగా ప్రపంచ పటాన్ని తయారుచేశాడు. ఏమీ లేకుండా దేనినైనా చేయడానికి, లేదంటే మనదగ్గర ఉన్నవాటి నుంచి కొత్తవి చేయగలగడానికి మనం రూపొందించాలనుకున్న వాటిని మనసులో చూడగలిగే శక్తి, ఊహించే శక్తి ఉండాలి. ఏదైనా చేయాలని అనుకునే వాళ్లు అవి లేవు, ఇవి లేవు అని బాధపడరు. ఏమీ దొరకని దగ్గర కూడా అవకాశాన్ని వెతుక్కుంటారు. వారి ఉత్సాహవంతమైన మెదళ్లకు ప్రపంచం ఒక విశాలమైన, పెద్ద ప్రయోగశాలగా కనపడుతుంది. ప్రపంచం మనదే. దాన్ని తెరిచి మనమే ముందంజలో ఉందాం.

-సంధ్య



కల్పనారెడ్డి కళాకౌశలం



ఫోటోలంటే మనకు కనిపించే వాటికి యథాతథమైన ప్రతిరూపాలని సాధారణంగా భావిస్తుంటాము. కాని మూలాధారమైన వాటితో సంబంధం లేకుండా వాటికవే స్వతంత్రమైన కళాఖండాలుగా తలపించే రీతిలో ఛాయాచిత్రాలను రూపొందించడం చేయితిరిగిన ఫోటోగ్రాఫర్లకు మాత్రమే సాధ్యం. అలాంటి అరుదైన కళానైపుణ్యం కలిగిన ఓ వ్యక్తి కల్పనా రెడ్డి. హైదరాబాదుకు చెందిన అమె బరోడా విశ్వవిద్యాలయం ఫైన్ ఆర్ట్స్ కళాశాలలో అధ్యాపకురాలిగా పనిచేస్తూ ఇటీవలనే కన్ను మూశారు. ఆమె స్మృత్యర్థం ఆప్తులు, సన్నిహితులు 2009 డిసెంబరు 27-29 తేదీలలో ఆమె గత నాలుగేండ్లలో తీసిన ఛాయాచిత్రాలలో కొన్నింటిని ఎంపిక చేసి హైదరాబాదు, కళాకృతి ఆర్ట్ గ్యాలరీలో ప్రదర్శనగా ఏర్పాటు చేశారు. ప్రింటింగ్ దశలో అందుబాటులో ఉన్న సాంకేతిక పద్ధతుల ద్వారా ఫోటోలను మార్పులు చేర్పులు చేయడానికి కల్పనా రెడ్డి అంగీకరించరు. ఇలాంటి మార్పులు చేర్పులకు డిజిటల్ ఫోటోగ్రఫీ వచ్చిన తర్వాత అవకాశాలు విపరీతంగా పెరిగాయి. అలాంటి డిజిటల్ ఫోటోఫ్రీని అయిష్టంగానే అయినా అనుసరించడం ఆరంభించిన తర్వాత సైతం ఆమె ఇదే పద్ధతిని అనుసరించారు. తీసిన ఫోటోలను నేరుగా ప్రేక్షకులకు అందించడమే ఆమె చేస్తారు. అయితే ఆమె తన కళాత్మక సృజనను సంపూర్ణంగా వినియోగించేది ఫోటోను తీయడానికి ముందే. అందుచేతనే అమె ఫోటోలలో ఒరిజినాలిటీ కొట్టొచ్చినట్లు కనిపిస్తుంది. పైగా ఆమె ఫోటోలను ఆరుబయట, సహజసిద్ధమైన కాంతిలో తీస్తారు. అవన్నీ ప్రకృతికి సంబంధించిన చిత్రాలే. గాలిలో తేలియాడే అరటి ఆకులు వాటి నీడలు, సూర్యకాంతిలో మిలమిల మెరిసే నెమలి ఈకలు, సముద్ర తీరంలో ఇసుకపై అలలు సృష్టించే ఆశ్చర్యకరమైన ఆకృతులు, రాళ్ళ రప్పలు, చెట్ల కాండాలు, కొమ్మలు, ఆకులు - ఇలాంటి వాటినన్నింటిని ఆమె విలక్షణమైన కళాదృష్టితో అద్భుతమైన కళా ఖండాలుగా తాను దర్శించి వాటిని తన కెమెరా ద్వారా ప్రేక్షకులకూ అందించారు.

-విజయరావు

J-17; Jun-6

ఉత్తమ చిత్రకారుడు

కోశల రాజు, రాణిలకు చిత్రలేఖనం అంటే ప్రాణం. అందుకే దాన్ని అభివృద్ధి పరచాలని ఉద్దేశంతో ప్రతి సంవత్సరం చిత్రలేఖనం పోటీలు పెట్టి విజేతలకు బహుమతులిచ్చేవారు. అలాగే ఒక సంవత్సరం తైలవర్ణ చిత్రలేఖనం పోటీలు పెడదామని అనుకున్నారు. ఆ విషయాన్ని అన్ని ప్రాంతాలలోనూ ప్రకటించారు. పోటీలో పాల్గొనదలచుకున్న వారు చిత్రాలను గీసి పది రోజుల్లో తమకు పంపించాలని తెలిపారు. ఇది తెలిసి రాజ్యంలో నలుమూలల నుంచి గొప్పగొప్ప చిత్రకారులు అందమైన చిత్రాలను పోటీకి పంపారు. కళానిధి కూడా ఒక చిత్రాన్ని గీసి పంపాడు.

కళానిధికి చిన్నప్పటి నుంచి చిత్రాలు గీయడమంటే చాలా ఇష్టం. ఏవో బొమ్మలను గీస్తూ ఉండేవాడు. అందరినీ ఆకట్టుకునే చిత్రాలను గీసి ఎప్పటికైనా రాజ్యంలో తిరుగులేని చిత్రకారుడిగా పేరు పొందాలని ఆయన కోరిక. ప్రకృతి అందాలను, తనకు నచ్చినవారి రూపాలను, తన ఊహలను చిత్రాలుగా మలిచేవాడు. వాటిని తన స్నేహితులకు, చుట్టపక్కల వారికి చూపించి ఎలా ఉన్నాయని అడిగేవాడు. కొన్ని బాగా వచ్చేవి. మరి కొన్ని అంత బాగా ఉండేవి కావు. బాగా రాని వాటిని మంచిగా వేయడానికి ప్రయత్నించేవాడు. కళానిధికి ఒక స్నేహితుడు ఉన్నాడు. ఆయన కళానిధిని ఎప్పుడూ ప్రోత్సహిస్తూ ఉండేవాడు. కళానిధి వేసే చిత్రాలలో లోపాలేమైనా ఉంటే చెప్పేవాడు. కళానిధి ఇప్పటివరకు చాలా పోటీల్లో పాల్గొన్నాడు. కానీ న్యాయనిర్ణేతలను మెప్పించలేకపోయేవాడు. అయినా పట్టుదలతో సాధించలేనిది ఏదీ లేదనే నమ్మకం ఆయనది. మొదటి బహుమతి పొందలేకపోయినప్పుడు ఆయన చాలా విచారం చెందితే తన స్నేహితుడు కళానిధిని ఓదార్చేవాడు. "ఎప్పటికైనా నీవు గొప్ప పేరు సంపాదిస్తావు. నువ్వు మాత్రం చిత్రాలను వేయడం ఆపొద్దు" అని చెప్తుండేవాడు. కానీ ఆయన కూడా తన మిత్రుడి చిత్రాలకు బహుమతి రాకపోయేసరికి చాలా బాధపడేవాడు. అందుకే ఈ సారి కూడా కళానిధి చిత్రం గెలుపొందకపోతే ఆయన ఎక్కడ బాధపడిపోతాడోనని "చూడు మిత్రమా ఈ పోటీలో మేధావులు పాల్గొంటారు. నీలాంటి వారికి స్థానం ఉండకపోవచ్చు. నీ ప్రయాణ ఖర్చులు వృధా చేసుకోకు" అని సలహా ఇచ్చాడు.

కళానిధి ఆయన మాటలు లెక్కచేయలేదు. తనకు తన కోరికే మనసులో బలంగా నాటుకుంది. పోటీలో పాల్గొనాలని నిర్ణయించుకున్నాడు. ఒక పరదా బొమ్మను వేశాడు. దాన్ని పోటీకి పంపాడు. పోటీకి వచ్చిన చిత్రాలన్నిటినీ న్యాయనిర్ణేతలు పరిశీలించడం మొదలు పెట్టారు. వారితో పాటు రాజు, రాణి కూడా చూస్తున్నారు. మొదటి చిత్రం కలుగులో ఉన్న ఎలుక నెమ్మదిగా బయటికి చూస్తూ ఉన్నట్టు ఉంటుంది. దాన్ని పరిశీలిస్తున్నప్పుడు హఠాత్తుగా ఒక పిల్లి ఆ ఎలుక బొమ్మ మీదకు దూకింది.. తరువాత చిత్రంలో తేనెటీగలు, రంగురంగుల పూలు ఆకర్షణీయంగా ఉన్నాయి. దాన్ని పరిశీలిస్తుంటే ఝుమ్మని రొద చేసుకుంటూ వచ్చిన కొన్ని తేనెటీగలు పూలలోని మకరందాన్ని జుర్రుకోవాలని ఆ పూల మీద వాలాయి. మరొక చిత్రంలో ఒక స్త్రీ బుట్టలో పండ్లు తీసుకెళ్తుంది. వాటిని చూసిన పక్షులు తిందామని పండ్ల మీద వాలాయి. కీటకాలను, జంతువులను, పక్షులను ఆకర్షించేవిగా ఉన్నాయి కానీ మనుషులను మైమరిపించే చిత్రాలు కనపడవే అనుకుంటూ తరువాతి చిత్రాలన్నిటినీ చూశారు. కానీ వారికేవీ నచ్చలేదు. ఇక బయటికి వెళదామని అక్కడ వేలాడుతున్న పరదాని పక్కకు జరపబోయింది రాణి. అంతే ఒక్క సారిగా ఆమె ఆశ్చర్యపోయింది. ఎదురుగా ఉన్నది నిజమైన పరదా కాదని అది కళానిధి వేసిన అద్భుత చిత్రమని అక్కడివారికి తెలియడంతో చాలా సంతోషించారు. మొదటి చిత్రం పిల్లిని మాయ చేస్తే, రెండోది కీటకాలను బోల్తా కొట్టించింది. ఇప్పుడు ఈ చిత్రం ఏకంగా మానవుణ్నే చాలా అందంగా బోల్తా కొట్టించింది అని వారంతా కళానిధిని మంచి చిత్రకారుడిగా గుర్తించి ఆయనకు మొదటి బహుమతిని ప్రకటించారు.

ఈ విషయం తెలిసిన కళానిధి, ఆయన స్నేహితుడి ఆనందానికి అవధుల్లేకుండా అయింది. స్నేహితుడి ప్రతిభ గుర్తించకుండా పోటీలో పాల్గొనద్దని అన్నందుకు ఒకింత బాధ పడ్డాడుకూడా. తరువాతి రోజు సభలో రాజుగారు కళానిధికి హర్షధ్వానాల మధ్య బహుమతిని ఇచ్చి మెచ్చుకున్నారు. దీంతో కళానిధి రెట్టింపు ఉత్సాహంతో చిత్రాలను గీయడం మొదలుపెట్టాడు. ఆయన చేతుల నుండి జాలు వారిన ఆ చిత్రాలు రాజుగారిని ఎంతగానో మైమరిపింపజేసేవి. ఆయన ప్రతిభను చూసి రాజుగారు కళానిధిని తమ ఆస్థాన చిత్రకారుడిగా నియమించాడు. దాంతో కళానిధి కోరిక నెరవేరింది.

- లక్ష్మీనారాయణ